ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప

: fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-8-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 205 పేజీలు: 10+4 వెల: 6.50

అంతరిక్షంలో సుదూర తీరాలను శోధిద్దాం: ప్రధాని

రష్యా అణువిద్యుత్ ప్లాంట్‌పై ఉక్రెయిన్ డ్రోన్ దాడి

5లో

# గాడి తప్పితే కఠిన చర్యలే

## పార్టీ ఎమ్మెల్యేలకు గట్టి హెచ్చరిక చేసిన సిఎం చంద్రబాబు

## రెండోసారి పిలిచి చెప్పించుకోకండి

## సెప్టెంబర్ 6న అనంతపురంలో 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' కార్యక్రమం



**విజయవాడ,ఆగస్టు 24,ప్రభాతవార్త ప్రతినిధి :** క్రమశిక్షణతో వ్యవహరించని ప్రజాప్రతినిధులను ప్రజలు గౌరవించరు. పార్టీ సహించదని టిడిపి జాతీయ అధ్యక్షుడు, సిఎం చంద్రబాబు నాయుడు టిడిపి ఎంఎల్‌ఎలు కొందరు ఇటీవల వివాదాస్పద ప్రవర్తనతో వార్తల్లో ్లకి ఎక్కడంపై ముఖ్యమంత్రి చంబ్రాబు తీవ్రంగా స్పందించారు.ఇప్పటికే వారిని గత రాత్రి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి పిలిపించి మాట్లాడిన చంద్రబాబు తదనుగుణంగా తాజాగా వారికి కీలక మార్గదర్శకాలు జారీ చేపారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌కు వెళ్తున్న సందర్భంగా అందుబాటులో ఉన్న మంత్రులు, ఎంఎల్‌ఏలతో మాట్లాడారు.'గాడి తప్పుతున్న ఎంఎల్‌ఎలకు ఒకసారిపిలిచి పద్దతి మార్చుకోవాలని చెప్పాను,.తీరు మారకపోతే రెండోసారి మళ్లీ పిలిచి చెబుతాను.అప్పటికే మారకపోతే మరోసారి చెప్పడం ఉండదు. కఠినంగా వ్యవహరిస్తాను.. అసలు రెండోసారి పిలవాలా వద్దా అన్నది వారి ప్రవర్తనపై ఆధారపడి ఉంటుందన్నారు.పార్టీ విధానాలు, సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఎదొకటి మాట్లాడటం సమస్యలను పెంచడం సరికాదన్నారు. వ్యక్తిగత అంశాల్లో తలదూర్చడం, పార్టీ అధిష్టానానికి తెలియకుండా ఎదొకటి మాట్లాడటం సరికాదన్నారు. నిన్ననే అందరికి సవివరంగా తెలిపాను, విధానం మార్చుకుంటారనుకుంటున్నానన్నారు. పార్టీ లోక్‌సభ నియోజక వర్గ అధ్యక్షులు,కమిటీల ఎంపికపై నియమించిన త్రిసభ్య కమిటీల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ విషయం చెప్పారు. 'కూటమి బాగుంటేనే ప్రజలు బాగుంటారు. ప్రజాప్రతినిధులే తప్పులుచేయడం సరికాదు. సమన్వయకర్తలు, ఇన్‌ఛార్జి మంత్రులు ఈ విషయాన్ని ఎంఎల్‌ఎలకు అర్థమయ్యేలా చెప్పండి' అని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబరు 6న అనంతపురంలో సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. 'గెలిచాం..అధికారంలో ఉన్నామని ధీమావద్దు. వైఎస్సార్సీ తప్పుడు ప్రచారాలపై మౌనంగా ఉండొద్దు. ప్రజలకు వాస్తవాలు చెబుతూనే ఉండాలి'.అని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. 'సంక్షేమ పథకాలపై చర్చ జరగకూడదనేది వైఎస్సార్సీ ప్రధాన లక్ష్యం.కానీ చేసిన మంచిని ప్రజలకు వివరించాల్సిన భాధ్యత మనపై ఉంది' అని చంద్రబాబు పేర్కొన్నారు. సీనియర్ ఎంఎల్‌ఎలకు పార్టీ విధానాలు,క్రమశిక్షణ గురించి తెలుసు కాబట్టి పద్దతిగా నడుచుకుంటున్నారని, కొత్తగా ఎన్నికైన ఎంఎల్‌ఎలు మరింత భాధ్యతగా ఉండాల్సింది పోయి అక్కడక్కడ గాడి తప్పుతున్నారనిపేర్కొన్నారు. ఇప్పటివరకు 35మంది ఎంఎల్‌ఎలను పిలిచి ముఖాముఖి మాట్లాడానని తెలిపారు. 'పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాం.పార్లమెంటరీ కమిటీల నియామకం అత్యంత పారదర్శకంగా,పకడ్బందీగా జరగాలి. కమిటీల నియామకంలో సోషల్ రీ ఇంజనీరింగ్ జరగాలి. అన్ని వర్గాలకూ ప్రాతినిథ్యం కల్పించాలి. బలమైన నేతలకు అవకాశం ఇవ్వాలి. కమిటీలు బలంగా,చురుగ్గా' ఉండాలి అని చంద్రబాబు తెలిపారు.తెలుగుదేశం సిదా ంతం చాలా బలమైంది. పార్టీని రీ ఆర్గనైజ్,రీ స్ట్రక్చర్ చేశాం. యువతకు అవకాశాలిస్తున్నాం. అందుకే ఇన్నేళ్లుగా పార్టీ ప్రజాదరణ పొందుతోంది. ఎన్నో పోరాటాలు చేసి ఇక్కడికొచ్చామని,సవాళ్లు ఎదుర్కొని నిలబ డ్డామని మర్చిపోవద్దు. అధికారంలో >>2



ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన స్పీకర్ల సదస్సులో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కేంద్రమంత్రి కిరణ్ రిజుజు తదితరులు

# చట్ట సభలు రాజకీయ లబ్ధికి కాదు..

## ప్రజా సమస్యల చర్చలపైనే దృష్టి పెట్టాలి

## ప్రభుత్వం, విపక్షాలు సభానియమాలు పాటించాలి

## అఖిల భారత స్పీకర్ల సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు24:** చట్టసభలు, ప్రజా సమస్యలపై చర్చలు జరపడానికేగానీ, రాజకీయ లబ్ధిపొందేలా వ్యవహరించడానికి కాదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. స్పీకర్ పదవి గౌరవాన్ని, ఆ గౌరవాన్ని కాపాడుకోవడంలోని ప్రాముఖ్యతను విశదీకరించారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలురెండూ సభ నియమాల ప్రకారం కచ్చితంగా సభా కార్యకలాపాలు జరిగేలా చూసుకోవాలని అమిత్ షా నిర్దేశంచేశారు. ఆదివారం ఢిల్లీ అసెంబ్లీలో >>2



# రాష్ట్రంలో తొలి నేచర్ క్యూర్ వైద్య కళాశాల

## వైజాగ్ కేంద్రంగా వచ్చే యేడాది నుంచి ప్రవేశాలు

## కాకినాడ, విశాఖలో ఆయుష్ ఇంటెగ్రేటెడ్ ఆసుపత్రులు సిద్ధం

## ధర్మవరం, కాకినాడలో ఆయుర్వేద వైద్య కళాశాలల ఏర్పాటుపై కేంద్రానికి ప్రతిపాదనలు: రాష్ట్ర వైద్య మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** గత పాలనలో ఘోరంగా తయారైన ఆయుష్ వైద్య సేవలను మెరుగుపరచడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆదివారం సత్యకుమార్ తన కార్యాలయం ద్వారా విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆయుర్వేద, హోమియో, యూనాని, ప్రకృతి వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగా ఆసుపత్రులను కొత్తగాఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేసినట్లు వివరించారు. ఈక్రమంలోనే రాష్ట్రంలో తొలి నేచర్‌క్యూర్ (ప్రకృతి చికిత్సా వైద్యకళాశాల) వైద్య కళాశాల వైజాగ్‌లో రాబోతుందన్నారు. ఇందులో 2026-27 విద్యా సంవత్సరంనుంచి ప్రవేశాలు ప్రారంభం కాబోతున్నాయని వివరించారు. విశాఖ, కాకినాడలో ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులు సిద్ధమవుతున్నాయి. అలాగే... విశాఖనగరంలోనే ప్రభుత్వ ఆయుర్వేద మందుల తయారీ, నాణ్యత పరీక్షల ప్రయోగ శాల కూడా రాబోతుందని తెలిపారు.. రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం.. 2016-17లో నేచర్‌క్యూర్ ఆసుపత్రి (ప్రకృతి వైద్య కళాశాల), రెండు ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. అప్పటి ప్రభుత్వం చేసిన కృషిని ఆ తరువాత అధికారంలోనికి వచ్చిన గత ప్రభుత్వం కొనసాగించకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించింది.కాకినాడ ఆసుపత్రికి రూ.7.17 కోట్లు, విశాఖలో ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రికి రూ.4.18 కోట్లు, నేచర్ క్యూర్ వైద్య కళాశాలకు రూ.4.08 కోట్లు మంజూరయ్యాయికేంద్రం నుంచి మూడు సంవత్సరాల తరువాత నిధుల విడుదల అవుతున్నాయి. దీనివల్ల ఆయుష్ వైద్య సేవలు మెరుగుపడుతున్నాయి.

**నేచర్ క్యూర్ వైద్య కళాశాలలో 2026- 27 నుంచి ప్రవేశాలు**

విశాఖలోని విమ్స్ ప్రాంగణంలో రూ.16.40 కోట్లతో చేపట్టిన నేచర్ క్యూర్ వైద్య కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరం నుంచి బ్యాచులర్ ఆఫ్ నాచురోపతి అండ్ యోగా సైన్సెస్ (బీఎన్వైఎస్) కోర్సులో తరగతులు ప్రారంభంకానున్నాయి. బీఎన్ వైఎస్ కోర్సులో 50 సీట్ల భర్తీకి కేంద్రం ఆమోదం తెలుపనుంది. ఈ కళాశాల పక్కనే.. రూ.14.85 కోట్ల వ్యయంతో 50 పడకలతో చేపట్టిన ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రి నిర్మాణపనులు కూడా పూర్తయ్యేదశలో ఉన్నాయి. ఈ ఆసుపత్రిలో ఆయుర్వేద, హోమియో, యూనాని వైద్య సేవలు ప్రజలకు త్వరలోనే అందుబాటులోనికి వస్తాయి. వీటిఆధారంగా కేంద్రం అడ్మిషన్స్‌కు అనుమతి ఇస్తుంది. గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ అయినందున అడ్మిషన్స్ త్వరగా స్టార్ట్ చేయడానికి వెసులుబాటు ఉంది.

**నేచర్ క్యూర్ ఆసుపత్రి ఏర్పాటుకు ప్రతిపాదనలు**

నేచర్‌క్యూర్ వైద్య కళాశాల ఏర్పాటుకు తగ్గట్లు ప్రత్యేకంగా నేచర్‌క్యూర్ ఆసుపత్రి ఏర్పాటుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు >>2




# 17 నుంచి అసెంబ్లీ సమావేశాలు!

**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** వర్షాకాల శాసనసభ సమావేశాలను సెప్టెంబరు 17 నుంచి నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీనిపై సెప్టెంబరు 4నజరిగే మంత్రిమండలి సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు. వాస్తవానికి ఈ నెలాఖరులో లేదా వచ్చే నెల తొలి వారంలోనే ఈ సమావేశాలు నిర్వహించాలని భావించినప్పటికీ, కొన్ని రాజకీయ, పాలనాపరమైన కారణాలతో మూడో వారానికి పొడిగించినట్లు తెలుస్తోంది.

# అదానీ సౌర విద్యుత్‌కు 1,200 ఎకరాలు

**విజయవాడ,ఆగస్టు 24,ప్రభాతవార్త ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ సౌర విద్యుత్ సంస్థకు వైఎస్సార్ కడప జిల్లా దోడియం, వడ్డిరాల గ్రామాల్లో 1200.05 ఎకరాల భూమిని 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అదానీ సోలార్ ఎనర్జీ ఎపి వెయిట్ ప్రైవేటు లిమిటెడ్ అధ్వర్యంలో 250 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు >>2

# ఎరువుల సరఫరాలో తేడా రానివ్వొద్దు..

## బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా గట్టి నిఘా పెట్టాలి

## పక్కదారి పడితే లైసెన్సులు రద్దు చేయండి: సిఎం చంద్రబాబు

**విజయవాడ ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఎరువుల సరఫరా విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఎరువుల లభ్యత, సరఫరాపై సిఎం చంద్రబాబు ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సిఎస్, డిజిపి, ఇంటెలిజెన్స్, వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులతో సిఎం సమీక్షించారు. జిల్లాల వారీగా ఎరువుల లభ్యత ఏ విధంగా ఉంది, సరఫరా ఎలా జరుగుతోందనే అంశంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లాల్లో ఉన్న పరిస్థితిని అధికారులు వివరించారు. అవసరానికి తగ్గట్టుగానే ఎరువులు, యూరియాను అందుబాటులో ఉంచుకున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మార్క్ ఫెడ్ ద్వారా ఎంతమేర ఎరువులను సరఫరా చేస్తున్నారని చంద్రబాబు అడిగారు. ప్రైవేట్ డీలర్లకు ఎరువుల కేటాయింపు తగ్గించి మార్క్‌ఫెడ్ ద్వారానే ఎక్కువగా సరఫరా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మార్క్ ఫెడ్ ద్వారా దాదాపు 70 శాతం మేర ఎరువులు రైతులకు సరఫరా అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఎరువులు పక్కదారి పట్టకుండా చూడాలని సిఎం చంద్రబాబు సూచించారు. భారీ స్థాయిలో విజిలెన్స్ తనిఖీలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతో పాటు యూరియా, ఎరువుల స్టాక్ కూడా చెక్ చేయాలని విజిలెన్స్ అధికారులను సీఎం ఆదేశించారు. అలాగే వ్యవసాయేతర అవసరాలకు యూరియా తరలిపోకుండా కట్టడి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే ఎరువుల సక్రమ వినియోగంపై రైతుల్లో అవగాహన పెంచాలని సీఎం సూచించారు. ఇదే సందర్భంలో ఎరువులు, యూరియా సరఫరా విషయంలో జరిగే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సిఎం సూచించారు. పొరపాట్లు ఉంటే సరి చేసుకోవాలని... అదే సమయంలో ఎవరైనా ఫేక్ ప్రచారాలు చేస్తుంటే.. అలాంటి వారిని పసిగట్టి... తగు రీతిన సమాధానం చెప్పాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎరువులు, యూరియా లభ్యత విషయంలో రైతులకు పూర్తి స్థాయి సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి చెప్పారు.

**సమన్వయం చేసుకోవాలి..**

స్థానిక అధికారులతో... జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు నిత్యం సమన్వయం చేసుకుంటూ పని చేయాలని చంద్రబాబు దిశా నిర్దేశం >>2



ఆదివారం హైదరాబాద్‌లో సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయంవద్ద నివాళులర్పిస్తున్న సిఎం చంద్రబాబు

# సురవరానికి కన్నీటి వీడ్కోలు

## అధికార లాంఛనాలతో అంతిమ యాత్ర

2లో

# పర్యాటక రంగానికి బంగారు భవిష్యత్తు

## టూరిజం స్పెషల్ సెక్రటరీ అజయ్ జైన్

**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో 2026లోజరిగే 41వఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్(ఐఎటిఒ) సదస్సును నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ప్రకటించారు. ఈ సదస్సుకు పర్యాటకుల గమ్యస్థానమైన విశాఖపట్నం అతిథ్యం ఇవ్వనుందన్నారు. ఒడిశాలోని పూరీలో స్వోస్తి ప్రీమియం బీచ్ రిసార్ట్స్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 40వ ఐఎటిఒ వార్షిక సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం తరపున టూరిజం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ పాల్గొన్నారు. రిజువేనేట్ ఇన్ బౌండ్ 2030 అనే అంశంపై జరిగిన మూడు రోజుల ఈవెంట్‌లో అజయ్ జైన్ ప్రసంగించి రాష్ట్ర పర్యాటకానికి సంబం >>2

# త్వరితగతిన అమరావతి నిర్మాణం

## రూ. 50 వేల కోట్లతో సాగుతున్న కట్టడాలు



**విజయవాడ, ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సిఆర్‌డిఎ (క్రడా) అందించిన సమాచారాన్ని అనుసరించి అమరావతి పునర్నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేసిన తర్వాత నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. దాదాపు రూ.50 వేల కోట్లకు పైగా పనులకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లుకు అప్పగించారు. దీంతో నిర్దేశిత పనులపై కాంట్రాక్టర్లు దృష్టి పెట్టి పనులు చేపట్టారు.సిఆర్‌డిఎ పెద్దఎత్తున సాగుతున్న పనుల సక్రమ పర్యవేక్షణకు ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతోంది.

సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన రాయపూడి సమీపంలో నిర్మిస్తున్న సిఆర్‌డిఎ నూతన కార్యాలయంలోని కింది అంతస్తులో ఇది రానుంది. దీనికి ఆసక్తి గల సంస్థల నుంచి సిఆర్‌డిఎ ఆర్‌ఎఫ్‌పి పిలిచింది. ఎంపికైన సంస్థ కమాండ్ కంట్రోల్ కేంద్రం నిర్మాణంలో సాంకేతిక తోడ్పాటు, నిర్వహణను చూడాల్సి ఉంటుంది. సిఆర్‌డిఎ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రాజధానిలో రహదారులు, భవనాలు, వరద నీటి నిర్వహణ, రైతుల రిటర్నబుల్ ప్లాట్లలో మౌలిక వసతుల కల్పన, పచ్చదనం అభివృద్ధి, తదితర పనులు సాగుతున్నాయి. ఒకేసారి భారీ ఎత్తున జరుగుతున్న పనులు సరైన సమయంలో పూర్తయ్యేలా చూసేందుకు, వివిధ విభాగాల మధ్య సమన్వయం కోసం కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారరాజధాని పెద్దఎత్తున సాగుతున్న ఈ పనుల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సిఆర్‌డిఎ ఏర్పాటు చేస్తుంది. పనులు సరైన సమయంలో >>2



# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

## 3 రోజులు ఉత్తరాంధ్రకు భారీ వర్షసూచన


**విజయవాడ.ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో వరదల ఉధృతి తగ్గుముఖం పడుతుంది.విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ వరద ఉధృతి క్రమంగా తగ్గుతుంది.ఇదే సందర్భంలో ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృత్తి తగ్గింది.రెండవ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు.రాష్ట్రంలో వర్షాలు అక్కడక్కడ కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఐఎండి సూచనల ప్రకారం సోమవారం ( ఈనెల25)వాయువ్య బంగాళాఖాతంలో ఒడిశా పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని అల్పపీడనం.. ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో ..రానున్న మూడు రోజులు ఉత్తరాంధ్రలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం >>2

# ఆ ముగ్గురికి బెయిలు ఇవ్వలేం

## లిక్కర్ స్కాంలో స్పష్టం చేసిన ఎసిబి కోర్టు

**విజయవాడ,ఆగస్టు 24,ప్రభాతవార్త ప్రతినిధి :** మద్యం కుంభకోణంలో సిట్ తమపై దర్యాప్తు పూర్తి చేసి అభియోగపత్రం దాఖలు చేసినందున బెయిలివ్వాలంటూ సిఎంఒ మాజీ కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి(ఏ-31),ఓఎస్‌డీ కృష్ణమోహనరెడ్డి(ఎ-32,భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ(ఏ-33)చేసిన అభ్యర్థనలను విజయవాడ ఎసిబికోర్టు త్రోసిపుచ్చినట్లు కీలక సమాచారం. న్యాయవాదుల లా న్యూస్ బులిటిన్‌ను అనుసరించి ఈ కేసులో దర్యాప్తు పూర్తయినందున ఇప్పటికప్పుడు బెయిల్ ఇచ్చే అవకాశం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఆర్థిక నేరం కేసులో నిందితులకు ఈ దశలో బెయిలిస్తే దర్యాప్తునకు అవరోధం కల్గుతుందని స్పష్టం చేసింది. ఆర్థిక నేరాల విషయంలో బెయిలు మంజూరు విషయంలో వ్యక్తిగత స్వేచ్ఛకు,సామాజిక ప్రయోజనాలకు మధ్య సమతౌల్యాన్ని చూడాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

పిటీషనర్లు బెయిలుపై విడుదలైతే వాస్తవాలను దాచిపెట్టడం,సాక్ష్యాలను ధ్వంసం చేస్తారనే విషయాన్ని విస్మరించకూడదని తెలిపింది. భారీ స్థాయిలో సొమ్ము చేతులు మారిన ఇలాంటి కేసులో పిటీషనర్లకు బెయిలివ్వలేమని తేల్చి చెప్పింది. పిటీషన్లను కొట్టివేసింది.ఎసిబి కోర్టు న్యాయమూర్తి పి.భాస్కరరావు ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చారు. ఆ ప్రతులు తాజాగా అందుబాటులో ప్రస్తుతం >>2



ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన స్పీకర్ల సదస్సుకు హాజరైన స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు తదితరులు

# మరో అల్పపీడనం!

>> ఉందన్నారు. ఉత్తరాంధ్ర తీరం వెంబడి ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు. భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు చెట్ల క్రింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, హోర్డింగ్స్ వద్ద ఉండరాదని హెచ్చరించారు. అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోను పొంగిపొర్లే వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదన్నారు. రానున్న మూడు రోజులు వాతావరణం క్రింది విధంగా ఉండనున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వివరించారు. ఈ నెల 25న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడ ..తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.. కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నెల 26నశ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ ..మోస్తరు నుంచి భారీ వర్షాలు.. కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నెల 27న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ ..మోస్తరు నుంచి భారీ వర్షాలు.. కురిసే అవకాశం ఉందన్నారు.



ఆదివారం హైదరాబాద్‌లో సుధాకర్ రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న వెంకయ్య నాయుడు

# ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడిన సురవరం

## సుధాకర్ రెడ్డి భౌతిక కాయంవద్ద నివాళులర్పించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ ఆగస్టు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజాస్వామ్య పరిరక్షణకోసం సిపిఐ నేత సురవరం సుధాకర్ రెడ్డి పోరాడారని సిఎం చంద్రబాబు అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం, దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. హిమాయత్ నగర్‌లోని సిపిఐ ప్రధాన కార్యాలయం మఖ్దూం భవన్‌లో సుధాకర్ రెడ్డి భౌతిక ఖాయానికి చంద్రబాబు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డితో ఉన్న రాజకీయ సంబంధాలను గురించి నేతలతో పంచుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. సురవరంతో నాకు సుధీర్ఘ రాజకీయ అనుబంధం ఉంది. సుధాకర్ రెడ్డి, నేను కలిసి ఎన్నో రాజకీయ పోరాటాలు చేశామన్నారు. నిత్యం ప్రజాహితం కోసం ఆయనతో కలిసి పోరాడామన్నారు.ఎమ్మెల్యేగా, ఎంపీగా ప్రజలకు సేవలందించారు. సుధాకర్ రెడ్డి నన్ను ప్రత్యేకంగా అభిమానించేవారు. నేను చేసే పనుల్ని, కార్యక్రమాల్ని అభినందించి ప్రోత్సహించేవారు. ఆయన సేవల్నీ, పోరాటాలను నా జీవితంలో ఎప్పుడూ మర్చిపోలేను. సుధాకర్ రెడ్డి చనిపోయినా పోరాట వారసత్వాన్ని మనకు ఇచ్చిపోయారు. సుధాకర్ రెడ్డి మరణం సిపిఐతో పాటు, తెలుగు వారికి తీరని లోటు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా అని సిఎం చంద్రబాబు అన్నారు.

# గాడి తప్పితే కఠిన చర్యలే!

>> ఉన్నాం కదా'అని అలసత్వం వద్దు. పార్టీ,ప్రభుత్వ ప్రతిష్ట పెంచేలా నేతల పనితీరు ఉండాలి. ప్రతి ఒక్కరూ భాధ్యతగా ఉండాలి.ప్రజలతో మమేకం కావాలి అని నిర్దేశించారు వైకాంగ్రెస్ ప్రభుత్వం వ్యవస్థలను నాశనంచేసింది. అయినా వాటిన్నంటినీఎదుర్కొని సంక్షేమం అమలుచేస్తున్నాం.అభివృద్ధి ఆగకుండా చూస్తున్నాం. సూపర్‌సిక్స్‌ను సూపర్‌హిట్ చేసాం. పథకాలు సకాలంలో అమలు కావడంతో ప్రజల నుండి మంచి స్పందన వస్తోంది. ప్రతి వర్గానికే ఏదో ఒక కృషి చేస్తున్నాం.ఏడాదిలో ఇన్ని పనులు చేయడం గొప్ప ముందడుగుఅని తెలిపారు.టిడిపి పార్లమెంటు కమిటీలను 34 మంది సభ్యులతో ఏర్పాటు కావాలని ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. పార్లమెంటు పార్టీ కమిటీల ఏర్పాటు కోసం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీలతోను ఆయన సమావేశమయ్యారు. అధ్యక్షులుతో పాటు ఏడుగురు ఉపాధ్యక్షులు, అధికార ప్రతినిధులు, కార్యనిర్వాహక కార్యదర్శులు, కార్యదర్శులతో పార్లమెంటు కమిటీ ఉండాలని చంద్రబాబు తెలిపారు. పార్లమెంటు కమిటీల నియామకం అత్యంత పారదర్శంగా, పకడ్బందీగా జరగాలని ఆదేశించారు. కమిటీ నియామకంలో సోషల్ రీ ఇంజినీరింగ్ జరగాలని, అన్ని వర్గాల్లో బలమైన నేతలకు అవకాశం ఇవ్వాలని చెప్పారు. డమ్మీలు, వీక్‌గా ఉండే వాళ్లను పెడితే ప్రభుత్వ, పార్టీ నష్టపోతాయని తెలిపారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు పార్టీ నేతలు మరింత బాధ్యతగా ఉండాలని సూచించారు. యువతకు అవకాశాలు ఇస్తున్నామన్నారు. సూపర్ సిక్స్‌లో చెప్పినట్లు అన్ని పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామని, సెప్టెంబరు 6న అనంతపురంలో హిట్ కార్యక్రమం నిర్వహిద్దామన్నారు. మేనిఫెస్టోలో అనేక హామీలు ఇప్పటికే నెరవేర్చామని, పథకాలు సకాలంలో అమలు వల్ల ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ప్రతి వర్గానికి ఏదో ఒక లబ్ధి చేకూర్చామని, ఏడాది కాలంలో ఈ పనులు చేయడం గొప్ప ముందడుగు అని తెలిపారు.

ప్రజల్లో ఉన్న సానుకూలతను పెంచుకునేలా పార్టీ నేతలు ప్రజల్లో తిరుగుతూ వారితో మమేకమవ్వాలని చెప్పారు. వైఎస్సార్సీ ఒక విషవృక్షమని విమర్శించారు. ప్రజల సమస్యలు, ప్రజల ప్రయోజనాలు వాళ్లకు అనవసరమన్నారు. సంక్షేమ పథకాలపై చర్చ జరగకూడదనేది వైఎస్సార్సీ ప్రధాన లక్ష్యమన్నారు. అర్హుల పింఛన్లు తొలగించలేదని, కానీ వైఎస్సార్సీ మాత్రం లక్షల పింఛన్లు తొలగించినట్లు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు ప్రచారాలతో నిత్యం వాళ్ల రాజకీయాలు సాగుతున్నాయని, ప్రజలకు మనం వాస్తవాలు చెబుతూనే ఉండాలని చెప్పారు. వైఎస్సార్సీ విధానాలను, కుట్రలను ఉదాహరణలతో చెబితే ప్రజలు అర్థం చేసుకుంటారని తెలిపారు. తప్పుడు ప్రచారాలపై మౌనంగా ఉండకూడదన్నారు. పార్టీపై దృష్టిపెట్టి బలోపేతం చేసుకోవాలని, టిడిపి సంస్థాగతంగా చాలా బలంగా ఉంటుందన్నారు. పార్టీ, ప్రభుత్వ ఇమేజ్‌ను పెంచేలా నేతల తీరు ఉండాలని చెప్పారు.

# 1,200 ఎకరాలు

>> ఏర్పాటుకు ఈ భూమిని కేటాయించింది. ఎకరా భూమికి ఏడాదికి దోడియంలో రూ.3 లక్షలు, వడ్డిరాలలో రూ.6.25 లక్షల చొప్పున లీజు ధర నిర్ణయించింది. ఐదేళ్లకోసారి 10% లీజు ధర పెంచాలని నిర్దేశించింది. వడ్డిరాల గ్రామ పంచాయితీ తీర్మానం,ఇతర నిబంధనలకు లోబడి కేటాయింపు ఉంటుందని పేర్కొంది. జాతీయ యోగా,నేచురోపతి పరిశోధనా సంస్థ ఏర్పాటుకు గుంటూరుజిల్లా ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో 12.96 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. రూ.5.18కోట్ల విలువైన ఈ భూమిని ఉచితంగా ఇస్తూ,నిబంధనలు పాటించాలని పేర్కొంది. చిత్తూరు జిల్లా కుప్పం మండలం బైరుగానిపల్లెలో కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి 7.74 ఎకరాలను ఉచితంగా కేటాయిస్తూ ప్రభుత్వం మరో ఉత్తర్వు ఇచ్చింది.

# బంగారు భవిష్యత్తు

>> ధించిన ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో పర్యాటక రంగానికి ఉన్న అవకాశాలను, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు కల్పిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను, ఏపి పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా తదితర అంశాలను వివరించారు. పర్యాటక రంగానికి బంగారు భవిష్యత్ ఉందని అజయ్ జైన్ వెల్లడించారు. పర్యాటకాభివృద్ధిలో టూర్ ఆపరేటర్ల పాత్రను వివరిస్తూ పర్యాటకకేంద్రాల అభివృద్ధికి, పర్యాటకులకు అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన మౌలిక సౌకర్యాల కల్పనలో, పర్యాటక ప్రాంతాలకు రాకపోకల విషయంలో కనెక్టివిటీ అంశంలో ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ క్రమంలో ఏపీలోనిర్మించ తలపెట్టినకొత్త ఎయిర్ పోర్టుల గురించి వివరించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ ఏపీ పర్యాటకాభివృద్ధికి పెద్దఎత్తున కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది విశాఖలో జరిగే ఐఎటిఐ సదస్సుకు ప్రతి ఒక్కరికీఆహ్వానంపలికారు. ఈవెంట్‌లో భాగంగా వ్యాపారసెషన్‌లు, ఇండియన్ టూరిజం ఫెయిర్ తదితర అంశాలపై చర్చ జరిగింది.

# సురవరానికి కన్నీటి వీడ్కోలు

## భౌతికకాయం గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగింత

### పెద్ద సంఖ్యలో కన్నీటి వీడ్కోలు పలికిన కార్యకర్తలు



సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

**సికింద్రాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** సిపిఐ నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి పార్థివదేహాన్ని ఆదివారం ఆయన కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాలకు అప్పగించారు. సుధాకర్ రెడ్డి సతీమణి విజయలక్ష్మి, కుమారులు నిఖిల్, కపిల్‌కు గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా, అనాటమీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ డి సుధాకర్ బాబు, సహాయ ప్రొఫెసర్ డాక్టర్ సంగీత, ఫిజియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రమాదేవిలు వైద్య విద్యార్థుల తరఫున కళాశాల తరఫున ధన్యవాదాలు తెలిపి, లేఖ అందజేసి, సుధాకర్ రెడ్డి పార్థివదేహాన్ని అనాటమీ విభాగానికి తరలించారు. ఎంతో ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన కామ్రేడ్ సుధాకర్ రెడ్డి అందరికీ ఆదర్శంగా నిలిచారని, ఆయన పార్ధివదేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన కోసం అందించడం స్వాగతిస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ కే. ఇందిరా అన్నారు. పెద్ద ఎత్తున గాంధీ వైద్య కళాశాల వరకు అంతిమయాత్రలో వందలాది మంది కామ్రేడ్‌లు పాల్గొన్నారు. కడసారి ఆయనకు విప్లవ జోహార్లు అర్పించారు. మాజీమంత్రులు హరీష్ రావు, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, అజీజ్ పాషా, సిపిఐ జాతీయ నాయకులు డి రాజా, నారాయణ, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పలువురు సిపిఐ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# ఆ ముగ్గురికి బెయిలు ఇవ్వలేం

>> జ్యుడీషనల్ కస్టడీలో ఉన్న ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప,బాలాజీలు బెయిలివ్వాలని వేర్వేరుగా పిటీషన్లు వేశారు. 90 రోజులకు పైగా కస్టడీలో ఉన్నామన్నారు. సిట్ అధికారులు అభియోగపత్రం దాఖలు చేసినందున బెయిలు పొందేందుకు తాము అర్హులమని చెప్పారు. ధనుంజయరెడ్డి పిటీషన్‌ను వ్యతిరేకిస్తూ సిట్,సిఐడి తరపు ప్రత్యేక పిపి వాదనలు వినిపిస్తూ...మద్యం కుంభకోణంలో ఆయన కీలకపాత్ర పోషించారు. సిండికేట్ నిర్ణయాలు,వాటి అమలులోనూ ఆయనది చురుకైన పాత్ర వ్యూహారచనచేసే ఉన్నతస్థాయి సమావేశాల్లో పాల్గొన్నారు.

దర్యాప్తు పూర్తయ్యిందన్న పిటీషనర్ వాదనలో వాస్తవం లేదు. దర్యాప్తు కీలక దశలో ఉంది. తెలంగాణాలో ఇటీవల రూ.11 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. ముడుపుల సొమ్ము ఎక్కడికి చేరిందో తేల్చేందుకు నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న పరికరాలను ఫోరెన్సిక్ పరీక్షకు పంపాం' అని వాదించారు. కృష్ణమోహనరెడ్డి పిటీషన్‌ను వ్యతిరేకిస్తూ...నేరపూరిత కుట్రలో ఓఎస్‌డీగా ఆయన కీలక భూమిక పోషించారు. మద్యం రూపకర్తలకు,అమలు చేసే ఏజెన్సీలకు మధ్య వారధిగా వ్యవహరించారు. ఆర్డర్ ఫర్ సప్లై (ఓఎఫ్ఎస్) విధానాన్ని మాన్యువల్ లోకి తీసుకొచ్చేందుకు జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. మద్యం ముడుపుల వసూళ్లకు పాల్పడి, ఆ సొమ్ముతో ఆస్తులు కూడబెట్టారు' అని తెలిపారు. గోవిందప్ప బాలాజీ బెయిలు పిటీషన్‌కు వ్యతిరేకంగా వాదనలు వినిపిస్తూ నేరపూరిత కుట్ర అమలుకు ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి,ఇతర నిందితు లతో గోవిందప్ప సమావేశాల్లో పాల్గొన్నారు. మద్యం డిస్టలరీల నుంచి రూ.3200 కోట్ల సొమ్ము ముడుపులు రూపేణా రాబట్టేందుకు భాగస్వామి అయ్యారు. సిండికేట్‌లో గోవిందప్ప బాలాజీ భాగస్వామి అని ఏపీఎస్‌బీసీఎల్ అప్పటి ఎండీ వాసుదేవరెడ్డి,ప్రత్యేక అధికారి సత్యప్రసాద్ వాంగ్మూలాలిచ్చారు. ముడుపుల వసూలు వ్యవస్థను గోవిందప్ప తీసుకొచ్చారని పలు డిస్టలరీల యజమానులు వాంగ్మూలం ఇచ్చారు. పోలీసు కస్టడీలో ఆయన సహకరించ లేదు. గోవిందప్ప ఇల్లు,కార్యాలయాలో పోలీసులు 14 ఎలక్ట్రానిక్ పరికరాలు సీజ్ చేసి ఎఫ్ఎస్ఎల్‌కు పంపారు. నివేదికలు రావాల్సి ఉంది అని వాదించారు. ముగ్గురి బెయిలు పిటీషన్లను కొట్టేయాలని కోరారు.

# చట్ట సభలు రాజకీయ లబ్ధికి కాదు..

>> 2 రోజుల అఖిల భారత స్పీకర్ల సమావేశంలో కేంద్ర మంత్రి అమిత్ షా పాల్గొని మాట్లాడారు. చారిత్రాత్మకంగా, తమ గౌరవాన్ని కోల్పోయిన అసెంబ్లీలు భయంకరమైన పరిణామాలను ఎదుర్కొన్నాయని ప్రస్తావించారు. చర్చలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి,ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాలు విపక్షాల కారణంగా సజావుగా జరగలేదు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, దీని గురించి ప్రజలు,ప్రజాప్రతినిధులు ఆలోచించాలని చెప్పారు. అర్థవంతమైన చర్చలు జరగాలి, స్పీకర్ పదవి గౌరవాన్ని పెంచడానికి నాయకులు కృషి చేయాలని చెప్పారు. స్పీకర్ పదవి గౌరవాన్ని పెంచే దిశగా మనమందరం కృషి చేయడానికి ఇది ఒక అవకాశం. మన దేశ ప్రజల సమస్యలను లేవనెత్తడానికి నిష్పాక్షిక వేదికను అందించడానికి మనం పరితపించాలని చెప్పారు. సభల్లో ప్రభుత్వం, ప్రతిపక్షాలు నిష్పాక్షిక వాదన చేయాలి.సభ పనితీరు, సంబంధిత సభ నియమాల ప్రకారం జరిగేలా చూసుకోవాలి. మన దేశ సుధీర్ఘ చరిత్రలో, అసెంబ్లీలు తమ గౌరవాన్ని కోల్పోయినప్పుడల్లా, మనం భయంకరమైన పరిణామాలను ఎదుర్కోవలసి వచ్చిందని కేంద్ర మంత్రి అన్నారు. కేంద్ర అసెంబ్లీ స్పీకర్‌గా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికై వందేళ్లు అయిన సందర్భంగా ఆమహనీయుడిని అమిత్ షా స్మరించుకున్నారు. శతాబ్ది ఉత్సవాల విశిష్టతను అమిత్ షా నొక్కి చెప్పారు. అప్పటి బ్రిటీష్ కాలంలో 1919 డిసెంబర్ 24న దేశంలో సెంట్రల్ లెజిస్లేటీవ్ అసెంబ్లీ ఏర్పాటైంది. పటేల్ ఆగస్టు 24,1925న కేంద్ర శాసనసభ అధ్యక్షుడిగా (స్పీకర్) ఎన్నికయ్యారు.. కేంద్ర శాసనసభ స్పీకర్ పదవిని నిర్వహించిన మొదటి భారతీయుడు విఠల్‌భాయ్ పటేల్.ఆగస్టు 24 (ఈ రోజు) దేశ శాసనసభ చరిత్ర ప్రారంభమైన రోజు.అది ప్రారంభమైన సభలోనే మనంకూడా ఉన్నాం.ఈ రోజున గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడు విఠల్‌భాయ్ పటేల్ కేంద్ర అసెంబ్లీస్పీకర్‌గా మారడంతో అది ప్రారంభమైందని చెప్పారు. నేడు, దేశ శాసనసభలను నడిపే అందరు స్పీకర్లు, డిప్యూటీ స్పీకర్లు, శాసనమండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్ ఇక్కడ ఉన్నారు. కావున, ఒక విధంగా, స్వర్ణ చరిత్రను సృష్టించిన, స్వర్ణ భవిష్యత్తు కోసం పనిచేస్తున్న మొత్తం శాసన వ్యవస్థ ఇవాళ ఈ చారిత్రాత్మక సభలో ఉంది అని అమిత్ షా అన్నారు. విఠల్‌భాయ్ పటేల్ కేంద్ర అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికై 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ రోజు మనమందరం సమావేశమయ్యామని, ఇది మనందరికీ గర్వకారణమని అమిత్ షా స్పీకర్లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. విఠల్‌భాయ్ పటేల్ గురించి మాట్లాడేటప్పుడు, గుజరాత్ ప్రజలు గర్వంగా చెప్పుకుంటారు.. రాష్ట్రం ఇద్దరు సోదరులైన సర్దార్ వల్లభాయ్ పటేల్,విఠల్ బాయ్ పటేల్‌ను అందించిందని ఘనంగా చెప్పుకుంటారు. దేశ స్వాతంత్రం కోసం మహాత్మా గాంధీతో కలిసి పగలు,రాత్రి పనిచేసిన వల్లభాయ్, ఇంకా భారతదేశ శాసన సంప్రదాయాలకు పునాది వేసి, నేటి ప్రజాస్వామ్యం పనిచేయడానికి వీలుకల్పించిన విఠల్‌భాయ్ పటేల్‌ను గుజరాత్ రాష్ట్రం ఇచ్చిందని అమిత్ షా అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించే ముందు కేంద్ర మంత్రి షా.. భారతదేశపు మొట్టమొదటి కేంద్ర శాసనసభ స్పీకర్ అయిన విఠల్‌భాయ్ పటేల్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు.1919 భారత ప్రభుత్వ చట్టం ద్వారా స్థాపించబడిన బ్రిటిష్ ఇండియా ద్విసభ శాసనసభలోని దిగువ సభ అయిన సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి స్పీకర్ గా విఠల్ భాయ్ పటేల్ పనిచేశారు. కాగా, ఢిల్లీ అసెంబ్లీ భవనంలో జరిగే ఆల్ ఇండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

# ఎరువుల సరఫరాలో తేడా రానివ్వొద్దు..

>> చేశారు. పరిశ్రమలు, రవాణా, విజిలెన్స్, పోలీస్, వ్యవసాయ శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్లు సమన్వయంతో రోజువారీ పరిశీలన బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎక్కడైనా సమస్య వస్తే స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఎరువులు బ్లాక్ మార్కెట్టుకు తరలిస్తే కేసులు నమోదు చేయడానికి ఎక్కడా వెనుకాడొద్దని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ధరలు పెంచి ఎరువుల అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎరువులను పక్కదారి పట్టించారని నిర్ధారణైతే... సదరు డీలర్ల లైసెన్సులు కూడా రద్దుచేయాలని సిఎం స్పష్టం చేశారు. ఐఎంఎఫ్ఎస్ పోర్టల్లో సమాచారం అప్డేట్ ఏ మేరకు అవుతుందని ఆరా తీసిన సిఎం...ఐఎంఎఫ్ఎస్ పోర్టల్‌లో రియల్ టైమ్ ప్రాతిపదికన సమాచారం అప్డేట్ కావడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. సాకులు చెప్పకుండా.. పోర్టల్లో సమాచారం నిరంతరం అప్డేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అత్యధికంగా ఎరువులు అమ్ముతున్న రిటైలర్లు... తరచుగా కొనుగోలు చేస్తున్నవారు ఎవరైనా ఉన్నట్టు గుర్తిస్తే... అలాంటి వారి విషయంలో వెంటనే దర్యాప్తు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల వద్ద సరిపడా నిల్వలు ఉండేలా చూసుకోవాని అధికారులను ఆదేశించారు. బయట ప్రైవేట్ డీలర్ల కంటే.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ఎరువుల సరఫరా ఎక్కువగా జరిగేలా చూడాలన్నారు. రిటైల్ కేంద్రాలవద్ద కానీ.. పిఏసిఎస్‌ల వద్ద కానీ యూరియా, ఎరువుల కోసం రైతులు పడిగాపులు పడే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చెప్పారు.

# నేచర్ క్యూర్ వైద్య కళాశాల

>> తీసుకుంటోంది. 50 పడకలతో ఈ ఆసుపత్రి ఏర్పాటుపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. సుమారు రూ.16 కోట్లు కేంద్రం నుంచి రానున్నాయి.

**విశాఖలోనే ఆయుర్వేద మందుల తయారీ, క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్**

విశాఖలోని శొంఠ్యాం ప్రాంతంలో సుమారు రూ.6 కోట్లతో ఆయుర్వేద ఫారస్మీ, డ్రగ్ టెస్టింగ్ లేబరోరేటరీల భవన నిర్మాణాలు పూర్తికావొచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సుమారు రూ.5 కోట్లతో పరికరాలు, యంత్రాలు, ఇతర వాటి కొనుగోళ్ల ప్రక్రియ జరగనుంది.

**కాకినాడలో ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రి**

కాకినాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో 50 పడకలతో ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి. ఆయుర్వేద, హోమియో, యూనాని వైద్య సేవలు ఇక్కడ ప్రారంభించేందుకు వీలుగా అవసరమైన వైద్య పరికరాలు, యంత్రాల కొనుగోళ్లు జరుగుతున్నాయి. మూడు నెలల్లోగా ఈ ఆసుపత్రి సేవలు ప్రజలకు అందుబాటులోనికి రానున్నాయి.

**ధర్మవరం, కాకినాడలో ఆయుర్వేద వైద్య కళా శాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు!**

నేషనల్ ఆయుష్ మిషన్ కింద కాకినాడలో ఆయుర్వేద వైద్య కళాశాల, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఆయుర్వేద వైద్య కళాశాలల ఏర్పాటు ఆమోదం కోసం కేంద్ర ఆయుష్ శాఖకు ప్రతిపాదనలు పంపినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్యాదవ్ వెల్లడించారు. ధర్మవరంలో ఆయుర్వేద కళాశాలకు అనుబంధంగా ఉండాల్సిన ఆయుర్వేద ఆసుపత్రిని 50 పడకలతో ఏర్పాటుచేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

## వారం - వర్జ్యం

25-08-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
విదియ మ.12.38
ఉత్తరఫల్గుణి రా.3.50
వర్జ్యం : మ.1.01-2.46
దు.మ.12.35-1.25, 2) మ.3.05-3.55
శుభసమయం:ఉ.9.30-10.15, సా.4.45-5.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** శుభకార్యాలలో చురుకు పాల్గొని, బంధువర్గంలో కేంద్రబిందువు అవుతారు.

**వృషభం:** స్నేహితులకు మీవంతు సహాయ సహకారాలు అందిస్తారు. నేలవిడిచి సాముచేయరు.

**మిథునం:** నిర్మాణాత్మక, వ్యూహాత్మక విషయ వ్యవహారాలలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోండి.

**కర్కాటకం:** అభివృద్ధి కార్యక్రమాలు వెనువెంటనే కాక భవిష్యత్తులో కలిసి వస్తాయి.

**సింహం:** బ్యాంకు లావాదేవీలు అనుకూలిస్తాయి. ఉద్యోగాల వేటలో సఫలత సాధిస్తారు.

**కన్య :** ఏదయినా ఒక అద్భుత కార్యక్రమం చేసి నలుగురిలో అఖండ ఖ్యాతిని ఆర్జించాలనే కోరిక బలపడుతుంది.

**తుల :** బంధువులతో సంబంధ బాంధవ్యాలు పూర్వం కన్నా మెరుగవుతాయి.

**వృశ్చికం:** ముఖ్యమైన విషయాలలో తొందర పడకుండా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం ఎంతో ఉత్తమం.

**ధనుస్సు:** కుటుంబసభ్యుల పురోభివృద్ధికి విశేషంగా కృషిచేస్తారు. వృత్తి వ్యాపారాలలో స్వల్ప మార్పులు.

**మకరం:** ఎదురుచూడని అవకాశాలు కలిసి వస్తాయి వాటిని నేర్పుగా ఉపయోగించి లాభపడండి.

**కుంభం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**మీనం :** ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. పెట్టుబడుల విషయంలో నిదానం అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# త్వరితగతిన అమరావతి నిర్మాణం

>> పూర్తయ్యేలా చూసేందుకు ఈ కేంద్రం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తారు. ఇక్కడ అంశాల వారీగా ప్రత్యేకంగా సిబ్బందికి బాధ్యతలు అప్పగించనున్నారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో నాణ్యమైన చిత్రాలు అందించే సిసి కెమెరాలను ఏర్పాటుచేస్తారు. వీటినుంచివచ్చే దృశ్యాలను సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయంలోని వ్యవస్థతో అనుసంధానం చేస్తారు. వీటితోపాటు ఎంచుకున్న పని ప్రాంతాన్ని 360 డిగ్రీల్లో పరిశీలించేందుకు డ్రోన్ల సాయం తీసుకోనున్నారు. ఇవి చిత్రీకరించే దృశ్యాలను రియల్ టైం మానిటరింగ్ ద్వారా పరిశీలించనున్నారు. ప్రత్యేక డ్యాష్ బోర్డును నిపుణులతో సీఆర్డీఏ అధికారులు రూపొందిస్తున్నారు.

పురపాలక మంత్రి, సిఆర్‌డిఎ కమిషనర్, ఎడిసిఎల్ సిఎండి, ఆయా విభాగాధిపతులు, కింది స్థాయి అధికారులకు డ్యాష్‌బోర్డులో లాగిన్ అయ్యేలా ఐడి ఇవ్వనున్నారు. ఈ కేంద్రంలో నిరంతరం పనుల తీరు సమీక్షిస్తారు. అధికారులు, గుత్తేదారులు, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ల మధ్య సమన్వయంతో పనుల్లో వేగం, నాణ్యత పెరుగుతుందని భావిస్తున్నారు. నిరంతరం క్షేత్రం నుంచి వచ్చే ఇన్‌పుట్స్‌తో విశ్లేషణ చేసి పనుల భౌతిక పురోగతి, భద్రతాపరమైన చర్యలు, ఇబ్బందులు వంటి అంశాలపై నిత్యం, వార, పక్ష, నెలవారీ నివేదికలను ఇక్కడి సిబ్బంది తయారు చేస్తారు.

# మెగా డిఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల జాబితా పరిశీలన నేటి నుంచి

**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** మెగా డిఎస్సీ మెరిట్ జాబితా విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ ఈ నెల25(సోమవారం)నుంచి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనుంది. ఇందుకోసం 2 నుంచి 3 రోజులు సమయం ఇవ్వనుంది. రిజర్వేషన్ల ఆధారంగా అధికారులు కటాఫ్ మార్కులను నిర్ణయించారు. డిఎస్సీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు 1:1 విధానంలో కాల్‌లెటర్లు ఇవ్వనున్నారు. వెబ్‌సైట్‌లోని అభ్యర్థుల లాగిన్‌లో నేడు కాల్ లెటర్లను అందుబాటులో ఉంచనున్నారు. ధ్రువపత్రాల పరిశీలన తర్వాత డిఎస్సీ మెరిట్ జాబితాలో ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈ ప్రక్రియ సెప్టెంబర్ మొదటి వారంలోగా పూర్తి చేయనున్నారు. ఎంపికైన వారు వచ్చే నెల రెండో వారంలో పాఠశాలల్లో చేరేలా పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ రూపొందించింది. రిజర్వేషన్లు, ధ్రువపత్రాల పరిశీలనలో జిల్లాల్లో సమస్యలు తలెత్తకుండా రాష్ట్రస్థాయి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలకు నియమించిన ప్రత్యేక అధికారులు స్థానిక అధికారులతో సమన్వయం చేస్తారు. టెట్ ఒక సబ్జెక్టు, డిఎస్సీ మరో సబ్జెక్టు రాసిన వారి ఫలితాలను నిలిపివేశారు. ఒక అభ్యర్థి తెలుగు భాష టెట్ రాసి, ఉర్దూ పరీక్ష రాసినట్లు తేలింది. కొందరు సాధారణ సబ్జెక్టులకు టెట్ రాసి, ప్రత్యేక విద్య పోస్టులకు డీఎస్సీ రాశారు. వాస్తవంగా వీరు టెట్ రెండో పేపర్ రాయాల్సి ఉంటుంది. మరికొందరు సాంఘికశాస్త్రానికి టెట్ , గణితం సబ్జెక్టుకు డీఎస్సీ రాశారు. మరికొందరు అర్హత పరీక్షలు ఉత్తీర్ణులు కాకుండానే డీఎస్సీకి హాజరయ్యారు. దరఖాస్తు సమయం నాటికే కోర్సులు పూర్తి చేయాలనే నిబంధన ఉన్నందున ఇలాంటి వారి ఫలితాలను నిలిపివేశారు.ఎస్జీటీ జిల్లాస్థాయి పోస్టులకు ఉత్తరాంధ్రకు చెందిన ఇద్దరు రాష్ట్ర టాపర్లుగా నిలిచారు. ఇవి జిల్లాస్థాయి పోస్టులు కావడంతో జిల్లాలోని పోస్టులు, రిజర్వేషన్ల ఆధారంగా భర్తీ ఉంటుంది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన అన్నెపు శేషాద్రినాయుడు 96.401 స్కోర్‌తో రాష్ట్రంలోనే టాపర్‌గా నిలిచారు. విజయనగరం జిల్లాకు చెందిన సుంకరి మోహన్‌రావు 94.649 స్కోర్‌తో రెండో స్థానంలో ఉన్నారు. డీఎస్సీలో కొందరు ఒకటి, రెండు, మూడు పోస్టులకు సంబంధించి టాపర్లుగా నిలిచారు. వీరికి మూడు ఉద్యోగాలూ వస్తాయి. అయితే, దరఖాస్తు సమయంలో పోస్టులకు ఇచ్చిన ఐచ్ఛికాల ప్రకారమే వారు జాబ్ పొందాలి. మూడు పోస్టులకు అర్హత సాధించినా, దరఖాస్తు సమయంలో మొదటి ప్రాధాన్యం ఇచ్చిన జాబ్ కి ప్రాధాన్యమిస్తారు. ఆగస్టు 11న డీఎస్సీ ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసింది.మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నియామకానికి ఎగ్జామ్స్ నిర్వహించారు. మొత్తంగా 3,36,307 మంది అభ్యర్థులు ఇందుకు అర్జీ చేసుకున్నారు. ఈ సంవత్సరం జూన్ 6 నుంచి జులై 2 వరకు 23 రోజుల పాటు పరీక్షలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, కర్ణాటకలో ఎగ్జామ్ సెంటర్స్‌ను ఏర్పాటు చేసి రెండు సెషన్లలో ఈ పరీక్షలను విజయవంతంగా ముగించారు. వీటికి 92.90 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు.

# ఆన్‌లైన్ దర్శన టిక్కెట్ భక్తులకు గదులు లేవా 'గోవిందా'!




## - సుప్రభాతం, తోమాల సేవల భక్తులకు ఇవ్వరట!

**తిరుమల,ఆగస్టు 24ప్రభాత˘వార్తప్రతి నిధి:** మూడునెలల ముందుగానే ఆన్‌లైన్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం విడుదల చేస్తున్న లక్కీడిప్ ఆర్జితసేవల దర్శన టిక్కెట్లు బుక్‌చేసుకున్న భక్తులకు తిరుమల కొండపై గదులు కేటాయించడం లేదని పలువురు భక్తులు ఆవేదన చెందుతున్నారు. తాము దర్శన టిక్కెట్ కలిగి ఉన్నా టిటిడి సిబ్బంది గదులు లేవంటున్నారని కొందరు భక్తులు తమ అసహనం వ్యక్తం చేస్తున్న సందర్భాలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యకల్యాణంపచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమల ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి ప్రతిరోజూ అనేక రకాల సేవలు, పూజలు వైఖానస ఆగమోక్తంగా జరుగుతాయి. వేకువజామున 2.30గంటలకు సుప్రభాతసేవ, ఆ తరువాత తోమాల,అర్చన ,ఉదయం కల్యాణోత్సవం సేవలు నిర్వహిస్తారు. ఆర్జితసేవలైన సుప్రభాతం, తోమాల,అర్చన సేవల దర్శన టిక్కెట్లు సామాన్యభక్తులు పొందాలంటే ఎంతో పుణ్యంచేసుకోవాల్సిందే. రాజ్యాంగహోదాలో ఉన్న ప్రముఖులు, కేంద్ర,రాష్ట్ర మంత్రులు, టిటిడి బోర్డు సభ్యులు సిఫార్సులపై ఎప్పుడో నెలకు ఒకటి,రెండుసార్లు ఈ సేవల దర్శనాల టిక్కెట్లు పొందే అవకాశం ఉంటుంది. అలాంటిది సామాన్యభక్తుల సౌలభ్యంకోసం టిటిడి ఆన్‌లైన్‌లో ప్రతినెలా ఆర్జితసేవల దర్శనాల టిక్కెట్లు పెద్దసంఖ్యలోనే విడుదల చేస్తుంది. ఈ టిక్కెట్లు మూడునెలల ముందుగానే దర్శనాలు బుకింగ్ చేసుకోవాలి. ఇదేగాక రోజువారీగా టిక్కెట్లు లభ్యతను బట్టి తిరుమలలోని సిఆర్‌ఓ కార్యాలయం కౌంటర్‌లో ఆఫ్‌లైన్‌లో లక్కీడిప్ విధానం ఉంది. ఆన్‌లైన్‌లో ఎవరైనా భక్తులు అదృష్టంకొద్దీ సుప్రభాతం,తోమాల సేవలు టిక్కెట్లు బుక్‌చేసుకుని ఆయా తేదీల్లో ముందురోజు తిరుమలకు వస్తే గదులు కూడా దొరకడంలేదని భక్తులు ఆవేదన చెందుతున్నారు. దర్శన టిక్కెట్లతో పద్మావతి విచారణ కార్యాలయం, సిఆర్‌ఓలోని టిబి కౌంటర్ ,ఏఆర్‌పి కౌంటర్‌లకు వెళితే గదులు లేవంటూ, ఇవ్వలేమంటూ సిబ్బంది చెబుతుండటంతో భక్తులు కొంత అసహనం వ్యక్తం చేస్తున్నారు. టిటిడి అధికారులు మాత్రం వీలైనంతవరకు దర్శన టిక్కెట్ భక్తులు తిరుపతిలో వసతి పొంది సమయానికి తిరుమలకు రావాలని చెప్పడం మరో కొసమెరుపు. సాధారణంగా ఇప్పుడున్న పరిస్థితుల్లో తిరుమలలో 7,400వరకు గదులు భక్తులకు కేటాయిస్తున్నారు. 35వేలమంది నుండి 40వేలమంది భక్తులకు వసతి కల్పించే వీలుంటుంది. ఇందులో సిఆర్‌ఓ పరిధిలో 6వేల గదులు , ఎంబిసి పరిధిలో 700వరకు గదులు, పద్మావతివిచారణ కార్యాలయం పరిధిలో వెయ్యివరకు గదులు ఉన్నాయి. యాత్రికుల వసతి సముదాయాల్లో 15వేలమందివరకు లాకర్లు, విశాలమైన హాళ్ళతో విశ్రాంతి తీసుకునే సదుపాయం ఉంది. ఇందులో 2వేల వరకు గదులు ఆన్‌లైన్‌లో కేటాయిస్తారు. మిగిలిన గదుల్లో ప్రముఖులకు పద్మావతి విచారణ కార్యాలయం పరిధిలోని అతిదిగృహాలు, విశ్రాంతి భవనాల గదులు కేటాయిస్తున్నారు. సిఆర్‌ఓ జనరల్‌లో సామాన్యభక్తులు గదులు పొందవచ్చు. ఆన్‌లైన్‌లో గదులు బుక్‌చేసుకున్న భక్తులు సకాలంలో తిరుమలకు రాకుంటే వారికి గదులు ఇవ్వరు. అయితే శ్రీవారికి వేకువజామున జరిగే సుప్రభాతం, తోమాల,అర్చన సేవల దర్శనాల భక్తులకు తప్పనిసరిగా గదులు కేటాయింపు ఉండాలి. కేంద్ర,రాష్ట్రమంత్రులకు, టిటిడి బోర్డుసభ్యుల నుండి సిఫార్సులు వెల్లువెత్తుతుండటంతో ఆన్‌లైన్ దర్శన టిక్కెట్ భక్తులకు గదులు కేటాయించేందుకు టిటిడి వసతికల్పన విభాగం ఉద్యోగులు తలలుపట్టుకుంటున్నారు. కాగా 10,500 రూపాయలు చెల్లించి ఆన్‌లైన్‌లో శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సాధారణ గదులు కేటాయించేందుకు తంటాలుపడుతున్నారు. మరీ ఆన్‌లైన్ దర్శన టిక్కెట్లు కలిగిన భక్తులకు గదులు కేటాయించే విధానం ఉండాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా తిరుమలలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులు దర్శన టిక్కెట్ ఉంటేనే వసతి సౌకర్యం లభించనుంది. ఇప్పుడు ఆఫ్‌లైన్‌లో జారీచేసే టైమ్‌స్లాట్ టోకెన్లుకు గదులు కేటాయించడం లేదు. ఎటువంటి టిక్కెట్ లేకుండా తిరుమలకు వస్తే భక్తులకు గదులు ఇవ్వడం టిటిడి నిరాకరిస్తోంది.

# తిరుమల సమాచారం

## వారాంతంలో తగ్గిన భక్తులు

### - ఐదు గంటల్లోనే శ్రీవారి దర్శనం



**తిరుమల,ఆగస్టు 24ప్రభాతవార్త ప్రతి నిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి వారాంతం ఆదివారం భక్తులు రద్దీ తగ్గింది. గత రెండువారాలు కిటకిటలాడిన తిరుమల శని, ఆదివారాలు బాగా భక్తులు తగ్గుముఖం పట్టారు. ఆదివారం ఒక్కరోజే సెలవు రావడం, పైగా బుధవారం వినాయకచవితి పర్వదినం ఉండటంతో ఏడుకొండలు మోస్తరుగా భక్తులతో ఉంది. ఆదివారం ఉదయానికి వైకుంఠమ్‌లోని కంపార్టుమెంట్లలో సాధారణంగా భక్తులు ఉండటంతో ఉదయం వచ్చిన భక్తులను వచ్చినట్లే ఆలయంలోనికి అనుమతించారు. ఆపై మధ్యాహ్నం వరకు కూడా టైమ్‌స్లాట్ టోకెన్ భక్తులు, ముందుగా ఆన్‌లైన్‌లో దర్శన టిక్కెట్లు పొందిన భక్తులకు మూడుగంటల్లోనే స్వామివారి దర్శనం చేసుకునే అవకాశం కలిగింది. ఆదివారం సాయంత్రం వరకు 42వేలమంది భక్తులు మహాలఘులో దేవదేవుడిని దర్శించుకున్నారు. శనివారం అర్ధరాత్రివరకు 83,858మంది భక్తులకు దర్శనం కల్పించారు. మరో మూడునాలుగురోజులు ఇదే తరహాలో మోస్తరుగా భక్తులు ఉంటారని టిటిడి అంచనావేసింది.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు : ప్రముఖులు





**తిరుమల,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగు ప్రజలకు శుభాలు కలగాలని, దేవుని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. ఆదివారం ఉదయం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్‌భీమపాక, విద్య,మహిళ,యువజన క్రీడ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## నేడు వరాహస్వామికి ఏకాంత అభిషేకం

**తిరుమల,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** ఆదివరాహక్షేత్రం తిరుమలలో సోమవారం ఉదయం భూవరాహస్వామికి ఏకాంత అభిషేకం అర్చకులు నిర్వహిస్తున్నారు. వరాహస్వామి జయంతి సందర్భంగా ఉదయం కలశస్థాపన, కలశపూజ, పుణ్యాహావచనం చేపడతారు. ఆ తరువాత పాలు,పెరుగు,తేనె,చందనం, పసుపు, కొబ్బరిజలం వివిధ రకాల పండ్లతో తయారుచేసిన పంచామృతంతో వేదోక్తంగా మూలవర్లకు ఏకాంత అభిషేకం నిర్వహిస్తారు. తిరుమలలో ఆగమశాస్త్రం ప్రకారం వరాహస్వామికి తొలిపైజ, తొలినైవేద్యం , తొలి దర్శనం జరుగుతోంది.



## అక్టోబరు 2 నాటికి రాష్ట్రంలో లెగసీ వేస్ట్ పూర్తిగా తొలగిస్తాం : మంత్రి నారాయణ

**విజయవాడ,ఆగస్టు 24,ప్రభాతవార్త ప్రతినిధి :**అక్టోబరు 2 నాటికి ఏపీలో లెగసీ వేస్ట్ (గతంలో పేరుకుపోయిన వ్యర్థాలు) పూర్తిగా తొలగిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. మచిలీప్నటంలో లెగసీ వేస్ట్ డంపింగ్ యార్డును ఆయన పరిశీలించారు. చెత్త బయో మైనింగ్‌పై మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ...రాష్ట్రంలో ఇప్పటి వరకు 72 లక్షల టన్నుల చెత్త తొలగించినట్లు చెప్పారు. మరో 13 లక్షల టన్నులు మిగిలి ఉందని పేర్కొన్నారు. మచిలీపట్నంలో 19 వేల టనునల చెత్త తొలగించినట్లు వివరించారు. అదనపు మెషీన్లతో వేగంగా చెత్త తొలగించేలా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.'ఘన,ద్రవ్య వ్యర్థాలు తొలగించేందుకు ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'ద్వారా చెత్త నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నాం. రాష్ట్రంలో రోజూ 7,500 టన్నుల ఘన వ్యర్థాలు వస్తున్నాయి. వీటి నిర్వహణకు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం.ద్రవ్య వ్యర్థాల నిర్వహణకు రెండేళ్ళలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం' అని నారాయణ తెలిపారు.

## సెప్టెంబర్12నుండి తిరుపతిలో స్వర్ణోత్సవ నృత్యకళోత్సవాలు

**తిరుపతి.ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో తిరుపతిలో సెప్టెంబర్ 12నుండి 14వ తేదీవరకు మూడురోజులపాటు శ్రీకృష్ణదేవరాయ స్వర్ణోత్సవ నృత్యకళోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. శాస్త్రీయ నృత్య జానపద పోటీలు ఉంటాయన్నారు. బృదం నృత్యాలలో తమ ప్రతిభ చూపిన కళాకారులకు మొదటిబహుమతిగా 10వేల రూపాయలు, రెండోబహుమతిగా 6వేలు రూపాయలు, తృతీయ బహుమతిగా 3వేల రూపాయలు, సోలో నృత్యోత్సవాల్లో విజేతలకు మొదటి బహుమతి 4వేలు, రెండోబహుమతి 3వేలు. మూడోబహుమతి 2వేల రూపాయలు ,జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులకు మెమోంటోలు, ప్రశంసాపత్రాలు అందిస్తామన్నారు. తిరుపతి,చిత్తూరు, కడపజిల్లాల కళారారులు 12వతేదీ పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలకు రంగస్థలి కార్యదర్శి కెఎన్ రాజ,9347046608నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

## రాష్ట్రంలో ఆర్థిక అభివృద్ధి ఎక్కడ?

### - మాజీ సిఎం జగన్ విమర్శ



**'విజయ వాడ, ఆగస్టు 24,ప్రభాత వార్త ప్రతినిధి** :కూటమి ప్రభుత్వం ప్రచారం చేస్తున్నట్లుగా రాష్ట్రం ఆర్థికంగా 12.02% అభివృద్ధి సాధిస్తుంటే,ప్రభుత్వ వార్షికాదాయంలో 3.08%పెరుగుదల మాత్రమే ఎందుకు నమోదైంది.'అని మాజీ ముఖ్యమంత్రి జగన్ శనివారం 'ఎక్స్'లో చేసిన పోస్ట్‌లో ప్రశ్నించారు. 'మేం అధికారం లోకి వస్తే రాష్ట్ర ఆదాయాన్ని చాలా వేగంగా పెంచడంతో పాటు,రుణాలు పెరగకుండా చూస్తామని ఎన్నికలప్పుడు కూటమి లోని పార్టీలు హామీనిచ్చాయి.ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇంకా అస్తవ్యస్తంగా మారిందని కాగ్ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. గతేడాది కంటే ఈ ఆర్థిక సంవత్సరంలో పరిస్థితి మారుతుందని అంతా భావించారు. కానీ,ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లో గత ఏడాది ఇదే సమయంతో పోల్చి చూస్తే,వస్తుసేవల పనున (జీఎస్టీ),అమ్మకం పన్నుల ఆదాయంలో తగ్గుదల కనిపిస్తోంది. 2023-24లో తొలి నాలుగు నెలల్లో వచ్చిన ఆదాయం కంటే ఈ ఏడాది మొదటి నాలుగు నెలల్లో ప్రభుత్వానికి ఆదాయం 2.39% మాత్రమే పెరిగింది'అని పేర్కొన్నారు. కీలక రంగాల్లో మూలధన వ్యయం తగ్గడం వల్ల ప్రభుత్వ ఆదాయం కూడా దారుణంగా పడిపోతోందని పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందడం లేదని, అది ఆర్థిక మాంద్యాన్ని సూచిస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2024- 25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత ఆదాయం అంతకుముందు ఏడాదితోపోలిస్తే చాలా తక్కువ నమోదైందని పేర్కొన్నారు. రాష్ట్రం ఆర్థికంగా 12.02 శాతం అభివృద్ధి సాధిస్తుంటే సొంత ఆదాయం 3.08 శాతం మాత్రమే పెరుగుదల ఎలా నమోదైందని ప్రశ్నించారు. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే అదే ఆర్థిక అస్తవ్యస్త పరిస్థితి ప్రస్ఫుటం అవుతోందని పేర్కొన్నారు. గత ఏడాది ఇదే సమయంలో పోలిస్తే వస్తుసేవల పన్ను, అమ్మకం పన్నుల ఆదాయంలో తగ్గుదల కనిపిస్తోందని వివరించారు. ఈ 14 నెలల్లో టిడిపి ప్రభుత్వం రూ.1,86,361 కోట్లు అప్పులు చేసిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అప్పుల్లో 56 శాతం కూటమి ప్రభుత్వం 14 నెలల్లో చేసిందని తెలిపారు. ఆదాయం వృద్ధి తక్కువగా ఉండటం, అప్పులు పెరగడం ఆందోళన కలిగిస్తోందని జగన్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు అసత్యాలను చాలా చాకచక్యంగా ప్రచారానికి వినియోగించుకుంటున్నారన్నారు.ఏ సంక్షేమ పథకాన్ని ఆయన చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారు.ఏ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయకుండా ప్రచారంతో సరిపెట్టుకుంటున్నారు." స్త్రీ శక్తి" పథకం అమలులో మహిళలకు ఆశించిన ప్రయోజనం లేకుండా చేసారన్నారు.తల్లివందనం పేరుతో తల్లులను తీవ్రంగా వంచించారన్నారు.వైకాంగ్రెస్ పార్టీపై తప్పుడు కేసులు పెడుతున్నారు.అన్యాయంగా మా పార్టీ కార్యకర్తలపై దాడులు చేయిస్తున్నారు.వీటన్నింటికి మూల్యం చెలిస్తారు.

## బసవ ఎక్స్‌ప్రెస్‌కు ఐసిఎఫ్ బోగీలు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 24,ప్రభాతవార్త** :రాయలసీమ జిల్లాల మీదుగా మైసూర్-బాగల్ కోట్-మైసూర్‌ల మధ్య తిరిగే బసవ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఈ నెల 25నుంచి ఐసిఎఫ్ బోగీలతో నడపాలని రైల్వే శాఖ సంచలనాత్మక నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. జర్మనీ దేశపు అత్యాధునిక యాంత్రిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎల్‌హెచ్‌బీ బోగీలతో మైసూరు-బాగల్‌కోట్-మైసూరు మధ్య తిరిగే నెంబర్ 17307-08బసవ ఎక్స్‌ప్రెస్‌కు ఇటీవల వరుసగా ఏర్పడుతున్న బ్రేకింగ్ ప్రెషర్ డ్రాపింగ్ సమస్యల కారణంగా ఈ రైళ్లు గంటలకొద్ది తీవ్ర ఆలస్యంతో తిరుగుతున్న విషయం పాఠకులకు విధితమే. తద్వారా ప్రయాణికులకు కలుగుతున్న అసౌకర్యం, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎల్‌హెచ్‌బీ బోగీలకు బదులు, చెన్నైలోని పెరంబూర్ ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ(ఐసిఎఫ్)ఉత్పత్తి చేసే ఐసిఎఫ్ బోగీలతో నడపాలని రైల్వే శాఖ ఈ మేరకు నిర్ణయించినట్లు సమాచారం. ఇందులో భాగంగా మైసూర్ నుండి బాగల్ కోట్ వెళ్లే నెంబర్ 17307బసవ ఎక్స్‌ప్రెస్‌కు నేటి నుంచి (ఈ నెల 25సోమవారం),బాగల్‌కోట్ నుంచి మైసూర్‌కు వెళ్లే నెంబర్ 17308బసవ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 26మంగళవారం నుంచి ఐసిఎఫ్ బోగీలతో నడపాలని

ఈ మేరకు రైల్వే శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

## కాల్ లెటర్లు లేవు.. మెసేజ్‌లు రాలేదు!

### - ఆందోళనలో మెగా డిఎస్సీ అభ్యర్థులు

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 24 ప్రభాతవార్త** నగర శివారు ఆలమూరు రోడ్డులో ఉన్న శ్రీ బాలాజీ పీజీ కళాశాలలో సోమవారం ఉదయం 9 గంటలకు మెగా డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం కానుంది. అయితే ఎంపికైన అభ్యర్థులకు కాల్ లెటర్లు, మొబైల్స్ మెసేజ్లు రాకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ జరుగుతుందా? లేదా? అన్నది అభ్యర్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వము 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేయడానికి ఏప్రిల్ 20న మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. జూన్ 6 నుండి జూలై 2వ తేదీ వరకు పరీక్షలు జరిగాయి. ఆగస్టు 2న ఫైనల్ కీ ను విద్యాశాఖ విడుదల చేసింది. అదేవిధంగా 11న స్కోర్ కార్డు ను కూడా విడుదల చేసింది. 11 రోజులు తర్వాత 22వ తేదీ రాత్రి మెరిట్ లిస్టును కూడా విడుదల చేసింది. ఆ మెరిట్ లిస్టు ఆధారంగా తమకు ఎన్ని మార్కులు వచ్చాయి, తాము అర్హత సాధించామ లేదా అన్నది అభ్యర్థులు తెలుసుకున్నారు. అదేవిధంగా అభ్యర్థులు అర్హత సాధించడంతో ఆనందంలో మునిగి తేలుతున్నారు. ఎంపికైన అభ్యర్థులకు సోమవారము సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను నిర్వహిస్తామని, ఎంపికైన అభ్యర్థులు అన్ని విద్యార్హత సర్టిఫికెట్లతో రావాలని, సూచిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారకంగా ప్రకటించడం జరిగింది. అందుకు సంబంధించి దాదాపు 20 టీమ్ లను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఆ టీం సభ్యులకు శనివారం సాయంత్రం సర్టిఫికెట్లు పరిశీలన కేంద్రంలో శిక్షణ కూడా ఇవ్వడం జరిగింది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను కూడా జిల్లా విద్యాశాఖ సిద్ధం చేసింది. ఎప్పటికైనా అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్ లో కాల్ లెటర్లు వస్తాయని, తమ మొబైల్ కు మెసేజ్లు కూడా వస్తాయని విద్యాశాఖ ప్రకటించింది. అయితే ఆదివారం సాయంత్రం వరకు అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్ ద్వారా కాల్ లెటర్లు రాలేదు, మొబైల్ కు మెసేజ్ లు కూడా రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. విద్యాశాఖ అధికారులు మాత్రం సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను ఒకరోజు మాత్రమే నిర్వహిస్తామని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యాశాఖ అధికారులను సంప్రదిస్తే టెక్నికల్ సమస్య ఉందని, దానిని రాష్ట్రం ఉన్నత అధికారులు పరిష్కరిస్తున్నారని, రాత్రి లోపు అభ్యర్థులకు కాల్ లెటర్లు, మెసేజ్ లు వస్తాయని చెబుతున్నారని అభ్యర్థులు వాపోతున్నారు. అయితే ఇలాంటి పరిస్థితుల్లో సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ జరుగుతుందా ? లేదా? జరిగితే ఈ ప్రక్రియను మరో రెండు రోజులు పొడిగిస్తారా ?లేదా? అన్నది కూడా అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

## కేంద్రీకృత విధానాల కన్నా వ్యవస్థ ఆధారిత పాలన మేలు

### పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ హేమాంగ్‌జోషి



తిరుపతి ఐఐటిలో పాల్గొన్న ఎంపి జోషి

**శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త** ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న రాజకీయ,సామాజిక, సాంకేతిక పరిణామాల దృష్ట్యా భారతదేశానికి వ్యక్తి కేంద్రీకృత విధానాల కాన్న వ్యవస్థ ఆధారిత పాలన ఎంతో అవసరమని పార్లమెంటు సభ్యుడు డాక్టర్ హేమాంగ్‌జోషి అన్నారు. ఆదివారం తిరుపతి ఐఐటిలో డీకోడింగ్ డేమాక్రసి: ఎ కన్వర్సేషన్ ఆన్ పాలసీ పాలిటిక్స్ అండ్ గవర్నేన్స్ అనే అంశంపై ఏర్పాటు చేసిన సెమినార్‌కు గుర్జాత్ వదోదర లోక్‌సభ సభ్యులు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఐఐటిలో మావవీయ శాస్త్రాలు మరియు సామాజిక శాస్త్రాల విభాగం నీతిబోధ్ దిపాలసీ క్లబ్ ఆఫ్ ఐఐటి సహకారంతో ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక అవగాహన కోసం డైరెక్టర్ ప్రొఫేసర్ సత్యనారాయణ పలు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూ దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖులతో విద్యార్థులను మమేకం చేస్తున్నారు. ఐఐటిలోని మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసీ విద్యార్థులకు కోసం ఓ ఆకర్షణీయమైన ఇంటరాక్టివ్ సెషన్‌ను ఏర్పా టు చేసారు. ప్రజా స్వా మ్యం పాలన మరియు ప్రజా విధానం యొక్క డైనమిక్స్‌పై చర్చల్లో డాక్టర్ మేమాంగ్‌జోసి విద్యార్థులు, అధ్యాపకులు,విధాన ఔత్సాహికులతో సమావేశం నిర్వహించారు. డైరెక్టర్ ఇన్‌చార్జి ప్రొఫేసర్ శశిధర్ గుమ్మా మెడరేట్ చేసారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి హేమాంగ్‌జోషి ఫిజియోథెరిపి,మానవ వనరుల నిర్వహణ మరియు విద్యార్థి నాయకత్వంలో గొప్ప నేధ్యం కల్గిన మొదటి సారి రాజకీయ నాయకుడైన డ్యాక్టర్ జోషి తన స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని పంచుకున్నారు. తన తల్లి దండ్రులను ఒప్పించటం నుంచి తప వైద్య బ్యాచిలర్ తర్వాత హెచ్ ఆర్‌లో మాస్టర్స్ చేసామని వివరించారు. 50వేల మందిని ప్రభావితం చేసిన వదోదర మున్సిపల్ కార్పోరేషన్ ఎడ్యుకేషన్ కమిటి వైస్ ఛైర్మెన్‌గా తన ఎగుదలను గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. రాజకీయ కుటుంబవారసత్వం లేకుడానే ఆయన తన ఎదుగుదలను వివరించారు.యువతకు సాధికారిత కల్పించటంలో కేంద్ర ప్రభుత్వం చొరవ చూపిందని లక్ష మంది రాజకీయేతర వ్యక్తులను దేశ నిర్మాణంలో అనుసంధా నించాలన్న ప్రధాని నరేంద్రమోదీ పిలుపు ఆయన ప్రస్తావించారు.ఈ సెషన్‌లో విధాన విశ్లేషణ అధ్యయనం జరిగింది. జోషి సమతుల్య కేస్ స్టడీలను ప్రదర్శించారు, నిరుపేద విద్యార్థులకు విద్యను అందించటం మరియు సామాజిక అభ్యున్నతికి లక్ష్యంగా 'నవోదయ విద్యాలయాన్ని' ఆయన ప్రసంశించారు. వ్యక్తి కేంద్రీకృత విధానాల కంటే వ్యవస్థ ఆధారిత పాలన అవసరాన్ని ఆయన నొక్కి వక్కాణించారు.

## భార్యపై కోపంతో కూతురును నీళ్లలోకి విసిరేసిన భర్త

**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** భార్యపై కోపంతో ఓ భర్త కన్న కూతురును కర్కశంగా బుడమేరులోకి విసిరేసి వెంటనే అక్కడ నుంచి పారిపోయాడు. నాన్న వెంట వెళ్లిన ఆ చిన్నారికి ఏం తెలుసు ఇలా జరుగుతుందని. స్థానికులకు ఆ చిన్నారి ఏడుపులు వినిపించాయి. అందరి మనసులను కలచి వేస్తోంది. చిట్టినగర్‌కు చెందిన కానూరు వెంకట స్వామి, పోలమ్మలు భార్యాభర్తలు. వీరిద్దరూ చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ సీసాలు సేకరిస్తారు. వాటిని అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తూ ఉంటారు. వీరికి ఆరుగురు పిల్లలు. చివరి పాప అంజమ్మకు 3 నెలలు. పోలమ్మ పుట్టింటికి కాన్పు నిమిత్తం వచ్చింది. ప్రస్తుతం ఆమె అక్కడే ఉంటోంది. శుక్రవారం రాత్రి అక్కడికి భర్త వచ్చాడు. భార్యతో చిన్న విషయమై గొడవ పడ్డాడు. అది కాస్త పెద్దదిగా మారింది. దాంతో ఆ రాత్రి 8 గంటల సమయంలో చివరి కుమార్తె అయిన అంజమ్మను తన వెంట తీసుకుని కోపంతో వెళ్లిపోయాడు. న్యూ రాజరాజేశ్వరీపేట బుడమేరు వంతెన పైనుంచి శిశువును బుడమేరులోకి విసిరేసి, పారిపోయాడు. రాత్రి 9.30 గంటల సమయంలో స్థానికుడు బేతాళం నాగరాజుకు చిన్నారి ఏడుపులు వినిపించాయి. ఆ పాపను చేరదీశాడు. స్థానికుల సాయంతో అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు అప్పగించగా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అజిత్‌సింగ్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆధారాల కోసం సీసీ కెమెరాలను పరిశీలించడం ప్రారంభించారు. చుట్టుపక్కల ప్రాంతాల వారిని విచారించారు. శనివారం ఉదయం చిన్నారి తల్లి పోలమ్మ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. భర్త తనతో గొడవ పడి పాపను తీసుకుపోయాడని కన్నీటిపర్యంతమయ్యారు. చిట్టినగర్ కొండపై ఉన్న తన ఇంటికి వెళ్లి భర్త, బిడ్డ కోసం వెతికానని వారి ఆచూకీ లేక రాత్రంతా వెతుకుతూనేఉన్నామన్నారు.

## పుణ్యక్షేత్రంలో వినాయకచవితి సమష్టిగా ప్రశాంతంగా జరుపుకోండి

### - కేంద్రమంత్రి భూపతిరాజుశ్రీనివాసవర్మ

**తిరుపతి,ఆగస్టు 24ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణలో సికింద్రాబాద్ తరువాత తిరుపతిపుణ్యక్షేత్రంలో ప్రశాంతవాతావరణంలో వినాయకచవితి పండుగను పెద్దఎత్తున జరుపుకోవండ ఆనందదాయకమని కేంద్రమంత్రి భూపతిరాజుశ్రీనివాసవర్మ తెలిపారు. ప్రతి ఇంటా ఉన్నంతలో జరుపుకునే వినాయకచవితి పండుగకు తిరుపతిలో వరసిద్ధివినాయక మహోత్సవ కమిటీ నాయకులు ఏర్పాట్లు చేయడం బావుందన్నారు. హిందువుల అత్యంత ముఖ్యమైన పండుగ వినాయకచవితి అన్నారు. అందరూ కలసి సమిష్టిగా ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలని కోరారు. తిరుమల,తిరుపతి పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం కుటుంబంతో కలసి తిరుపతిలోని వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ ఆహ్వానం మేరకు కార్యాలయాన్ని సందర్శించారు. ఇక్కడ వినాయకుని ప్రతిమకు పూజలు చేసి స్వామివారి ఆశీర్వాదం అందుకున్నారు. వినాయకవిగ్రహాలు నెలకొల్పి పూజలు చేసే మండపాల నిర్వాహకులు ,వరసిద్ధివినాయక మహోత్సవ కమిటీ సూచించే నిబంధనలు పాటించాలని కోరారు. ప్రతి ఒక్కరూ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కేంద్రమంత్రి ఆకాంక్షించారు.అంతకుముందు కేంద్రమంత్రి వర్మకు కమిటీ సభ్యులు గుండాల గోపీనాథరెడ్డి, ఊకావిజయకుమార్,సదాశివం, అనూషరామకృష్ణ, డిపి ఆనంద్, మల్లారపు వాసు, గోపీప్రసాద్, గంటసాల కృష్ణ, నరేశ్,బాలాజీ, కొండే చెంగారెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి,వరప్రసాద్ సాదర స్వాగతం పలికారు.



## విజయవాడలో నేటి నుంచి గాంధీ బునకర్ మేళా - 2025

**విజయవాడ,ఆగస్టు24,ప్రభాతవార్తప్రతినిధి:** నేటి నుండి అనగా ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 7 వరకు విజయవాడలో గాంధీ బునకర్ మేళా ను శ్రీ శేష సాయి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నామని చేనేత మరియు జౌళీ శాఖ కమిషనర్ జి. రేఖారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన- 2025 ఈ నెల 25సోమవారం నుండి సెప్టెంబర్ 7వ తారీఖు వరకు ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ వస్త్ర ప్రదర్శనలో ఏపీ, తెలంగాణా, ఉత్తర ప్రదేశ్, బెంగాల్, మధ్యప్రదేశ్, హార్యాణా, ఝూర్ఖండ్, జమ్మూ కాశ్మీర్, రాజస్థాన్, ఛతీస్ గడ్, బీహార్ తదితర 14 రాష్ట్రాలకు చెందిన చేనేత వస్త్రాలతో పాటు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ధర్మవరం, మదనపల్లి, వెంకటగిరి, మంగళగిరి, బందరు పేటు, అంగర, పులగుర్త, మాధవరం, కాటన్ చీరలు, సీకో టస్సరు సిల్క్ చీరలు, పట్టు చీరలు, ధోవతులు, లుంగీలు, మంగళగిరిచీరాల డ్రస్ మెటీరియల్స్, పెద్దాపురం శిల్క్ పొందూరు కాటన్ షర్టింగ్, గద్వాల్, పోచంపల్లి చీరలు, డిజైన్ బెడ్ షీట్స్, వరంగల్ డర్రీలు అండ్ డోర్ మేట్స్, కలంకారీ మరియు ఇతర అనేక రకములైన చేనేత వస్త్రములు 104 స్టాల్స్ లో అందుబాటు ధరలలో లభిస్తాయని వివరించారు. ఈ వస్త్ర ప్రదర్శనకు ప్రవేశం ఉచితమని తెలిపారు. అలాగే వస్త్ర ప్రదర్శన ప్రాంగణంలో ఫుడ్ కోర్టు కూడా ఉంటుందన్నారు. వంద శాతం నాణ్యమైన చేనేత వస్త్రాలు లభిస్తాయని తెలిపారు.

వార్త


అనుభవమనేది మనకున్న ఒకే ఒక్క గురువు. మనం జీవితాంతం ఎన్నో విషయాల గూర్చి మాట్లాడవచ్చు. తర్కించవచ్చు. కానీ ఒక సత్యమైన విషయాన్ని అనుభవించేంతవరకు అది అర్థం కాదు.

-స్వామి వివేకానంద

# వీధి కుక్కలకు ముకుతాడు!

వీధికుక్కల బెడదకు సరికొత్త పరిష్కారం దొరికింది.ఢిల్లీ ఎన్సీఆర్ ప్రాంతంలోని వీధి కుక్కలన్నిటినీ షెల్టర్లకు తరలించాలన్న తీర్పుపై జంతు ప్రేమికుల నుంచి వచ్చిన అభ్యంతరాలపై సుప్రీం కోర్టు త్రిసభ్య ధర్మాసనం సమీక్షించి తీర్పును తిరగరాసింది. ఈసారి వీధి కుక్కల బెడద తొలగించుకునేందుకు జాతీయ విధానాన్ని రూపొందించడానికి వీలుగా సర్వోన్నత న్యాయస్థానం పలు మార్గదర్శకాలు సూచించింది. ముందు వీధికుక్కల దాడుల వలన ఢిల్లీ,ఎన్సీఆర్ పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతున్నాయన్న సమాచారాన్ని పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌ల ధర్మాసనం ఎనిమిది వారాల్లోపు వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఒక్క కుక్క కూడా రోడ్డు మీద కనపడరా దని ఆదేశించారు.ఈ చర్యలను అడ్డుకునేందుకు ప్రయత్నించే సంస్థలపై కఠిన చర్యలు తప్పవని నిర్దేశించారు. మానవతా దృక్పథమే కాకుండా సాధ్యాసాధ్యాలను కూడా కోర్టు పరిశీలించకపోవడం కరెక్టు కాదని కేంద్ర మాజీ మంత్రి జంతు హక్కుల కార్యకర్త మేనకాగాంధీ భావించారు. ఢిల్లీలో మూడులక్షల కుక్కలుండగా వాటికోసం ఏర్పాటు చేయాల్సి న మూడు వేల షెల్టర్లకు రూ.15వేల కోట్లు ఖర్చు చేసే పరిస్థితి ఢిల్లీ ప్రభుత్వానికి ఉందా? అని ప్రశ్నించారు. ఈ తీర్పు దశాబ్దాలుగా భారతీయులు అను సరించిన సైన్సు ఆధారిత విధానాల నుంచి వెనుకడుగు వేసినట్లుందని కాంగ్రెస్‌నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. వీటన్నిటి నేపథ్యంలో మూగజీవుల పట్ల ఎంతో కఠినాత్మక వైఖరి కూడదన జంతు ప్రేమికుల అభ్యర్థనతో త్రిసభ్య ధర్మాసనం పలు మార్గదర్శకాలు సూచించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం కుక్కకాటు వల్ల వచ్చే రేబిస్ మరణాలు ఏటా 18వేల నుంచి20వేలవరకు ఉంటాయి. వీటిలో రేబిస్‌కు గురైన వారి మరణాల వాటాలో భారత్‌లో 38 శాతం. ఒక్క 2024లోనే దేశంలో 37.17లక్షల కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. అంటే దేశవ్యాప్తంగా సగటున రోజుకి 10వేల కేసులు. ఇలాంటివి విన్నప్పుడు ఒళ్లు జలదరి స్తుంది. కుక్కకాటుకు గురై చనిపోయిన వారిలో అధికులు చిన్నపిల్లలే. వీధికుక్కల నియంత్రణ పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం వల్లనే ఇలా జరుగుతోందన్నది సర్వవిదితం. స్థానిక సంస్థలు ఈ పద్ధతులను గత కొంత కాలంగా ప్రభుత్వాలు పాటించనందునే ఇప్పుడిలాంటి పరిస్థితి తలెత్తింది. వివిధ రాష్ట్రాల్లో కుక్కల గణాంకాలు చూస్తే బాగా పెరిగిపోయాయి. అప్పుడు నియంత్రణలో నిర్లక్ష్యం వహించి, ఇప్పుడు వీధి కుక్కల వీరంగాన్ని భరించలేని పరిస్థితికి తెచ్చారు. ఈ విషయంలో ప్రభుత్వ యాజమాన్య సంస్థలే బాధ్యత వహించాలి. మూగజీవాల జనన నియంత్రణ (2003) చట్టానికి విరుద్ధమని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ యానియన్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్, పెటా వంటి సంస్థలు ఆరోపిస్తున్నాయి.వీధికుక్కల బెడద తీవ్రం కావడానికి స్థానిక సంస్థల బాధ్యతారాహిత్యమే ప్రధాన కారణమని సుప్రీం కోర్టు త్రిసభ్య ధర్మాసనంకూడా నిర్ధారించింది. తాజాగా తీరునపలో రేబిస్ వ్యాధికారక శునకాలను మాత్రమే షెల్టర్‌కు తరలించాలని, దేశవ్యాప్తంగా ఇదేవిధానాన్ని అవలంబించాలని ధర్మాసనం పేర్కొంది. జస్టిస్ విక్రమ్‌నాథ్‌నేతృత్వంలో జస్టిస్ సందీప్ మెహతా,జస్టిస్ ఎన్.వి. అంజరియాలు వీధికుక్కల బెడదపై సమీక్షించారు.వీధి కుక్కలకు బహిరంగ ప్రదేశాల్లో ఆహారం అందించడం చట్ట విరుద్ధమని ధర్మాసనం స్పష్టంచేసింది. వీధికుక్కల సంరక్షణలో పలు సూచనలు ఆచరణాత్మకంగా పేర్కొన్నారు.వీధి శునకాలకు టీకాలు ఇవ్వడంతోపాటు సంతాననిరోధక చికిత్సల తర్వాతనే బయటకు వదలాలని ఆదేశించింది. దీని వలన వీధికుక్కల వలన ఏర్పడే సమస్యలను తగ్గించవచ్చునని అభిప్రాయపడింది. నియంత్రణ లేకుండా శునకాలకు ఆహారం ఇవ్వడమే జనావాసాల్లో అవాంఛనీయఘటనలకు కారణమని ధర్మాసం అభిప్రాయపడింది.కుక్కలను పెంచుకోవాలనుకునే వారు వాటిని తమ ఇంటిలోనే ఉంచుకొని మునిసిపల్ అధికారుల అనుమతి తీసుకోవాలి. వీధికుక్కలకైతే నిర్దేశిత ఫీడింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటికి ఆహారం అందించే శాశ్వత ప్రాతిపదికన స్థలాలను గుర్తించే బాధ్యత మునిసిపాలిటీలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రతి మునిసిపల్ వార్డులోనూ వీధిశునకాలకు ఆహారం అందించే ఆహార కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి బయట బోర్డులు పెట్టాలని ఢిల్లీమునిసిపల్ కార్పొరేషన్‌ను ధర్మాసనం ఆదేశించింది.వీధికుక్కల దత్తత కోసం ప్రత్యేక ప్రమాణాలు పాటించాలని జంతు ప్రేమికులకు సలహా ఇవ్వడం విశేషం. ఆయా కుక్కల సంరక్షణ బాధ్యత పూర్తిగా వారిపైనే ఉంటుంది. తీర్పుసవరణపై జంతు హక్కుల పరిరక్షణ సంస్థ 'పెటా' ప్రత్యేకించి ' ప్రతి కుక్కకూ ఓ రోజొస్తుంది' అనే వ్యాఖ్యను ప్రకటించారు.దేశంలో జంతు హక్కుల కోసం 'పెటా' పోరాడుతోంది. వీధికుక్కల కోసం మంచినీటిని, మంచి ఆహారాన్నే అందించాలన్న నినాదం వారిది. తాజా తీర్పువలన అటు ప్రజలకు కానీ,వీధికుక్కలకు కానీ ఎలాంటి అపకారం జరుగదని 'పెటా' ప్రకటిస్తోంది. వీధి కుక్కల బెడదను నివారించేందుకు తాము మధ్యంతర ఉత్తర్వులలో పలుసూచనలు, జాగ్రత్తలు వివరించినప్పటికీ ప్రత్యేక జాతీయవిధానం అవశ్యకతఉందని, అందుకోసం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన పశు సంవర్థక శాఖల కార్యదర్శులకు ఆయా స్థానిక పరిస్థితుల మీద ఆధారపడి సూచనలు చేయమని ధర్మాసనం అవకాశంకల్పిస్తూ నోటీసులు పంపింది.స్థానిక సంస్థలు నిరంతర పర్యవేక్షణలో లోటుపాట్లకు ఆస్కారం లేకుండా ధర్మాసనం మార్గదర్శకాలను పాటిస్తే వీధికుక్కల వీరంగాలను నియంత్రించగలిగే అవకాశముంది.

చెడుని చాలా తేలికగా వదిలించుకోవచ్చు. ఎందుకంటే చెడుకు కాళ్లే లేవు. కాళ్ల మీద అది తనకు తానుగా నిలబడటానికి.



మహాత్మా గాంధీ

సులువుగా 20 మందికి సలహాలు ఇవ్వగలను.వాటిని పాటించవలసిన వారిలో ఒకణ్ని కావడమే కష్టం.



షేక్స్‌పియర్

# ప్రజావాక్కు



## సమన్వయంతో ముందుకు రావాలి

సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టులను అరికట్టేందుకు మార్గదర్శకాలురూపొందించాలన్న సుప్రీంకోర్టు ఆలోచన సమాజ ప్రయోజనాల దృష్ట్యా ఆహ్వానించదగినది. సోషల్‌మీడియా వేదికలు వాస్తవానికి ప్రజాస్వామ్య చర్చలకు, ఆలోచనల మార్పిడికి ఉపయోగపడాలి. కానీ ఇవి నేడు విభేదాలను రెచ్చగొట్టే, ప్రైవసీని ఉల్లంఘించే వేదికలుగా మారడం ఆందోళనకరం. భావ స్వేచ్ఛ అనేది ఇతరులను అవమానించడానికిలేదా మతభావాలను దెబ్బతీయడానికి అనుమతి ఇవ్వదు. కానీ, తప్పుడు ప్రచారం, ద్వేషపూరిత పోస్టులు, వ్యక్తిగత దాడులు సామాజిక సమతుల్యతను భంగం చేస్తున్నాయి. కాబట్టి ఈ సమస్యను ఎదుర్కోవడానికి ప్రభుత్వం,చట్టవ్యవస్థ,సోషల్ మీడియా సంస్థలు సమన్వయంతో ముందుకు రావాలి.

- సి హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రపంచంలో ఊబకాయంతో బాధపడుతున్న వాళ్లు కోకొల్లలు.మనదేశంలో కూడా తక్కువేమీకాదు. ఈ ఒబెసిటికి ప్రధాన కారణం వ్యాయామలేమి.జంక్‌ఫుడ్ ఎక్కువ తీసుకోవడం అని నిపుణులు చెబుతుంటారు. మంచి ఆరోగ్యం పొందాలంటే చిరుతిళ్లు నిద్ర ముఖ్యంగా మానసిక ప్రశాంతత ఎంతోఅవసరం. రోజుకు కనీసం పది నిమిషాల పాటు ధ్యానం చేయాలి. కష్టాలు కలకాలం ఉండవని గ్రహించాలి. నీరు ఎక్కువగా తాగాలి. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. పొగతాగడం, మందు వగైరాలకు వెంటనే స్వస్తి పలకాలి.

- కె.రామారావు, నల్గొండ

## క్రమశిక్షణ అవసరం

టి.వి.లలో ప్రసారమయ్యే డిబేట్లలో అన్ని పార్టీల ప్రతినిధులు, రాజకీయ విశ్లేషకులు పాల్గొంటారు. యాంకర్లు అడిగే ప్రశ్నలకు వారు సమాధానం చెప్పాలి.కానీ వారిలో క్రమశిక్షణ లోపిస్తోంది. ఒకరు మాట్లాడుతుంటే మరొకరు అనవసరంగా కలగజేసుకుని గట్టిగా మాట్లాడుతుంటారు. అప్పుడప్పుడు మూడో వ్యక్తి కూడా తన అభిప్రాయాన్ని వెలుబుచ్చు తుంటారు.ఒకరి తరువాత ఒకరు మాట్లాడాలని తాను వారికి మరల అవకాశమిస్తానని యాంకర్లు మర్యాదగా మందలిస్తున్నా వినిపించుకోరు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ఆధిపత్య ధోరణి పనికిరాదు

ఉక్రెయిన్ యుద్ధం కావొచ్చు ఇరాన్ ఇజ్రాయేల్ యుద్ధం కావొచ్చు బలమైన ఆర్థిక వ్యవస్థలు అని చెప్పుకున్న దేశాలు తోకముడిచాయి.ఎందుకని ఉక్రెయిన్ తో వారికి నిత్యావసరాల అవసరం ఉంది. ఇరాన్‌తో ఇంధన అవసరాలు ఉన్నాయి. చిన్న దేశాలను బెదిరించి తమ గుప్పిట పెట్టుకోవడమే లక్ష్యంగా పెద్ద దేశాలు పావులు కదుపుతున్నాయి కాకపోతే వాటిపైన దాడి ఒక్కోసారి కొంచెం హెచ్చు స్థాయిలోనో కొంచెం తక్కువ స్థాయిలోనో ఉంటున్నాయి. ఈ యుద్ధాలు ఇలాగే కొనసాగితే ఆర్థిక మాంద్యాలు, ధరల పెరుగుదలలు, సరఫరా వ్యవస్థలు దెబ్బతినడం అన్నింటికీ మించి మానవ హననం జరుగుతుంది అనేది ఒక వాస్తవమే. ఇక్కడ ఇంకోటి కూడా గమనించాలి ఈనాడు చిన్న దేశాలు పెద్ద దేశాలకు బయపడడం లేదు. ఇదే ఇప్పుడు ప్రపంచం ముందు ఉన్న చిత్రం. ఇక ఎంత మాత్రం ఆధిపత్య ధోరణి పనికి రాదు.

- భారత అవినాష్, జనగామ

## బదలీలకు షెడ్యూల్ ప్రకటించాలి

ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ప్రిన్సిపల్స్, పీజీటీలు, టీజీటీల బదిలీలను నిర్వహించాలని మరియు దీనికి సంబంధించిన షెడ్యూల్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టీచర్స్ కోరుతున్నారు. డీఎస్సీ 2025 నిర్వహణకు ముందు బదలీ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని, డీఎస్సీ 2018 ద్వారా నియమితులైన మోడల్ స్కూల్స్ సిబ్బందికి ఈ అవకాశాన్ని కల్పించాలి. ఇదివరకే అనేకసార్లు ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో, ఇప్పటికైనా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- టి. సురేష్, ఆంధ్రప్రదేశ్

## మాదకద్రవ్యాలపై నియంత్రణ అవసరం

మద్యం, మాదకద్రవ్యాలు ఊరూరా విచ్చలవిడిగా లభిస్తూ నవతరాన్ని దారితప్పిస్తున్నాయి. వీటిని అణచివేసేందుకు ఉక్కుపాదం మోపాలి. నవతరాన్ని కాపాడాలి. మద్యం, మాదకద్రవ్యాలు యువతకు అందకుండా ప్రభుత్వం నిఘా ఏర్పాటు చేయాలి. రాష్ట్రంలోకి మత్తు పదార్థాలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. కాలేజీలు, స్కూళ్ల వద్ద నిఘాను ఏర్పాటు చేయాలి. ఎవరైనా వీటిని అమ్మినట్లు తెలిసినా, చూసినా వారిని వెంటనే అదుపులోకి తీసుకొని కఠిన శిక్షలు విధించాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలపై నిఘా ఉంచాలి.

-డి. వెంకటరెడ్డి, ఊరదాళ్ళపాలెం ప.గోజిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# చదువే కాదు.. పరిశుభ్రత కూడా హక్కే!

**ప్రభుత్వంవిద్యా హక్కు గురించి పదేపదే చెప్పడం అందరికీ తెలిసిందే. అయితే ఆ హక్కులో భాగంగా పరిశుభ్రత కూడా ఒక భాగంగా పరిగణించాలి. చదువు నేర్చుకునే వాతావరణం పరిశుభ్రంగా ఉండకపోతే, విద్యార్థి ఏ విధంగా అధ్యయనం పై దృష్టి పెట్టగలడు? అలాంటి వాతావరణాన్ని కల్పించడానికి అవసరమైన ప్రాథమిక విషయాలను కూడా పట్టించుకోకపోతే, విద్యా వ్యవస్థపై నమ్మకం ఎలా కలుగుతుంది? తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్పించడ మంటే, వారికి ఉత్తమమైన భవిష్యత్తు కల్పించాలనే ఆకాంక్ష. కానీ వారు కనీస పరిశుభ్రత కోసం కూడా ప్రభుత్వం కళ్లు మూసి కూర్చోవాల్సి న పరిస్థితి చాలా బాధాకరం. ఈ చిన్న మొత్తాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంవల్ల లక్షలాది విద్యార్థుల ఆరోగ్యం, గౌరవం, అభివృద్ధి సంకటంలో పడుతోంది. ఇది కేవలం ఆర్థికంకాదు, ఇది మానవతా అంశం. ప్రభుత్వం ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలి. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సకాలంలో విడుదలయ్యేలా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటుచేయాలి. విద్యార్థులకు అవసరమైన నిత్యవసరాలు ప్రతి నెలా సమయానికి అందేలా చూడాలి.**



అప్పన్న గొనప

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఏర్పాటు చేయబడ్డ ముఖ్యమైన విద్యాసంస్థలు. రాష్ట్రంలో రెసిడెన్షియల్ స్కూళ్లు, సాంఘిక సంక్షేమ గురుకులాలు, గిరిజన సంక్షేమ గురుకులాలు వంటి అనేక శ్రేణుల్లో ఈ విద్యాసంస్థలు పని చేస్తున్నాయి. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా విద్య, వసతి, భోజనం, యూనిఫాం వంటి సదుపాయాలు లభిస్తున్నా, వ్యక్తిగత పరిశుభ్రతకు అవసరమైన మౌలిక సదుపాయాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత కోసం ప్రభుత్వం నెలకు ఒక్కో విద్యార్థికి 100 చొప్పున కాస్మెటిక్ ఛార్జీ కేటాయించేది. ఈ మొత్తం ద్వారా టూత్ పేస్ట్, బ్రష్, సబ్బు, నూనె,షాంపూ వంటి నిత్యావసరాలను కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ గత ఐదేళ్లుగా ఈ నిధులు విడుదల కాకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యావసర వస్తువుల కొరత వల్ల విద్యార్థులు పరిశుభ్రతను పాటించలేకపోతున్నారు. ఇది శారీరక ఆరోగ్యంపైనే కాకుండా, మానసిక స్థితిపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోంది. చిన్న వయస్సులో ఉన్న పిల్లలు పరిశుభ్రమైన వాతావరణంలో జీవించాలి. వారు ఆరోగ్యంగా ఉండాలంటే, వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి. కానీ ఈ సామాన్ల కొరత వల్ల విద్యార్థులు చర్మ వ్యాధులు, దంత సమస్యలు, జుట్టు తడిపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇంకా ఎక్కువగా బాధ్యత కలిగినది. ఈ పరిస్థితి వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడం. ఇతర విద్యార్థులతో కలిసిమెలిసి ఉండాల్సిన సమయంలో, తాము పరిశుభ్రంగా లేకపోవడం వల్ల అనేక మంది విద్యార్థులు వెనుకబడిపోతున్నారు. ఇది వారి వ్యక్తిత్వ వికాసాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తోంది. ఈ నిధులు బడ్జెట్‌లో కేటాయించినప్పటికీ, అవి విద్యార్థుల వరకూ చేరడం లేదు. మధ్యస్థాయిలో ఉన్న అధికారుల నిర్లక్ష్యం, సరైన పర్యవేక్షణలేకపోవడం వల్ల ఈ నిధులు నిలిచిపోతున్నాయి. ప్రభుత్వం ప్రకటనలు చేస్తూ ఉండడం ఒక వైపు అయితే, వాటి అమలు స్థాయిలో పూర్తిగా విఫలమవుతోంది. పాఠశాల యాజమాన్యాలు కూడా సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల విద్యార్థులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది అధికారుల కృషి ఉన్నా, వ్యవస్థ మొత్తం పటిష్టంగా పనిచేయకపోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇటీవల ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరం నుంచి కాస్మెటిక్ కిట్లు అనే కొత్త కార్యక్రమాన్ని ప్రకటించింది. ఇందులో బ్రష్, టూత్‌పేస్ట్, షాంపూ, ఆయిల్, సబ్బు, బాడీ లోషన్, క్రీమ్ వంటి 12 నిత్యావసర వస్తువులను విద్యార్థులకు ఉచితంగా అందించనున్నట్లు తెలిపింది. మొదటి విడతగా 4800 మందికి ఈ కిట్లు పంపిణీ చేయనున్నట్లు సమాచారం. కానీ రాష్ట్రంలోని గురుకుల పాఠశా



లల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య దాదాపు 1.5 లక్షల మంది. అలాంటి పరిస్థితిలో ఇది నామమాత్రపు పరిష్కారంగా మాత్రమే మిగిలిపోతోంది. ఈ కిట్ల పంపిణీలో సమగ్రత లేదు. అన్ని పాఠశాలలకు, ప్రతి విద్యార్థికి సమానంగా అందించాలన్న నిబద్ధత స్పష్టంగా కనిపించడం లేదు.పైగా, ఇవి తాత్కాలిక చర్యలుగా కాకుండా శాశ్వత పథకంగా కొనసాగించాలన్న దిశగా ప్రభుత్వంలో స్పష్టత లేదు. కేవలం కొందరి వరకు పరిమితమైన కార్యక్రమం మూలంగా విద్యార్థులలో అసమానతలు కలుగుతాయి. సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించాలంటే, ప్రతి విద్యార్థికి నెలవారీగా నిధులు నేరుగా అందేలా చేయాల్సి న అవసరం ఉంది. ప్రతి విద్యార్థికి నెలకు100 చొప్పున నిధులు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ ద్వారా నేరుగా జమయ్యే విధంగా వ్యవస్థను రూపొందించవచ్చు. లేదా ప్రతి పాఠశాల స్థాయిలో నిత్యవసర వస్తువుల కొనుగోలుకు ప్రత్యేకంగా నిధులను కేటాయించి, ఆ పంపిణీకి పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి. విద్యార్థుల పేరు మీద ఆయా పాఠశాలలు నమోదై ఉండే విధంగా సమాచార వ్యవస్థను నిర్మించవచ్చు. ఒక చిన్న చర్య అయినా, విద్యార్థుల జీవితాల్లో ఇది చాలా పెద్ద మార్పును తీసుకురాగలదు. పరిశుభ్రత కేవలం ఆరోగ్యానికి సంబంధించిన అంశం కాదు. అది ఒక వ్యక్తి గౌరవానికి, ఆత్మవిశ్వాసానికి, అభివృద్ధికి సంబంధించిన అంశం. ఒక బాలబాలిక పరిశుభ్రంగా ఉండే అవకాశం కలిగినప్పుడు, అతని మనోవృత్తిలో కూడా మార్పు వస్తుంది. పరిశుభ్రమైన జీవనశైలి అతని ఆలోచనలను, వ్యవహార శైలిని, నైతిక విలువలను తీర్చిదిద్దుతుంది. అలాంటి పరిస్థితిని కల్పించాల్సి న బాధ్యత ప్రభుత్వానిదే.ఈ బాధ్యతను నిర్లక్ష్యం చేయడం వల్ల విద్యార్థులు మానసికంగా హీనభావనకు లోనవుతున్నారు. ప్రభుత్వ నిధులు ఉన్నా అవి విద్యార్థుల వరకూ చేరకపోవడం అనేది చాలా దురదృష్టకరం. ప్రభుత్వంవిద్యా హక్కు గురించి పదేపదే చెప్పడం అందరికీ తెలిసిందే. అయితే ఆ హక్కులో భాగంగా పరిశుభ్రత కూడా ఒక భాగంగా పరిగణించాలి. చదువు నేర్చుకునే వాతావరణం పరిశుభ్రంగా ఉండకపోతే, విద్యార్థి ఏ విధంగా అధ్యయనం పై దృష్టి పెట్టగలడు? అలాంటి వాతావరణాన్ని కల్పించడానికి అవసరమైన ప్రాథమిక విషయాలను కూడా పట్టించుకోకపోతే, విద్యా వ్యవస్థపై నమ్మకం ఎలా కలుగుతుంది? తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్పించడ మంటే, వారికి ఉత్తమమైన భవిష్యత్తు కల్పించాలనేఆకాంక్ష. కానీ వారు కనీస పరిశుభ్రత కోసం కూడా ప్రభుత్వం కళ్లు చూసి కూర్చోవాల్సి న పరిస్థితి చాలా బాధాకరం. ఈ చిన్న మొత్తాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంవల్ల లక్షలాది విద్యార్థుల ఆరోగ్యం, గౌరవం, అభివృద్ధి సంకటంలో పడుతోంది. ఇది కేవలం ఆర్థికంకాదు, ఇది మానవతా అంశం.ప్రభుత్వం ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలి. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సకాలంలో విడుదలయ్యేలా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటుచేయాలి. విద్యార్థులకు అవసరమైన నిత్యవసరాలు ప్రతి నెలా సమయానికి అందేలా చూడాలి. ఈ చర్యలు చిన్నవిగా కనిపించవచ్చు, కానీ విద్యార్థుల జీవితాల్లో ఇది అద్భుతమైన మార్పుని తీసుకురాగలవు. ఇది విద్యార్థుల స్వస్థతకే కాకుండా,ఒక సమాజంగా మన బాధ్యతను చూపించే అవకాశం కూడా. ఒక్క చిన్న మార్పుతో వేల మందికి ఆశను పంచవచ్చు. చిన్ననిధితో పెద్ద మార్పు సాధ్యమవుతుంది. విద్యార్థులు పరిశుభ్రమైన జీవితాన్ని గడపడం వాళ్ల హక్కు. ఆ హక్కును కాపాడాలన్న నిబద్ధత ప్రభుత్వంలో ఉండాలి.వారు ఆశగా ఎదురుచూస్తున్నది కేవలం టూత్‌పేస్ట్,బ్రష్‌లు మాత్రమేకాదు వారి గౌర వంకోసం. అదివారికి తిరిగి ఇవ్వాల్సి న బాధ్యత ప్రభుత్వానిదే. ●

# జనాభా తగ్గుదలతో కార్మిక శక్తి బలహీనం

తరిగోపుల నారాయణస్వామి

భారతదేశం విస్తారమైన దేశం. అనేక శతాబ్దాలుగా జనాభా పెరుగుదలతో పాటు ఆర్థిక,సామాజిక, సాంస్కృతిక మార్పులను అనుభవించింది. అయితే నేటి తరుణంలో దేశంలోని కొన్నిరాష్ట్రాలు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు, జనాభా వృద్ధిలో పడిపోయిన ధోరణిని మనం గమనిస్తున్నాం. ఒకవైపు జనాభా పెరుగుదల వలన సవాళ్లు ఎదురవుతుంటే, మరోవైపు జనాభా తగ్గుదల వలన కూడా పలు సమస్యలు తలెత్తుతున్నాయి. సమాజంలో జరిగే ఈ మార్పులు పాలనాధికారుల వైఖరిని, ప్రభుత్వ విధానాల లోపాలను, జీవన ప్రమాణాల ఖరీదును ప్రతిబింబిస్తున్నాయి. దక్షిణ భారతదేశంలోని రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, తెలంగాణ, కర్ణాటక విద్యాస్థాయి పెరుగుదల, పట్టణీకరణ,మహిళల ఉపాధి అవకాశాలు, కుటుంబ నియంత్రణపై అవగాహన, వైద్యరంగంలో పురోగతివంటి కారణాల వలన జనన రేటు గణనీయంగా తగ్గింది. కుటుంబం చిన్నదిగా ఉండాలి అనే భావన, జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలనే తపనతో కలిపి, పెద్ద కుటుంబాలను ఏర్పాటు చేసేందుకు చాలా మంది వెనకడుగు వేస్తున్నారు.అంతే కాకుండా ఆధునిక జీవన శైలి, ఆర్థిక అస్థిరత, భవిష్యత్ భయాలు కూడా దంపతులను తక్కువ పిల్లలకే పరిమితం చేస్తున్నాయి. ఇదే సమయంలో ప్రభుత్వ వైఫల్యాలు కూడా ఈ పరిస్థితిని మరింత పెంచుతున్నాయి. ఒకవైపు యువతకు స్థిరమైన ఉద్యోగ అవకాశాలు లేకపోవడం, మరొకవైపు ఉన్న అవకాశాలు కూడా కాంట్రాక్టు విధానంలో మిగిలిపోవడం వలన కుటుంబ ఆర్థిక భద్రతపై భయం నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం నష్టాల్లో ఉండడం, పట్టణాల్లో జీవన వ్యయం అధికం కావడం, నివాసం, వైద్యం, విద్య వంటి అవసరాలు ఖరీదైనవిగా మారడం వలన సాధారణ కుటుంబం ఒకరు లేదా ఇద్దరు పిల్లలకు మించిన బాధ్యత తీసుకోవడం కష్టమవుతోంది. ఈ సమస్యలకు పరిష్కారం చూపడంలో పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శించడంస్పష్టమవుతోంది. ప్రభుత్వం వివిధ స్థాయిలలో జనాభా పెంపు కోసం కొన్ని ప్రోత్సాహకాలు ప్రకటించినా అవిసరైన స్థాయిలో అమలవడం లేదు. ఉదాహరణకు, రెండో సంతానాన్ని కలిగించే కుటుంబాలకు ఆర్థిక ప్రోత్సాహకాలు ఇవ్వడం, మహిళలకు ప్రసూతి సదుపాయాలు కల్పించడం, చిన్నారుల పోషణకు నిధులు అందించడం వంటి కార్యక్రమాలు పరిమిత స్థాయిలోనే జరుగుతున్నాయి. వీటిలో అనేకం మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో లేవు. పైగా ప్రస్తుత పాలకులు దీన్ని ఒక ప్రాధాన్యత విషయంగా పరిగణించడం లేదని స్పష్టమవుతోంది. జనాభా పెరుగుదల తగ్గడంఒకవైపు కుటుంబాలకు సౌకర్యాన్ని కలిగించినా, దేశ స్థాయిలోచూస్తే ఇది భవిష్యత్తులో కార్మిక శక్తి కొరతను తెచ్చేప్రమాదంఉంది. వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా, పని చేయగల వయసు గల జనాభా తగ్గిపోతే ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని పాలకులు ముందస్తు చర్యలు తీసుకోవాలి. విద్యావంతులైన యువతకు స్థిరమైన ఉద్యోగాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించడం,మహిళలకు ఉపాధి సౌకర్యాలు కల్పించడం వంటి విషయాలలో ప్రభుత్వం నిజాయితీగా కృషి చేయాలి. జీవన ప్రమాణాలు రోజురోజుకీ ఖరీదు అవుతున్న తరుణంలో ప్రజలు మరింత భద్రత కోసం చిన్న కుటుంబాలను ఎంచుకోవడంసహజమే. అయినప్పటికీ పాలకులు ఈ పరిస్థితిని వదిలిపెట్టకుండా, ప్రజల జీవనవ్యయాలను తగ్గించేవిధానాలు,సామాజిక భద్రతా పథకాలు,ఉద్యోగ సృష్టి కార్యక్రమాలను సక్రమంగా అమలు చేస్తే జనాభా వృద్ధి, దేశ అభివృద్ధి రెండూ సమన్వయంకావచ్చు. అందుకే పాలకులు ప్రజల అసలు సమస్యలను అర్థంచేసుకొని ఆచరణాత్మక నిర్ణయాలు తీసుకోవడం అత్యవసరంగా మారింది. దేశంలోని కొన్ని ప్రముఖ రాష్ట్రాలలో జనాభా వృద్ధిశాతం తగ్గుదల గణనీయంగాఉంది. విద్యావ్యవస్థ, మహిళా సాధికారత, కుటుంబ నియంత్రణ పద్ధతులు ప్రజా ఆరోగ్యంపై పెట్టుబడులు పెట్టడం ద్వారా ఈస్థాయిలో జనాభావృద్ధిని నియంత్రించగలిగాయి. అయితే ఈపరిణామం భవిష్యత్తులో కార్మిక శక్తి కొరత, వృద్ధాప్య భారం పెరగడం, అభివృద్ధి వ్యయాలు అధికమవడం వంటి సమస్యలను తెచ్చే అవకాశముంది. అందువల్ల ప్రభుత్వం దీనిని ఒకవిజయంగా భావించకుండా సమన్వయ దృక్పథంతో చూడాలి. ఈ సమస్యను ఎదుర్కోవడానికి పాలకులు కేవలం గణాంకాలను పరిశీలించడం సరిపోదు.జీవన వ్యయాన్ని తగ్గించేవిధానాలు, ఉద్యోగ అవకాశాలను విస్తరించే నిర్ణయాలు,చిన్నారుల సంరక్షణ, మహిళలకు సౌకర్యవంతమైన ఉపాధి విధానాలు, గ్రామీణ అభివృద్ధికి ప్రత్యేక కృషి వంటి చర్యలు అత్యవసరం. ●

# భారత ప్రజాస్వామ్యమా! నీ దారెటు?

డా. ఎ. భాగ్యరాజ్

డెబ్బైతొమ్మిదోవ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకున్న భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం అని గర్వంగా చెప్పుకుంటాం.1947లో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ప్రజల ఓట్లతో ప్రభుత్వాలను ఎంచుకుంటూ వస్తున్నాం. నెహ్రూ సారథ్యంలో భారత ప్రజాస్వామ్యం బలంగా పునాదులు వేసుకోగలిగింది. అయితే, ప్రజాస్వామ్యం నేడు ఏ దిశలో నడుస్తోంది? అన్న ప్రశ్న ప్రతి ఒక్కరినీ కలవరపెడుతోంది. ప్రతి ఐదేళ్లకోసారి ఎన్నికలు వస్తున్నాయి. ప్రజలు ఓటు వేస్తున్నారు. కానీ ఆ ఓటు విలువను రాజకీయ పార్టీలు మతం, డబ్బు, మద్యం, కులం ఆధారంగా కొంటున్న వాస్తవం బాధాకరం. ప్రజాస్వామ్య పండుగ వాస్తవానికి మార్కెట్లో కొనుగోలు చేసే వస్తువుగా మారిపోయింది. ప్రజాస్వామ్యం అంటే ప్రజలచే, ప్రజల కోసం, ప్రజల పాలన. ప్రతి ఒక్క పౌరుడు తన ఓటుతో నాయకత్వాన్ని ఎంచుకోవడం, తమ సమస్యలను ప్రతినిధుల ద్వారా వ్యక్తం చేయడం, న్యాయం,సమానత్వం పొందడం దీని అసలు ఆత్మ. ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల పాలన అనే అబ్రహాం లింకన్ మాటలు మనకు వర్తించాలి. కానీ నేడు ఒక ప్రశ్న ప్రతి పౌరుడి మనసులో మెదిలేది ఇది ప్రజా ప్రభుత్వాలా లేక కార్పొరేట్ ప్రభుత్వాలా అని. మన ప్రజాస్వామ్యం ఎటు దారితీస్తోంది?మొన్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై లేవనెత్తిన ప్రశ్నలకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తమకు ఏ పార్టీ అయినా ఒకటే అని, ఓట్ల చోరీ వంటి పదాలు ఉపయోగించడం రాజ్యాంగాన్ని అవమానపరచడమే అని, కోటిమంది అధికారులు పది లక్షల మంది బూత్ స్థాయి అధికారులు,ఇరవైనాలుగు లక్షలమంది పోలింగ్ ఏజెంట్లు ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటారని, ఇంత మందిలో ఓట్లచోరీ సాధ్యమేనా అని, అఫిడవిట్ సమర్పించాలని ఎదురు ప్రశ్నలు అడుగుతున్నారు. ఎన్నికల కమిషన్, 2024 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ కాంగ్రెస్ అధికారంలోకివస్తే రామమందిరాన్ని బుల్డోజర్తో కొట్టేస్తారు అని, మహిళల పుస్తెలతో రాజకీయం చేస్తారని చెప్పడం ఎన్నికల అధికారులకు వినిపించలేదేమో. ఇంకా మతపరమైన ప్రచారాలు జరిగాయి. అప్పుడు ఎన్నికల కమిషన్‌కు చెవులు, కళ్ళు, నోరు పనిచేయలేదేమో. విపక్షాలకు మాత్రమే వారి అధికారాలు పనిచేస్తాయేమో ఇలా ఎన్నో ఉన్నాయి. 90లలో ఉల్లిపాయలు, ఇంధన ధరలు పెరిగితేనే ప్రభుత్వాలు అధికారాలను నిలబెట్టుకోలేక పోయేవి కాని ఇప్పుడు అన్ని వస్తువుల ధరలు, కార్పొరేట్లకు దోచిపెట్టడం, అవినీతి ఇలా అన్నివున్నా కూడా ఎలా విజయం సాధిస్తారో ఎన్నికల కమిషన్ వివరించాలి. ఎన్నికలు జరిగిన తరువాత స్పష్టంగా చెప్పవలసిన ఓట్ల శాతాన్ని చెప్పకుండా, ఒకరోజు తరువాత నమ్మశక్యంకాని పెరుగుదల విలువను చెబుతారు. ప్రజాస్వామ్యం నిలబడే నాలుగు స్థంభాలైన శాసనసభ,న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక విభాగం,



మీడియా. శాసనసభలో చర్చలు తగ్గిపోతూ ఒకపక్ష నిర్ణయాలు పెరుగుతున్నాయి. న్యాయవ్యవస్థపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగుతున్నాయి. మీడియా పెద్దగా పబ్లిక్ వాయిస్ కాకుండా పవర్ వాయిస్ అవుతోంది. 2024లోక్‌సభ ఎన్నికలలో ఓటింగ్ శాతం 67మాత్రమే. అంటే మూడవ వంతు ప్రజలు ఇంకా ప్రజాస్వామ్యంలో చురుకుగా పాల్గొనలేదు. 2023 ప్రజాస్వామ్య సూచిలో భారత్ లోపభూయిష్టమైన ప్రజాస్వామ్య జాబితాలో 41వ స్థానంలో ఉంది. అవినీతి, అసమానత, సామాజిక విభజన ప్రజాస్వామ్య బలాన్ని తగ్గిస్తున్నాయి. ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ నివేదిక ప్రకారం అవినీతి సూచికలో భారత్ ఇంకా 85వ స్థానంలో ఉంది. విపక్షాలు లేవనేత్తుతున్న ప్రశ్నలకు సమాధానం, వివరణ కాకుండా విపక్షాలపై కేసులు పెట్టి బెదిరించడం, భావ ప్రకటనా స్వేచ్ఛపై ఆంక్షలు, ప్రజాస్వామ్య బద్ధంగా నిరసనలను అణచివేయడం ఇవన్నీ ప్రజాస్వామ్య ఆత్మను, వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితిలో ఎన్నికల రాజకీయాలు డబ్బు, మద్యం, జాతిమత ప్రలోభాలతో ఓట్లు కొనే సంస్కృతి పెరుగుతోంది. పార్లమెంట్, న్యాయవ్యవస్థ, మీడియా వంటి ప్రజాస్వామ్య స్తంభాలు రాజకీయ ఒత్తిడికి లోనవుతున్నాయి. కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రాధాన్యం పెరిగి, సామాన్య ప్రజల సమస్యలు వెనకబడుతున్నాయి. భావ ప్రకటనా స్వేచ్ఛపై నిర్బంధాలు, విపక్షాలపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. ప్రజాస్వామ్యం అంటేప్రజల హక్కులు, అవకాశాలు, సమానత్వం, స్వేచ్ఛను కాపాడటం. కాబట్టి మన దేశ భవిష్యత్తు ఒకే ప్రశ్నపై ఆధారపడి ఉంది. ప్రజాస్వామ్యం మన కోసం ఉందా, లేక కేవలం కాగితాల పైనే మిగిలిపోయిందా? ఇక మీడియా గురించి ఎంత తక్కువగా మాట్లాడితే మంచిది. అవినీతి అనేది కేవలం దొంగతనం కాదు అది ప్రజాస్వామ్యం హృదయాన్ని(వ్యవస్థ) బలహీనపరిచే వ్యవస్థ. జవాబుదారీతనం పారదర్శకత కలిగిన సమ్మిళితమైన సంస్థలు ఏర్పడితే, మన దేశం ప్రజాస్వామ్య సామర్థ్యాన్ని నిజంగా సాకారం చేసుకోగలుగుతుంది. ప్రజాస్వామ్యం బలపడాలంటే ప్రజలు మేలుకోవాలి,చైతన్యం పెరగాలి.ప్రతి ఓటరు తన హక్కులను,బాధ్యతలను గుర్తించాలి. ఓటు వేసే సమయంలో ప్రలోభాలకు లోనుకాకుండా సరైన అభ్యర్థులను ఎంచుకోవాలి.స్వతంత్ర సంస్థలైన ఎన్ని కల సంఘం, న్యాయవ్యవస్థ, మీడియా నిజమైన స్వతంత్రతను కాపాడుకోవాలి. ప్రజల డబ్బుతో నడిచే ప్రభుత్వం ప్రతి నిర్ణయానికి బదులిచ్చేలా ఉండాలి. కుల,మత, లింగ వివక్ష లేకుండా అందరికీ సమాన అవకాశాలుకలగాలి. ప్రజాస్వామ్యంలో మనం ఓటువేసినవారికే వెళ్లిందని నమ్మకమేంటి? ఒకవేళ ఈవీఎం వున్నా వాటి ద్వారా వచ్చిన వివి ప్యాట్ మీద ఓటరు సంతకమో లేదా వేలిముద్రో ఉంటే అప్పుడు ఓట్ల దొంగతనం ఉండదు కదా. భారత ప్రజాస్వామ్యం చరిత్రలో ఎన్నో పరీక్షలను ఎదుర్కొని నిలబడింది. కానీ ఇప్పుడు అది చాలా పరిస్థితులను ఎదుర్కొంటోంది. ప్రజాస్వామ్యం నిజంగా ప్రజలకోసం ఉందా?లేక కేవలం శాసన పుస్తకాల్లోనో, అధికారుల ప్రసంగాల్లోనో మాత్రమే మిగిలిపోయిందా?ఈప్రశ్నకు మనమే జవాబు ఇవ్వాలి.మనచైతన్యం, మన ఓటు, మన గొంతుతో. భారత ప్రజా స్వామ్యం గొప్ప చరిత్ర కలిగిన వ్యవస్థ. కానీ అది కేవలం ఎన్నికలతోనే పరిమితం కాకూడదు. ప్రజాస్వామ్యంలో వ్యవస్థలు సరిగా పని చేయనప్పుడు ప్రజా ఉద్యమమే సరైన మార్గం. ●

# రష్యాపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్.. అణువిద్యుత్ ప్లాంట్‌పై డ్రోన్ దాడి

**మాస్కో, ఆగస్టు 24:** రష్యా పశ్చిమ ప్రాంతంలోని కుర్స్క్‌లోని అణు విద్యుత్ ప్లాంట్‌పై ఉక్రెయిన్ డ్రోన్లతో దాడులు చేసిందని మాస్కో ఆదివారం ఆరోపించింది. ఉక్రెయిన్ ఆదివారం 34వ స్వాతంత్ర్య వేడుకలు జరుపుకోవడం విశేషం. రాత్రి సమయంలో అనేక ఇంధన, విద్యుత్ ప్లాంట్లపై దాడులు చేసినట్లుగా రష్యన్ అధికారులు పేర్కొన్నారు. కుర్స్క్‌లోని ప్లాంట్‌లో మంటలు చెలరేగాయని.. సకాలంలోనే మంటలను అదుపులోకి తీసుకువచ్చినట్లు పేర్కొంది. ఈ దాడుల్లో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొంది. డ్రోన్ దాడిలో ప్లాంట్ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిన్నదని.. రేడియేషన్ లెవల్స్ సాధారణంగానే ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ సంఘటన గురించి తమకు సమాచారం అందిందని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ తెలిపింది. అణు స్థావరాల భద్రతను అన్ని విధాలుగా నిర్ధారించాలని ఏజెన్సీ చీఫ్ రాఫెల్ మరియానో గ్రాస్సీ పేర్కొన్నారు. ఈ సంఘటనపై ఉక్రెయిన్ స్పందించలేదు. ఆదివారం రాత్రికి 95 ఉక్రెయిన్ డ్రోన్‌లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. రష్యా కూడా ఉక్రెయిన్‌పై 72 డ్రోన్‌లు, ఒక క్రూయిజ్ క్షిపణిని ప్రయోగించింది. వాటిలో 48 ఉక్రెయిన్ వైమానిక దళం నాశనం చేసింది. రష్యాలోని లెనిన్‌గ్రాడ్ ప్రాంతంలోని ఉస్ట్‌లుగా ఓడరేవులో మంటలు చెలరేగాయి.

ఉక్రెయిన్ డ్రోన్ శకలాలు ఇక్కడి ఇంధన ఎగుమతి కేంద్రంపై పడడంతో మంటలు చెలరేగాయి. కీవ్‌లోని ఇండిపెండెన్స్ స్క్వేర్ నుంచి విడియో సందేశంలో అధ్యక్షుడు జెలెన్‌స్కీ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. భద్రత, శాంతియుత జీవితం సాధ్యమయ్యే భవిష్యత్తును ఉక్రెయిన్ నిర్మిస్తోందని పేర్కొన్నారు.

మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అమెరికా రష్యా అలాస్కా సమావేశాన్ని ప్రస్తావిస్తూ.. ప్రపంచం ఉక్రెయిన్‌ను గౌరవిస్తుందని, దానిని సమానంగా చూస్తుందని ఆయన అన్నారు. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ సైతం కీవ్‌కు చేరుకుని జెలెన్‌స్కీని కలిశారు. ఉక్రెయిన్‌కు నార్వే ఏడు బిలియన్ క్రోనర్ల (సుమారు 695 మిలియన్ డాలర్లు) కొత్త సైనిక సహాయాన్ని ప్రకటించింది. తూర్పు భాగంలోని డొనెట్స్క్ ప్రాంతంలోని రెండు గ్రామాలను తమ సైన్యం స్వాధీనం చేసుకుందని రష్యా పేర్కొంది.



# అంతరిక్షంలో సుదూర తీరాలను శోధిద్దాం

## శాస్త్రవేత్తలకు ప్రధాని మోడీ పిలుపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** మానవాళి భవిష్యత్తును మరింత ప్రకాశవంతం చేసేందుకు అంతరిక్షంలో సుదూర తీరాలను శోధించేందుకు సిద్ధం కావాలని శాస్త్రవేత్తలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. బవిష్యత్తులో చేపట్టనున్న అంతరిక్ష మిషన్లకోసం పెద్ద ఎత్తున వ్యోమగాములను సిద్ధం చేస్తున్నామని, యువత ఇందులో భాగం కావాలని సూచించారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగాఉన్న అంతరిక్ష శాస్త్రవేత్తలు, విద్యార్థులు, విధానకర్తనుద్దేశించి ప్రసంగించారు. మనం చంద్రుడు, అంగారకుడిని చేరుకున్నాం. ఇప్పుడు అనేక రహస్యాలు దాగున్న రోదసిలోని సుదూర తీరాలపై పరిశోధనలు చేయాల్సి ఉంది. దానివల్ల భవిష్యత్తు తరాలకు మరిన్ని వెలుగు ప్రసాదించే అవకాశం దక్కుతుంది. అంతరిక్ష రంగంలో ఒకదాని తర్వాత మరో విజయం మనకు, మన శాస్త్రవేత్తలకు ఆనవాయితీగా మారిపోయింది. ఏ సరిహద్దు చివరిది కాదని మనకు విశ్వం చెబుతోంది అని మోడీ పేర్కొన్నారు. 2040లో భారత్ సొంతంగా చేపట్టే అంతరిక్ష యాత్రలో భారత వ్యోమగామి చంద్రుడిపై అడుగుపెట్టి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వికసిత్ భారత్ ఖ్యాతిని చాటుతారని పునరుద్ఘాటించారు. భవిష్యత్తులో ఏడాదికి 50 రాకెట్లను ప్రయోగించే స్థితికి మనం చేరుకోగలమా అని అంతరిక్ష శాస్త్రవేత్తలను ఆయన ప్రశ్నించారు. శాస్త్రవేత్తలు చేస్తున్న కృషితో త్వరలో గగన్‌యాన్ మిషన్‌ను ప్రారంభించనున్నామని, మరి కొన్నేళ్లలో సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుంటామని పేర్కొన్నారు. అంతరిక్ష రంగ అభివృద్ధికి ప్రైవేటు రంగం మరింతగా ముందుకు రావాలని సూచించారు. అంతరిక్ష విజన్‌లో భాగంగా తదుపరి తరం సంస్కరణలను తెచ్చేందుకు ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు.

# నోయిడాలో భార్యను చంపిన కిరాతకుడిపై పోలీసు కాల్పులు

**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** యుపిలోని నోయిడాలో కట్టుకున్న భార్యను చిత్రహింసలకు గురిచేసి పెట్రోల్ పోసి కాల్చి చంపిన కిరాతకుడు ఆదివారం ఉదయం పోలీసులపై దాడిచేసి తప్పించుకునే క్రమంలో జరిగిన కాల్పుల్లో గాయపడ్డాడు. కాల్పుల్లో గాయపడ్డ నిందితుడిని పోలీసులు వెంటనే ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. వివరాలు ఇలావున్నాయి. నోయిడాలో నిక్కి భాటి అనే మహిళను ఆమె భర్త విపిన్ శ నివారం నాడు చిత్రహింసలకు గురిచేసి పెట్రోల్ పోసి కాల్చడం తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఆమె ఆసుపత్రిలో మరణించింది. తన తల్లిని తండ్రి హింసించి చంపినట్లు హతురాలి కుమారుడు పోలీసులకు వాంగ్మూలం ఇవ్వడంతో ఈ కేసు సంచలనంగా మారింది. కాగా ఈ ఘటన పై వెంటనే స్పందించిన నోయిడా పోలీసులు విపిన్ సహా అతని కుటుంబ సభ్యులను అరెస్టు చేశారు. విచారణలో భాగంగా విపిన్‌ను ఆదివారం ఉదయం అతని ఇంటికి తీసుకువెళ్లి భార్యను ఎలా చంపాడనే దానిపై సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఈ సమయంలో విపిన్ పోలీసులపై దాడికి దిగి వారి వద్ద వున్న తుపాకి లాక్కుని కాల్పులకు దిగాడు. అయితే దీనిపై పోలీసులు వెంటనే స్పందించి ఎదురు కాల్పులకు దిగి విపిన్ కాలిపై కాల్చారు. ఈ కాల్పుల్లో విపిన్ ఎడమ కాలికి బుల్లెట్ గాయం అయ్యింది.

విపిన్ జరిపిన కాల్పుల్లో పోలీసులకు ఎలాంటి గాయాలు తగలలేదు.

# భారత్! ట్రంప్‌ను సీరియస్‌గా తీసుకో!

## అమెరికా రిపబ్లికన్ నిక్కీ హేలీ



**వాషింగ్టన్, ఆగస్టు 24:** రష్యా నుంచి చమురు కొనుగోళ్ల విషయంలో ట్రంప్ లేవనెత్తిన అభ్యంతరాన్ని భారత్ సీరియస్‌గా తీసుకోవాలని అమెరికా రిపబ్లికన్ నిక్కీ హేలీ సూచించారు. భారత్‌కు మంచి మిత్రురాలిగా ఆమెకు పేరున్న విషయం తెలిసిందే. న్యూఢిల్లీ-వాషింగ్టన్ మధ్య తాజా విభేదాలను ఉద్దేశించి ఆమె ఎక్స్‌లో పోస్టు చేశారు. 'రష్యా నుంచి చమురు విషయంలో ట్రంప్ లేవనెత్తిన అభ్యంతరాలను భారత్ సీరియస్‌గా తీసుకోవాలి. దాని పరిష్కారం కోసం వీలైనంత త్వరగా శ్వేతసౌధంతో కలిసి పనిచేయాలి. దశాబ్దాలుగా రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య ఉన్న స్నేహం, విశ్వాసమే.. ప్రస్తుత ఒడుదొడుకులను దాటేందుకు బలమైన పునాదిగా ఉపయోగపడుతుంది. వాణిజ్యంలో, రష్యా చమురుపై అభిప్రాయభేదాలు వంటివి పరిష్కరించుకోవాడానికి బలమైన చర్చలు, సంప్రదింపులు అవసరం. చైనాను ఎదుర్కోవడానికి అమెరికాకు న్యూఢిల్లీలో మిత్రులు ఉండాలన్న అంశం చాలా ముఖ్యమైంది. దానిని ఏమాత్రం విస్మరించకూడదు' అని ఆమె పోస్టు చేశారు. ఆంక్షలు విధించి భారత్‌ను అమెరికా దూరం చేసుకోవడంపై నిక్కీ హేలీ గతంలోనూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చైనాను ఎదుర్కోవాలన్న వ్యూహాత్మక లక్ష్యాల సాధనకు ట్రంప్ నిర్ణయాలు విపత్కరంగా మారాయని ఇటీవల ఆమె పేర్కొన్నారు. ఇటీవల ఓ పత్రికకు రాసిన కాలమ్‌లో ఆమె స్పందిస్తూ 'ప్రపంచంలో ఆరోవంతు జనాభాకు కేంద్రం భారత్. అత్యంత యువ జనాభాతో చైనాను దాటేసింది. మరోవైపు డ్రాగన్ జనాభాలో వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగోంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్' అని పేర్కొన్నారు. మరోవైపు భారత్ వంటి మిత్రదేశాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూరం చేసుకోవడంపై మాజీ విదేశాంగ మంత్రి జాన్ కెర్రీ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. నిజమైన దౌత్య ప్రయత్నాలు జరగకుండా, అల్టిమేటంలు జారీ చేయడం సరికాదని అభిప్రాయడ్డారు. భారత్, అమెరికా మధ్య పోరు దురదృష్టకరమని అభివర్ణించారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోడీ మధ్య ఈ పోరాటం దురదృష్టకరం. సాధారణ వ్యాపార విధానంలో దౌత్య ప్రయత్నం లేకుండా గొప్ప దేశాలు ఎల్లప్పుడూ ప్రజలకు అల్టిమేటం ఇవ్వడం ద్వారా గొప్పతనాన్ని ప్రదర్శించవు. మాజీ అధ్యడు బరాక్ ఒబామా పాలనలో చర్చలు, పరస్పర సహకారం, గౌరవం ద్వారా జరిగాయి. కానీ, ఇప్పుడు కొంచెం ఎక్కువ ఆదేశాలు, ఒత్తిడితో జరుగుతున్నాయి' అని జాన్ కెర్రీ తెలిపారు. రష్యా నుంచి భారత్ దిగుమతి చేయడంపై అమెరికా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఉక్రెయిన్ యుద్ధానికి ఈ చమురు సొమ్ము ఉపయోగపడుతోందని.. భారత్ అవసరం వెతుక్కొని వ్యాపారం చేస్తోందని ట్రంప్ సలహాదారుడు పీటర్ నవారో తీవ్ర ఆరోపణలు చేశారు. ట్రంప్ 25 శాతం పెనాల్టీలను భారత్ దిగుమతులపై విధించారు. ట్రంప్ కార్యవర్గం కీలకం నాయకులు న్యూఢిల్లీపై తరుచూ నోటికొచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారు. మరోవైపు చమురు ధరలు పెరిగితే 150 కోట్ల మంది ప్రజలు ఇబ్బంది పడతారని భాతర్ వాదిస్తోంది.

# గగన్‌యాన్ మిషన్.. ఎయిర్ డ్రాప్ టెస్ట్ విజయవంతం



**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** భారత్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ అంతరిక్ష ప్రాజెక్టుఛ ఇస్రో మరో ముందడుగు వేసింది. క్రూ మాడ్యూల్‌కు సంబంధించి తొలి ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్టును విజయవంతంగా నిర్వహించింది. వాయుసేన, నౌకాదళం, డిఆర్డీఓ, కోస్ట్‌గార్డ్‌ల సంయుక్త సహకారంతో ఈ పరీక్షలు చేపట్టింది. ఈ ప్రయోగంలో భాగంగా మాడ్యూల్ నమూనాను హెలికాప్టర్ సాయంతో నింగిలోకి తీసుకెళ్లి కిందకి జారవిడిచారు. పారాచూట్ల సాయంతో ఆ మాడ్యూల్ వేగాన్ని తగ్గించుకుంటూ సముద్ర జలాల్లో సురక్షితంగా దిగింది. మానవసహిత అంతరిక్ష ప్రయోగాల సమయంలో వ్యోమగాములు భూమికి సురక్షితంగా తిరిగి వచ్చేందుకు దీన్ని ఉపయోగిస్తారు. మాడ్యూల్ భూవాతావరణంలోకి ప్రవేశించిన అనంతరం దాని వేగ నియంత్రణ, ల్యాండింగ్ విషయంలో పారాచూట్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. సంక్లిష్టమైన ఈ వ్యవస్థ పనితీరును పరీక్షించడమే లక్ష్యంగా ఈ ప్రయోగం చేపట్టినట్లు సమాచారం. భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో చేపట్టిన గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా ఇస్రో అనేక పరీక్షలు నిర్వహిస్తోంది. జులైలో సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్‌కు సంబంధించిరెండు హాట్ టెస్టులను విజయవంతంగా చేపట్టింది. 2027లో తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఇటీవల వెల్లడించారు.

# డికె శివకుమార్ బాటలో మరో ఎమ్మెల్యే.. ఆరెస్సెస్ గీతాలాపన!

**బెంగళూరు, ఆగస్టు 24:** కర్ణాటక అసెంబ్లీలో ఇటీవల డిప్యూటీ సిఎం డికె శివకుమార్‌ఆరెస్సెస్ గీతాన్ని ఆలపించి చర్చకు తెరలేపారు. తాజాగా ఆయన బాటలోనే మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్‌డి రంగనాథ్ ఆరెస్సెస్ గీతాలాపన చేశారు. అంతేకాదు ఆ గీతాన్ని ఆలపించడంలో తప్పేముందని వ్యాఖ్యానించారు. తుమకూరు జిల్లా కునిగల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రంగనాథ్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా ఆయన ఆరెస్సెస్ గీతం నమస్తే సదా వత్సలను ఆలపించారు. ఈ గీతం చాలా బాగుంది. డిప్యూటీ సిఎం డికె శివకుమార్ అసెంబ్లీలో ఆలపించిన తర్వాత నేనూ విన్నాను. దాని అర్థం కూడా తెలుసుకున్నాను. జన్మభూమికి వందనం చేయాలి అనే అర్థముంది. అందులో నాకేమి తప్పుగా అనిపించలేదు. కాంగ్రెస్ లౌకిక పార్టీ. మేం ఇతరుల నుంచి మంచిని స్వీకరిస్తాం. ఆ గీతాన్ని ఆలపించడంలో తప్పేముంది అన్నారు.

# దుబాయిలో ఆటోమేటెడ్ స్మార్ట్ పోలీస్‌స్టేషన్

## మానవ జోక్యం లేకుండానే పోలీసు సేవలు!

**అబుదాబి, ఆగస్టు 24:** ప్రజా సేవలకు ఆధునిక సాంకేతికతను జోడించే విషయంలో దుబాయ్ మరో ముందడుగు వేసింది. మానవ జోక్యం లేని పూర్తి ఆటోమేటిడ్ స్మార్ట్ పోలీస్ స్టేషన్‌ను డ్రాగన్ మార్ట్‌లో ప్రారంభించింది. దీంతో కృత్రిమ మేధ ఆధారిత పాలనలో దుబాయ్ ప్రపంచ నాయకత్వ స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. పౌరులు, పర్యాటకులు ఇప్పుడు 24 గంటలూ పూర్తిగా ఆటోమేటెడ్, మానవ జోక్యం లేని పోలీసు సేవలు 27 ప్రదేశాల్లో అందుబాటులోకి వచ్చాయి. మధ్య ఆసియాలో స్మార్ట్ పోలీస్ స్టేషన్లు తొలిసారి తీసుకొచ్చిన దుబాయ్.. విప్లవాత్మక ఆవిష్కరణకు తెరతీసింది. ఈ స్టేషన్లు పోలీసు సిబ్బంది లేకుండానే స్వీయ ఆధారిత సేవలు అందిస్తూ రోజుకు 24 గంటలు, వారం పొడవునా అందుబాటులో ఉంటుంది. సాంప్రదాయ పోలీస్ స్టేషన్లకు బదులుగా వేగవంతమైన, సురక్షితమైన, సంపూర్ణంగా డిజిటల్ ప్రత్యామ్నాయాన్ని అందిస్తాయి. ప్రతి స్మార్ట్ పోలీస్ స్టేషన్‌లో దుబాయ్ పౌరులకు ఎమిరైట్స్ ఐడీ, పర్యాటకులకు పాస్‌పోర్ట్‌తోనూ మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ పంపి గుర్తింపును ధ్రువీకరిస్తారు. స్కార్లు, ప్రింటర్ల వంటి సౌకర్యాలతో పత్రాలను పూర్తిచేసి, అవసరమైతే వీడియో ఇంటర్‌ఫేస్ ద్వారా విధుల్లో ఉన్న పోలీస్ అధికారిని కలవచ్చు, ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఎస్ఎంఎస్ ద్వారా రిఫరెన్స్ నెంబరు, రిసిప్ట్ వస్తుంది. తదుపరి చర్య కోసం ఫిర్యాదను తగిన పోలీసు విభాగాలకు పంపి, సులభంగా ట్రాక్ చేయడానికి వీలు కల్పిస్తుంది. అరబిక్, ఇంగ్లిష్, స్పానిష్, ఫ్రెంచ్, జర్మన్, రష్యన్, చైనా వంటి ఏడు భాషల్లో సేవలు అందుబాటులో ఉంటాయి. నాలుగు ప్రధాన విభాగాల్లో మొత్తం 45 డిజిటల్ సేవలు అందజేయనున్నాయి. 1. క్రిమినల్ సర్వీసులు చెక్ బౌన్సులు, కార్మిక సమస్యలు, అక్రమ రవాణా వంటి క్రిమినల్ వ్యవహారాలపై ఫిర్యాదు. నివాస భద్రత పర్యవేక్షణ కోసం రిక్వెస్ట్‌లు, అనుమానిత చర్యలపై సమాచారం వంటివి ఇందులో ఉంటాయి. 2. ట్రాఫిక్ సర్వీసులు రోడ్డు ప్రమాదాల నివేదిక, వాహనం రంగు మార్పు కోసం దరఖాస్తు, ట్రాఫిక్ స్టేటస్ సర్టిఫికెట్లు, ట్రాఫిక్ ఛలానాల చెల్లింపు. 3. సర్టిఫికెట్లు పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్లు, రాత్రివేళలో పనులు, రహదారి మూసివేతపై అనుమతులు తదితరాలు. 4. కమ్యూనిటీ సర్వీసులు: పర్యాటకుల లేదా ఈవెంట్ భద్రత సేవలకు అనుమతి కోసం దరఖాస్తు, 'లీడర్ ఎట్ యువర్ సర్వీస్' ద్వారా కమ్యూనిటీ ఫీడ్‌బ్యాక్ దుబాయ్ పోలీస్ శాఖలో ఉద్యోగావకాశాలు. గుండె సంబంధిత రోగులకు అత్యవసర సహాయం పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన వస్తువులపై ఫిర్యాదు లేదా దొరికిన వస్తువులు అప్పగించడం. వ్యూహాత్మక విస్తరణ, అంతర్జాతీయ గుర్తింపు.. 2017లో సిటీ వాక్ వద్ద మొట్టమొదటి స్మార్ట్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన దుబాయ్.. క్రమంగా వీటిని విస్తరించింది. ప్రస్తుతం 27 పోలీస్ స్టేషన్లను నగర, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్నాయి. 2018లో అరేబియన్ రాంచెస్‌లో వాక్‌ఇన్ మోడల్ స్మార్ట్ పోలీస్ స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. 2023 నాటికి వరల్డ్ ఐలాండ్స్‌లో ఫ్లోటింగ్ ఎస్పీఎస్ కోసం ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ మోడల్ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల దృష్టిని ఆకర్షించింది. ఈ ప్రాజెక్ట్ దుబాయ్ జాతీయ కృత్రిమ మేధ వ్యూహానికి నేరుగా మద్దతు ఇస్తోంది. ప్రభుత్వ వ్యవస్థలను భవిష్యత్తుకు సిద్ధం చేయడం, డిజిటల్ సంసిద్ధత, ప్రజాసేవల సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యం. దుబాయ్ పోలీస్ కమాండర్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ అబ్దుల్లా ఖలీఫా అల్ మర్రీ ఆధ్వర్యంలో ఈ కేంద్రాల విస్తరణ జరుగుతోంది. ప్రస్తుతం ఈ పోలీస్ సేవలు 89.6 శాతం డిజిటల్‌లో జరుగుతున్నాయి.



# ఆధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను విజయవంతంగా పరీక్షించిన డిఆర్‌డిఒ

**భువనేశ్వర్, ఆగస్టు 24:** అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ (ఐఎడిడబ్ల్యుఎస్) తొలి విమాన పరీక్షలను రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) విజయవంతంగా నిర్వహించింది. దేశీయంగా అభివృద్ధి చేసిన వాయు రక్షణ వ్యవస్థను శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఒడిశా తీరంలో పరీక్షించింది. వివిధ పొరలతో కూడిన వాయు రక్షణ వ్యవస్థ ఐసిడబ్ల్యుఎస్.. ఉపరితలం నుంచి గగనతలానికి క్షిపణులు, వాయు రక్షణ వ్యవస్థ క్షిపణులు, అధిక శక్తిగల లేజర్ ఆధారిత డైరెక్ట్ ఎనర్జీ వెపన్స్ వ్యవస్థను కలిగి ఉంది. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ డిఆర్‌డిఒ, సాయుధదళాలను ఎక్స్ వేదికగా అభినందించారు. ఐఎడబ్ల్యుఎస్‌ను ఈ నెల 23న 12:30 గంటలసమయంలో ఒడిశాతీరంనుంచి డిఆర్‌డిఒ విజయవంతంగా పరీక్షించిందని చెప్పారు.

# సంక్షిప్తంగా..

## శ్రీలంక మాజీ అధ్యక్షుడు విక్రమసింఘేకు రిమాండ్

**శ్రీలంక, ఆగస్టు 24:** ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి సంబంధించిన కేసులో శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘేను సిఐడి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. 2023 సెప్టెంబరులో లండన్‌లో జరిగిన తన సతీమణి స్నాతకోత్సవం కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆయన ప్రభుత్వ ఖర్చులతో ప్రయాణించారని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో కొలంబో క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆయనను ఈ నెల 22న అరెస్ట్ చేసి, కొలంబో ఫోర్ట్ మెజిస్ట్రేట్ కోర్టుముందు హాజరుపరిచింది. వాదనలువిన్న కోర్టు ఆయనకు బెయిల్ నిరాకరించి, రిమాండ్ నిమిత్తం మ్యాగజైన్ జైలుకు తరలించాలంటూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ముందు బెయిల్ ఇచ్చేందుకు అవసరమైన అంశాలను ఉంచడంలో న్యాయవాదులు విఫలమైనట్లు న్యాయస్థానం పేర్కొంది. అయితే, జైల్లో ఉన్న సమయంలో విక్రమసింఘేకు బిపి, షుగర్ స్థాయిలు పెరగడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో ఆయనకు వైద్య పరీక్షల అనంతరం కొలంబో నేషనల్ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఐసియులో చేర్చినట్లు అధికారులు తెలిపారు.

## బీహార్: ఓటర్ల జాబితాలో ఇద్దరు పాకిస్థానీలు



**పాట్నా, ఆగస్టు 24:** దేశ రాజకీయాల్లో ప్రస్తుతం బీహార్ ఎన్నికలు చర్చనీయాంశంగా మారాయి. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ ఆరోపిస్తుండగా అంతా సవ్యంగానే ఉందని ఎన్నికల సంఘం చెబుతూ వస్తోంది. అయితే తాజాగా బీహార్‌లో ఇద్దరు పాకిస్తానీ మహిళలకు ఇటీవల ఓటరు కార్డులు జారీ కావడంతో కేంద్ర హోంశాఖ చర్యలకు ఉపక్రమించింది. వారి పేర్లను వెంటనే తొలగించాలని యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. ఇమ్రానా ఖానమ్ అలియాస్ ఇమ్రానా ఖాటూన్, ఫిర్దోషియా ఖానమ్ అనే ఇద్దరు మహిళలకు ఇటీవల ఓటరు కార్డులు జారీ అయ్యాయి. దీంతో కేంద్రం హోంశాఖ విచారణ చేపట్టింది. ఫిర్దోషియా 1956లో మూడు నెలల వీసాపై, ఇమ్రానా మూడేళ్ల వీసాపై భారత్‌కు వచ్చి, భాగల్పూర్ జిల్లాలోని భికన్‌పూర్‌లో స్థిరపడ్డారు. వీరికి ఓటర్ కార్డులు ఉండటాన్ని గుర్తించిన కేంద్రం విచారణ జరపాలని, ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో విచారణ ప్రారంభించినట్లు కలెక్టర్ డాక్టర్ నావల్ కిశోర్ చౌదరి చెప్పారు. ఆ ఇద్దరు మహిళలకు నోటీసులు పంపనున్నట్లు వెల్లడించారు.

## ఢిల్లీలో రూ.25 కోట్ల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా గంజాయి స్మగ్లింగ్‌పై పోలీసు విభాగాలు ఉక్కుపాదం మోపుతున్నా స్మగ్లర్లు మాత్రం యధేచ్ఛ గా తమ వ్యాపారం కొనసాగిస్తూనే వున్నారు. భారత్‌కు చెందిన ఓ యువకుడు బ్యాంకాక్ నుంచి సింగపూర్ మీదుగా ఢిల్లీలోని ఇందిరా గాంధీ అం తర్జాతీయ విమానాశ్రయంలో ఈ నెల 21వ తేదీన రాత్రి సమయంలో దిగాడు. అతను విమానం దిగగానే మూడవ నంబర్ టర్మినల్ నుంచి బయ టకు వచ్చి గ్రీన్ ఛానల్ మార్గం ద్వారా బయటకు వెళ్లేందుకు యత్నించగా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. అతని లగేజ్ బ్యాగ్‌లో 25 నలుపు రం గు పాలిథిన్ కవర్లలో అనుమానాస్పద వస్తువులు కనిపించడంతో భద్రతా సిబ్బంది తనిఖీలు చేయగా ఇది విదేశీ గంజాయిగా నిర్ధారణ అయ్యింది. వీటిని జప్తు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా తన నేరాన్ని అంగీకరించాడు. బ్యాంకాక్ నుంచి తాను దీనిని ఖరీదు చేసి భారత్‌లో విక్రయించేందుకు తెచ్చినట్లు నిందితుడు చెప్పాడని ఢిల్లీ పోలీసులు వెల్లడించారు.

## కాంగ్రెస్, బిజెపి ఉచ్చులో పడకండి: ప్రశాంత్ కిశోర్

**పాట్నా, ఆగస్టు 24:** బీహార్ ప్రజలను కాంగ్రెస్, బిజెపి పార్టీలు తప్పుదోవ పట్టిస్తున్నాయని ఎన్నికల వ్యూహకర్త, జన్ సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలను వదిలేసి 'ఓట్ చోరీ'పైనే పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని అన్నారు. ఆర్జేడి పార్టీ సూచనల ప్రకారమే రాహుల్‌గాంధీ నడుచుకుంటున్నాడు తప్ప బీహారీల సమస్యలపై ఆయన దృష్టి పెట్టడంలేదని మండిపడ్డారు. ఎన్నికల వేళ రాహుల్ గాంధీని నరేంద్ర మోడీ, నరేంద్ర మోడీని రాహుల్ గాంధీ పరస్పరం విమర్శించుకుంటున్నారని చెప్పారు. ఆ పార్టీల ఉచ్చులో పడొద్దంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. బీహార్‌లో అసలైన సమస్యలు పేదరికం, నిరుద్యోగం, వలసలు, సరైన విద్యా సౌకర్యాలు లేకపోవడం.. వంటి వాటిని ప్రధాన పార్టీలు గాలికి వదిలేశాయని ప్రశాంత్ కిశోర్‌ఆరోపించారు. ప్రజలసమస్యలు పరిష్కరించేందుకు, ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా ప్రజలకోసం 'జన్‌సూరజ్ పార్టీ' ఆవిర్భవించిందని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు.

# ఉక్రెయిన్‌కు మరో 3350 అమెరికా క్షిపణులు

## ఆరువారాల్లో కీవ్‌కు చేరుకోనున్న ఆయుధాలు



**వాషింగ్టన్, ఆగస్టు 24:** ఉక్రెయిన్ గగనతల రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు మరో 3,350లకు పైగా ఎక్స్‌టెండెడ్ రేంజ్ అటాక్ మ్యూనిషన్ (ఇఆర్ఎఎం) క్షిపణులను ఆ దేశానికి అందించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఆమోదం తెలిపినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఆయుధ ప్యాకేజీకి యూరోపియన్ దేశాలు నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపాయి. దాదాపు ఆరు వారాల్లో ఈ క్షిపణులు కీవ్‌కు చేరుకుంటాయని సమాచారం. అయితే 240 నుంచి 450 కి.మీ. పరిధి కలిగిన ఇఆర్ఎం క్షిపణులను రష్యాపైకి ప్రయోగించాలంటే ఉక్రెయిన్ పెంటగాన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అమెరికా అధికారులు పేర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలను సరఫరా చేసే విషయాన్ని అమెరికా ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. మరోవైపు రష్యా భూభాగంలోని లక్ష్యాలను ఛేదించడానికి అమెరికా రూపొందించిన లాంగ్‌రేంజ్ ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్స్ (ఎటిఎసిఎంఎస్)ను వినియోగించకుండా పెంటగాన్ అడ్డుకుంటున్నట్లు పలు నివేదికలు సూచిస్తున్నాయి. మాస్కో చేపడుతున్న దాడులకు దీటుగా ఆయుధాలను ఉపయోగించకుండా కీవ్ సామర్థ్యాన్ని పరిమితం చేస్తోందని పేర్కొన్నాయి. యుద్ధం ముగింపునకు తాను ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఇరుదేశాల నేతలు ముందడుగు వేయకపోవడంతో ట్రంప్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీవ్‌కు సహాయంగా అగ్రరాజ్యం పలుమార్లు పెద్ద మొత్తంలో ఆయుధ సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఉక్రెయిన్ 32.2 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలు, అత్యాధునిక క్షిపణులు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ఇటీవల ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని అమెరికా చట్ట సభకు తెలియజేశామని తెలిపింది. ఇందులో 15 కోట్ల డాలర్లు అమెరికా ఇప్పటికే అమ్మిన ఆర్మర్డ్ వాహనాల నిర్వహణకు, 17.2 కోట్ల డాలర్లు ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణి వ్యవస్థల కొనుగోలుకు వినియోగిస్తారు. ఉక్రెయిన్ దారుణమై దాడులకు గురవుతున్న కారణంగా కీవ్‌కు మరిన్ని ఆయుధాలు పంపుతున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో మరోసారి క్షిపణులను అందజేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి.

# రాహుల్‌గాంధీకి ముద్దు పెట్టిన యువకుడు

## భద్రతాసిబ్బంది పట్టుకుని దేహశుద్ధి!

**పాట్నా, ఆగస్టు 24:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఓట్ చోర్ యాత్రలో కీలక ఘటన చోటు చేసుకుంది. బైక్ నడుపుతున్న రాహుల్ గాంధీకి ఒక యవకుడు ఆకస్మాత్తుగా వచ్చి ముద్దు పెట్టాడు. ఈ ఊహించని పరిణామంతో.. రాహుల్‌గాంధీతో పాటు ఆయన భద్రత సిబ్బంది ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. భద్రతా సిబ్బంది వెంటనే తేరుకుని.. ఆ ముద్దుపెట్టిన వ్యక్తిని గట్టిగా పక్కకులాగి.. రెండు కొట్టారు. అయితే యువకుడు ముద్దు పెట్టినా.. రాహుల్ గాంధీ మాత్రం తన బైక్‌ను ఆపకుండా ముందుకు సాగిపోయారు. ఈ ఘటన ఆదివారం పుర్ణియా జిల్లాలో చోటుచేసుకుంది. ఓట్ చోర్ యాత్ర పేరుతో రాహుల్ గాంధీ బిహార్‌లో యాత్ర చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో ఈ యాత్రకు విధుల్లో భాగంగా భద్రత కల్పిస్తున్న పోలీసులతోపాటు ప్రజలు సైతం తీవ్రంగా గాయపడుతున్నారు. ఈ నెల 16న ప్రారంభమైన ఈ యాత్ర.. సెప్టెంబరు 1న పాట్నాలో ముగియనుంది.

# ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్‌ను బర్తరఫ్ చేయాలి

## - ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు



తరలి వెళుతున్న అభిమానులు

**పామిడి, ఆగస్టు 24 ప్రభాతవార్త** అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంటేశ్వరప్రసాద్‌ను వెంటనే బర్తరఫ్ చేసి పార్టీ నుండి సస్పెండ్ చేయాలని సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన అనంతపురంలోని ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ ఇంటిని ముట్ట డించేందకు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ నలుమూలల నుండి తరలి వెళ్తున్న ఎన్టీఆర్ అభిమానులను ఆదివారం అనంతపురం పామిడి జాతీయరహదారిపై పోలీసులు అడ్డుకున్నారు. దీంతో జై ఎన్టీఆర్ జైజై ఎన్టీఆర్ అంటూ ఆయన అభిమానుల నినాదాలతో జాతీయం హదారి హోరెత్తటంతో శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం కాకుండా పోలీసులు వందలాది ఎన్టీఆర్ అభిమానులను ఆరెస్టు చేసి పెద్దవడుగూరు, గుత్తి, గార్లదిన్నె పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అంతకుముందు ఎన్టీఆర్ అభిమానులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యాప్తింగా ఎన్టీఆర్ పిలుపు మేరకు అభిమానులు తెలుగుదేశంపార్టీ గెలుపులో బాగస్వాముల య్యారని ఇది గుర్తించుకుని ప్రజాప్రతినిధులు బాద్యతగా వ్యవహరించాలని హితవు పలికారు. ప్రజాప్రతినిధులు ప్రజాసేవలో నిమగ్నం అవ్వాలే కానీ మీ గెలుపుకు దోహదపడ్డ మ అభిమాన హీరో ఎన్టీఆర్‌పై అనుచిత వాఖ్యలు చేయటం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుతంగా నిరసన తెలుపటానికి వెళ్తున్న మమ్మల్ని పోలీసులు అడ్డుకోవటం దారుణం అని విమర్శించారు. ఒక్కసారి మా అభిమాన హీరో ఎన్టీఆర్ పిలుపునిస్తే ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వం ప్రసాద్ అనంతపురంలోనే కాదు రాష్ట్రంలో ఎక్కడకూడా తిరుగలేడని తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్‌ను పార్టీ నుండి సస్పెండ్ చేసి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయించాలని లేనిపక్షంలో రాబోవు రోజుల్లో రెండు రాష్ట్రాలకు సంబందించిన లక్షలాది మంది ఎన్టీఆర్ అభిమానులందరం.

# ఒకే ఇంట్లో నలుగురు ఆడ బిడ్డలకు ప్రభుత్వ ఉద్యోగాలు

**పుంగనూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త** మండలంలోని వేపమాకులపల్లికి చెందిన సీతప్పగారి మునివెంకటప్ప, గౌరమ్మ దంపతులకు కుమార్తెలు నలుగురు సంతానం. వారిలో పెద్దకుమార్తె వీణాకుమారి (2014లో ఉమెన్ పోలీస్), వాణి (2016లో టీచర్), వనజాక్షి (2025 ఉమెన్ పోలీస్), శిరీష (2025లో టీచర్)లను ప్రభుత్వ ఉద్యోగాలు వరించాయి. వీరి కుటుంబ నేపథ్యాన్ని పరిశీలిస్తే తండ్రి పదేళ్లకు ముందే చనిపోయాడు, తల్లి దినసరి కూలిగా పనిచేస్తూ పెంచి, పెద్ద చేసి ఉన్నత చదవులు చదివించింది. ఒక తల్లిగా వారిని పోషించడమే అసాధ్యం, ఒకెత్తు అయితే ఆ తల్లి పేరును, వంశ గౌరవాన్ని నిలిపిన నలుగురు కుమార్తెలు నిజంగా సరస్వతులే. ఆర్థిక వనరులు లేక కుటుంబ ఇబ్బం దులతో ఇలాంటి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే సాధ్యంకాని రీతిలో వీరు మనకు మన పిల్లలకు భావి భారత



పా ం ల ల క ం న స్ఫూర్తిదాయకం. వెయ్యి ఏనుగుల బలం, వారి ధృఢ సంకల్పం, ఆత్మ విశ్వాసం చూస్తే మనం నమ్మలేని నిజాలుగా ఉన్నాయి. ఒకే కుటుంబంలో ఇద్దరు పోలీస్, మరో ఇద్దరు ఉపాధ్యాయిని లు కావడమే గొప్ప. ఆ విధంగా పెంచి పోషించిన ఆ మాతృమూర్తికి శతకోటి వందనాలు అలాగే ఇంతటి అత్యున్నత స్థాయికి చేరుకున్న అక్క చెల్లెళ్లకు అభినందనలని నెటిజన్లు ప్రశంసలు వర్షం కురిపిస్తున్నారు.

# దుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలి

## దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 24, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో సెప్టెంబర్ 22 నుండి అక్టోబర్ 2 వరకు జరిగే దసరా ఉత్సవాలు విజయవంతంగా నిర్వహిద్దామని దేవదాయ శాఖ కమీషనర్ రామచంద్ర మోహన్ అన్నారు. ఆదివారం ఆయన అధికారులతో కలిసి ఏర్పాట్లు జరుగుతున్న తీరు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలని, సామాన్య భక్తులకు త్వరితంగా దర్శనమయ్యేలా చర్యలు తీసుకోవాలని, తాగునీరు, అన్నప్రసాదం, శ్రీ అమ్మవారి లడ్డూ, పులిహోర తదితర ప్రసాదాలు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలని, వైద్య సదుపాయాలు సక్రమంగా వుండాలన్నారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు సెప్టెంబర్ 29న, అక్టోబర్ 2న శ్రీ అమ్మవారి లడ్డూ ప్రసాదం ఉచితంగా భక్తులకు పంచాలని ఆదేశించారు. పర్యావరణ రక్షణకు ప్లాస్టిక్ బదులు రిసైక్లింగ్ చేయగల వస్తువులు ఉపయోగించాలన్నారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిద్దామని అన్నారు. కార్యక్రమంలో ఇఓ వికె శీనా నాయక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

- వేదోక్తంగా సూర్యఉపాసన:

దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం సందర్భంగా వేదోక్తంగా సూర్యోపాసన జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆదిత్య హృదయం, అరుణ పారాయణ, సూర్యాష్టకం పఠిస్తూ సూర్యభగవానునికి పూజాదికాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

- భక్తులకు మెరుగైన నీటి సరఫరా:

దుర్గమ్మ భక్తులకు మెరుగైన నీటిని సరఫరా చేయాలని ఇఓ వికె శీనా నాయక్ అన్నారు. ఆదివారం ఆయన ఆలయంలోని వాటర్ ట్యాంకును పరిశీలించారు. వాటర్ ట్యాంక్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. నూతన వాటర్ ట్యాంక్‌సెట్‌ను వినియోగంలోకి తేవాలన్నారు. ఫోటోకౌంటర్, నిష్క్రమణ మార్గాన్ని పరిశీలించారు. భక్తులు దేవస్థానం వారందించే రక్ష కట్టను రు.50లకు అందుకోవాలని, నకిలీలు తీసుకోవద్దన్నారు.



దాతలకు దుర్గమ్మ జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

- భక్తుల రద్దీ: ఆదివారం సందర్భంగా దుర్గమ్మ దర్శనానికి భక్తులు బారులు తీరారు. వారికి త్వరితంగా దర్శనమయ్యేలా ఇఓ వికె శీనా నాయక్ చర్యలు తీసుకున్నారు.

- భక్తుల విరాళాలు:

దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన కనూరు రత్నాకర్‌రావు తమ కుటుంబసభ్యులతో కలిసి రు.1,01,116ల విరాళాన్ని ఆదివారం అందించారు. విజయవాడకు చెందిన కత్తుంగ వీర వెంకట సత్యనారాయణ, ఆయన భార్య బిఎన్‌వి అంజనాదేవి, వారి పిల్లలు ధనుష్ ఆర్యన్, కుటుంబసభ్యులు రు.1,01,116ల విరాళాన్ని ఉచిత ప్రసాద వితరణ పథకానికి అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమెుంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



ఆదివారం సోషల్ మీడియా-ఐటి సోషల్ మీడియా వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

# ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని ప్రజలకు తెలియజేయాలి

## సరైన సమాచారం చేరేలా చూడడం మనందరి బాధ్యత

### సోషల్-ఐటి సోషల్ మీడియా వర్క్‌షాప్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** సోషల్ మీడియా వారియర్లు ప్రతి ఒక్కరూ పార్టీ కార్యక్రమాలు, పార్టీ సిద్ధాంతం, మోడీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమం ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. ఆదివారం సోషల్ మీడియా-ఐటి సోషల్ మీడియా వర్క్‌షాప్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి గురించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ తరఫున వచ్చిన సమాచారాన్ని పంచాలి, రీట్వీట్ చేయాలని, ఇలా చేస్తేనే మన సందేశం ప్రతి ఇంటికి చేరుతుందని, మన బలం పెరుగుతుం దన్నారు. సోషల్ మీడియా, యూట్యూబ్ వేదికలను ఉపయోగించి తప్పుడు వార్తలు ప్రచారం చేయడం, పార్టీ కార్యకర్తల్లో విభేదాలు రేపే ప్రయత్నం చేయడం జరగకూడదన్నారు. అలాంటి చర్యలు ఎవరు చేసినా, చేయించినా, పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, తప్పనిసరిగా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటుం దన్నారు. మనం పోస్ట్ చేసే ప్రతి విషయం ఎక్కువ మందికి చేరేలా అందరూ రీట్వీట్ చేయడం, షేర్ చేయడం తప్పనిసరి. ఇటీవల కొన్ని యూట్యూబ్ వీడియోలకు తప్పుదారి పట్టించే, ఆకర్షణీయంగా కనిపించే నెగెటివ్ థం బ్‌నైల్స్ జోడించి ప్రజల్లో మిస్‌ఇన్ఫర్మేషన్ పంచుతున్నారు. ఇలాంటి వాటిని నమ్మరాదు, పంచరాదు.

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులంతా పార్టీ సిద్ధాంతం, నరేంద్ర మోడీ ప్రభుత్వం చేపడు తున్న అభివృద్ధి - సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయా లన్నారు. ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిల పదవీకాలం ముగిసినా, 19నెలలుగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తేలికగా తీసుకుంటుందని, స్థానిక సంస్థలు అంటే ఈ ప్రభుత్వానికి చిన్నచూపు అన్నారు. రాజ్యాంగం లోని 73వ, 74వ సవరణల ప్రకారం స్థానిక ఎన్నికలు జరపడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. కానీ ఓటమి భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తుందన్నారు. అలాగే రైతు భరోసా పేరుతో రూ. 15 వేల చొప్పున ఇస్తామని చెప్పి చివరికి కేవలం రూ. 6 వేలే రెండు విడతల్లో ఇచ్చి ప్రజలను మోసం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా విషయంలో కావాలనే కృత్రిమ కొరత సృష్టించి, మోదీ ప్రభుత్వాన్ని చెడుగా చూపించే ప్రయత్నం చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతుల పక్షాన నిలిచి రైతు సంక్షేమం కోసం అనేక చారిత్రక నిర్ణయాలు తీసుకుందన్నారు. ఎంపి డా. లక్ష్మణ్ మాట్లాడుతూ దేశమంతా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంవైపుచూస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి రోజురోజుకు బలపడుతుం దన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్‌రావు ఆదివారం నిజామాబాద్ జిల్లాలో పర్యటిం చనున్నారు. ఉదయం 10 గంటలకు ఇందల వాయికు చేరుకుంటున్నారు. 10.30 గంటలకు కాళేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహి స్తారు దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ర్యాలీలో పాల్గొంటారు. ఈ ర్యాలీ నిజామాబాద్ జిల్లా శ్రీరామ గార్డెన్స్ వరకు జరుగనుంది. జిల్లా కార్యకర్తల సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

# నిజామాబాద్ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు24:** ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం రేపింది. జూనియర్, సీనియర్ మెడికోలు ఘర్షణకు దిగారు. ఎమ్ బిబిఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న రాహుల్ ను సీనియర్ వేధించారు. ఎదురు తిరిగాడని రాహుల్‌ను సీనియర్లు తీవ్రంగా గాయపరిచారు. కాలేజీ విద్యార్థులు రాహుల్ ను ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రిలో అర్ధరాత్రి వరకు పంచాయితీ జరిగింది. రాహుల్ కాలేజీ యాజమా న్యానికి ఫిర్యాదు చేశారు. యాజమా న్యం ర్యాగింగ్ విషయం తెలియకూ డదని ప్రయత్నం చేస్తున్నారు. బాధితుడికి న్యాయం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.



# ప్రశ్నార్థకంగా మారిన విగ్రహాల అమ్మకాలు

## శ్రీకాళహస్తిలో కనిపించని చవితి సందడి!

**శ్రీకాళహస్తి, ఆగస్టు 24 ప్రభాతవార్త** హిందువులకు మొదటి పండగ వినాయక చవితి. సాధారణంగా గ్రామాల్లో 'పిళ్ళారి చవితి పండగల్ని పిల్చుకొని వస్తుంది. ఉగాది ఊడ్చుకొని పోతుందని' చెబుతారు. ఈ ఏడాది ఆగస్టు 27 బుధవారం వినాయక చవితి జరుపుకోబోతున్నారు. గ్రామాల్లో పండగంటే వారం ముందు నుంచి సందడి చోటు చేసుకుంది. పట్టణంలోని మిట్టకండ్రిగ, హౌసింగ్‌బోర్డు కాలనీల్లో భారీ వినాయక విగ్రహాలు తయారు చేసారు. కానీ అమ్మకం దారులు, కొనుగోలు దారులు సందిగ్ధంలో పడ్డారు. జై భోళో..గణేష్ మహారాజ్‌కీ..జై అంటూ చిన్నా..పెద్దా.. తేడా లేకుండా తలకు రిబ్బన్లు కట్టుకుని సందడిచేసే ఆనవాయితి ఉంది. గతంలో పండగ అంటే నాలుగైదు రోజులు వ్యాపారాలు జరిగేవి. భక్తిశ్రద్దలతో వినాయకచవితి పండుగను నిర్వహించుకు నేందుకు ప్రజలు సిద్దమౌతున్నారు. వినాయక విగ్రహాలదే ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఏడాది అధికారులు నిబంధనల ఉచ్చుబిగించారు. అయినా పట్టణంలో ఇప్పటికే వీధి వీధిలో వినాయక శిబిరాలు వెలిసినాయి. విద్యుత్‌దీపాల కాంతితో దేదీప్యమానంగా తీర్చి దిద్దారు. ఈపండుగకు అధికారులు అనుమతి ఇప్పటి వరకు అనుమతించలేదు. రాష్ట్రం కాని రాష్ట్రం రాజస్థాన్ నుంచి వచ్చి ఇక్కడ 30కుపైగా కుటుంబాలు వినాయక విగ్రహాలు తయారీ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రతి ఏడాది సుమారు 10 నుంచి 12 అడుగులకు పైగా విగ్రహాలు తయారుచేసేవారు ఈఏడాది విగ్రహాలు కేవలం మూడు నుంచి ఆరు అడుగులకే పరిమితం అయ్యాయి. అయితే ఈవిగ్రహాలను కూడా గ్రామాల్లో చవితి సంబరాలను నిర్వహించే వారు కొరుగోలుకు అడ్వాన్సులు ఇస్తున్నారు. ఇక ఇండ్లలో కూడా మట్టివినాయకప్రతిమలను ప్రతిష్టించి పూజలు నిర్వహించుకోవాలని తెలియజేశారు. ఒక్క వినాయకచవితి వేడుకలకు మాత్రమే తప్ప మిగిలిన రోజుల్లో ఇతర విగ్రహాలను తయారుచేసి వీధుల్లో విక్రయించి జీవనం గడుపుకుంటూ రాజస్థాన్ వాసులు ఉంటారు. ఈఏడాది కేవలం ఆం12 అడుగుల వరకే విగ్రహాలను తయారుచేస్తున్నామని నిర్వాహకులు పేర్కొంటున్నారు. రూ.300నుంచి రూ.12వేల వరకు విగ్రహాలు ఉన్నాయని అయితే వీటికి అయ్యేఖర్చు ఎక్కువగా ఉన్నా తయారుచేసిన విగ్రహాలు విక్రయిస్తే కానీ తాము తమారుచేసిన వాటికి ఫలితం ఉండదని పేర్కొంటున్నారు. ఒక విగ్రహం తయారుచేస్తే కేవలం రూ.500 నుంచి రూ.1500వరకు మాత్రమే ఆదాయం ఉంటుందని లేకపోతే ఇది కూడా ఉండదని ఆవేదన వ్యక్తంచేశారు. సుమారు 30 మంది వరకు తమతో పాటు తమ బిడ్డలను ఈవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. కొందరు బొమ్మలకు ఇప్పటికే అడ్వాన్సులు ఇచ్చారని అధికారులు అనుమతి ఇస్తే తమ బతుకు తెరువు కాస్తా కోలుకుంటుందని పేర్కొన్నారు. ఏది ఏమైనా ఈఏడాది వినాయక చవితి ఉత్సవాలుకు ఇటు యువకులు, అటు తయారీదారులు కోరేది మాత్రం అధికారులు అనుమతికోసమే. వినాయక చవితి సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్దం అవుతున్నారు. కానీ నిబంధనల ఉచ్చుతో వీధులు వెల వెల బోతున్నాయి. వారం ముందు నుంచి పందిళ్ళ శోభ కనబడటం లేదు. ఏర్పాట్లు లేదు. పట్టణంలోని పెండ్లిమండపం, బేరివారి మండపం వద్ద ప్రత్యేక వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసే వారు కానీ ఈ ఏడాది అక్కడ సందడి కనబడటం లేదు.. ఈనేపథ్యంలో బాబుఅగ్రహారం, పాత బస్టాండు, పానగల్‌లోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలల వద్ద ప్రత్యేక దుకాణాలు వ్యాపారులు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసేవారు కానీ ఎండగ మరో నాలుగు రోజులే ఉన్నా ఎవ్వరూ ముందుకు రావటం లేదు.

# అపర భగీరథుడు సిఎం చంద్రబాబు : ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

## - గుండిశెట్టిపల్లిలో కృష్ణాజలాలకు ప్రత్యేక పూజలు !

**శాంతిపురం, ఆగస్టు 24 ప్రభాతవార్త** రాష్ట్రానికి అపర భగీరథుడు సిఎం చంద్రబాబునాయుడు అని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. ఆదివారం గుండిశెట్టిపల్లి గ్రామం వద్ద హంద్రీ-నీవా కాలువలో కృష్ణాజలాలకు ప్రత్యేక పూజలు చేసి జంతుబలి ఇచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ పిఎస్‌ఎంలు సిఎం చంద్రబాబు చిత్రపటాన్ని చేతపట్టుకుని కృష్ణాజలాల్లో నడుస్తూ నినాదాలు చేశారు. 1200 అడుగుల కింద నుంచి కృష్ణాజలాలను తెచ్చిన ఘనత సిఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. ఏడువందల యాభై కిలోమీటర్ల మేర కాలువల పనులు పూర్తి చేసి కుప్పం ప్రజల దాహార్తి తీర్చేందుకు సిఎం చంద్రబాబు చేసిన కృషిని తరతరాలు కుప్పం ప్రజలు గుర్తు పెట్టుకుంటారన్నారు. హంద్రీ-నీవా కాలువల కోసం 17వేల కోట్లు ఖర్చు చేయడం జరిగిందని ఇది చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. వైకాపా పాలనలో వైఎస్ జగన్ హంద్రీ-నీవా డ్రామాసెట్టింగ్ వేసి కుప్పం ప్రజల్ని మోసగించారన్నారు. ఈనెల 30న సిఎం చంద్రబాబునాయుడు దంపతులు కుప్పంలో కృష్ణాజలాలకు జలహారతి చేపడతారన్నారు. కుప్పాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంలో భాగంగా ఎయిర్‌పోర్టు వద్ద రాకెట్ తయారీ పరిశ్రమల సైతం కుప్పం వస్తోందన్నారు. అ ంతకుముందు కూటమి నేతలు పెద్ద ఎత్తున కాలువల్లో పూజలు చేసి సంబరాలు జరుపుకున్నారు.

కార్యక్రమంలో పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, సిఎం పిఎ మనోహర్, నేతలు విశ్వనాథనాయుడు, ఉదయ్‌కుమార్, జనార్ధనరెడ్డి, గోపాల్, రాజు, కడ సభ్యులు రాజ్‌కుమార్, సుగుణమ్మ, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రమేష్, బాబు, ఆనందరెడ్డి, కన్నన్, బిఎంకె రవిచంద్ర, సత్యేంద్రశేఖర్, బాలు, వేదశ్రీ, ఉమాపతి, అనసూయ, తులసినాథ్, నరేష్, నాలుగు మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రైతులు యూరియా కష్టాలు ఎదుర్కొంటున్నారు

## - పిసిసి అధ్యక్షురాలు షర్మిల

**విజయవాడ, ఆగస్టు24, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో రైతులు యూరియా కష్టాలు ఎదుర్కొంటున్నారని, వారి కష్టాలు వర్ణణాతీతంగా ఉన్నాయని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఏ రైతును కదిలించినా ఎరువుల కోసం కన్నీటి వ్యథలే వినబడుతున్నాయన్నారు. తెల్లవారుజాము నుంచే ఎరువుల కేంద్రాల దగ్గర కిలోమీటర్ల క్యూలు ఉంటున్నాయని, కట్ట యూరియా కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని పేర్కొన్నారు. ఇదేనా కూటమి ప్రభుత్వానికి రైతాంగంపై ఉన్న చిత్త శుద్ధి? అని ప్రశ్నించారు. 6.34 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరుకుంటే రైతులకు ఎరువు కరువు ఎందుకొచ్చిందన్నారు. రూ.266కు అమ్మాల్సిన బస్తా ధర మార్కెట్లో రూ.500లకు ఎందుకు అమ్ముతున్నారని ప్రశ్నించారు.



## ఎపి సిఎం సహాయ నిధికి చిరంజీవి రూ.కోటివిరాళం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు24:** ఆంధ్రప్రదేశ్ సిఎం సహాయనిధికి మెగాస్టార్, మాజీ కేంద్ర మంత్రి చిరంజీవి విరాళం అందించారు. హైదరా బాద్‌లో సిఎం చంద్రబాబును ఆది వారం కలిసి రూ.కోటీ చెక్కును అం దజేశారు. ఈ సందర్భంగా వీరి మధ్య దాదాపు 40 నిమిషాల పాటు చర్చ జరిగింది. సహాయం అందించిన చిరంజీవికి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. మెగాస్టార్ గతంలోనూ వరదసాయం కింద రూ.కోటీ అందిం చారని గుర్తు చేశారు.

# కేంద్రం సరఫరా చేయకపోవడంతోనే కొరత

## 2.64 లక్షల టన్నుల యూరియా లోటు

**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన యూరియాను సరఫరా చేయక పోవడం వల్లే తెలంగాణలో ఆ ఎరువుకు కొరత ఏర్పడిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో కేంద్రం తెలంగాణకు ఈ వానాకాలం సాగు నిమిత్తం 9.80 లక్షల ట న్నుల యూరియా కేటాయింపులు చేసింద న్నారు. ఇందులో ఆ నెలాఖరు నాటికి 8.30 లక్షల టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉందని తెలిపారు. అయితే ఇప్పటి వరకూ రా ష్ట్రానికి 5.66లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేసిందని చెప్పారు. రాష్ట్రానికి ఇంకా 2.64 లక్షల టన్నుల యూరియా సరఫరా కావాల్సి ఉందని వెల్లడిం చారు. ఫలితంగా తెలంగాణలో యూరియా కొరత నెలకొందని స్పష్టం చేశారు.

ఈ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా యూరియా వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల అందుకు తగినట్లుగా సరఫరా లేకపోవడంతోనే రైతులు ఆందోళనగా ఉన్నార న్నారు. అయితే రాష్ట్రంలో యూరియా పక్కదారి పట్టిందని కేంద్ర మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలు అర్థ రహితమని వ్యాఖ్యానించారు.

# ఆదివాసీ గిరిజన బాలికపై సామూహిక అత్యాచారం?

## ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

## సంరక్షణ కేంద్రానికి బాలిక తరలింపు

**కొత్తగూడెం క్రైం, ఆగస్టు 24 ప్రభాతవార్త:** ఆటో డ్రైవర్‌ను నమ్మిన ఆ మైనర్ బాలిక మోసపో యింది. ఆదివాసీ బాలికపై సామూహిక అత్యాచారం జరిగిన సంఘటన మూడు రోజుల తర్వాత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి... చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా డోర్నపాల్ సమీపంలోని బోదగూడెం గ్రామానికి చెందిన 17 సంవత్సరాల మైనర్ బాలిక బోదగూడెం నుంచి కుంటకు బస్సులో రాగా అక్కడ నుంచి శుక్రవాసం సాయంత్రం ఏపీలోని ఏడుగురాళ్లపల్లి సమీపంలో గొల్లగుప్పలో ఉన్న తన పిన్ని ఇంటికి వచ్చింది. తర్వాత తిరుగు ప్రయాణంలో కుంట వద్ద ఆటో ఎక్కింది. ఏడుగురాళ్లపల్లి సమీపంలోని గొల్లగుప్ప క్రాస్‌రోడ్‌లో దింపాలని అక్కడ మా వాళ్లు ఎవరైనా ఉంటారని అక్కడి నుంచి గొల్లగుప్పకు వెళ్తానని బాలిక చెప్పి ఆటో ఎక్కింది. ఈ క్రమంలో ఆటో డ్రైవర్లు మార్గమధ్యలో మైనర్ బాలికకు ఆటో డ్రైవర్లు కొంత దూరం అడవిలోకి తీసుకెళ్లి తనను మద్యం సేవించాలని బలవంతం చేయగా తాను తాగనని నిరాకరించడంతో వారు చేతులు, కాళ్లు పట్టుకొని బలవంతంగా తాగిం చారని, అప్పుడు తాను మత్తులోకి జారుకున్నా నని, తనకు తర్వాత ఏం జరిగిందో కూడా గుర్తు లేదని సదరు బాలిక తెలిపింది. ఆ తర్వాత తాను పెద్దమ్మతల్లి గుడి వద్దకు ఎలా వచ్చిందో కూడా గుర్తు లేదని చెప్తుంది. శుక్రవారం రాత్రి సంఘటన జరిగిన తర్వాత పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయం ముందు డివైడర్‌లో నీరసంగా ఉన్న బాలికను చూసి రాత్రి సమయంలో విధులు నిర్వహించే వాచ్‌మెన్ గమనించి ఆమెను ఆలయ ఆవరణలోకి తీసుకొచ్చి అక్కడ ఆశ్రయం కల్పించారు. శనివారం ఉదయం ఆమె ఒంటిపై ఉన్న గాయాలు, చిరిగిన దుస్తులను చూసి వెంటనే ఇంటికెల్లి తన కుమార్తె దుస్తులు తీసు కొచ్చి ఉదయం పారిశుధ్య పనులు చేయడానికి వచ్చిన మహిళలతో ఆమెకు దుస్తులు మార్పించారు. అక్కడి మహిళలు ఆమెను అడుగగా తనకు జరిగిన సంగతిని తెలుపుతుంది. దీంతో శనివారం మధ్యాహ్నం పాల్వంచ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి చికిత్స అందించారు. ఆమె తీరును చూసి చైల్డ్ కేర్ సెంటర్‌కు ఫోన్ చేయగా అక్కడి నుంచి సఖి సెంటర్‌కు పంపించారు. సదరు బాలిక తాను ఎక్కడి నుంచి వచ్చింది... ఎక్కడికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఏం జరిగిందో విషయాలను చెప్తుంది కానీ తనపై జరిగిన అఘాయిత్యం తనకు గుర్తు లేదని, తనను బలవంతంగా మద్యం తాగించారని, ఆ తర్వాత తనకు ఏం జరిగిందో తెలియని, కళ్లు తెరిచి చూసే సరికి ఇక్కడ ఉన్నానని చెప్తుంది. దీనిపై పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలుస్తోంది.

ఈ విషయమై పాల్వంచ డీఎస్పీని వివరణ కోరగా మెడికల్ టెస్టు చేసిన తర్వాత కేసు నమోదు చేస్తామని తెలిపారు.

# సెప్టెంబరు 25న రామగుండం థర్మల్ కేంద్రం ఎన్నికలు

**హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త:** రామగుండం నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ)లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నగారా మోగింది. సెప్టెంబరు 25న గుర్తింపు యూనియన్ ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్, ఎన్టీపీసీ దక్షిణ రీజియన్ సీజీఎం సూర్యనారాయణ్ పాణిగ్రహి, ఎన్నికల అధికారి, రామగుండం ప్రాజెక్టు ఏజీఎం విజయ్ కుమార్ సిక్దర్ వెల్లడించారు. ఈ మేరకు దీనికి సంబం ధించి ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ ఎన్నికల నిమిత్తం ఇదే నెల 30వ తేదీ లోగా ఎన్టీపీసీలోని ప్రాతినిధ్య కార్మిక సంఘాలు తమ రిజిస్ట్రేషన్ పత్రాలు, వార్షిక నివేదికలను సమర్పించాలని వెల్లడించారు. సెప్టెంబరు 25న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు.



దీక్షలో నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

## సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలుచేయాలి

### పిఆర్‌టియు వ్యవస్థాపక అధ్యక్షుడు గల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 24, ప్రభాతవార్త:** 2003లో అప్పటి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని పీఆర్‌టియూ వ్యవస్థాపక అధ్యక్షులు గల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ధర్నాచౌక్‌లో పీఆర్‌టియూ తెలంగాణ ఆధ్వర్యంలో సీపీఎస్ రద్దు కోరుతూ దీక్ష చేపట్టారు. ఈ దీక్షనుద్దేసించి హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ 2014లో కొత్త రాష్ట్రం ఏర్పడిన తరువాత పాత పెన్షన్ విధానం అమలుచేసే అవకాశం ఉన్నప్పటికీ, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ జీవో నెంబర్ 28 తీసుకువచ్చి, మళ్లీ సీపీఎస్ విధానమే అమలులోకి తెచ్చారని గుర్తు చేశారు. నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ అమలుచేయాలని కోరారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఇచ్చిన మాట ప్రకారం సీపీఎస్ రద్దు చేశారని, సీపీఎస్ రద్దు చేయటం వల్ల ప్రభుత్వానికి కూడా ప్రతి ఉద్యోగి నుంచి 10శాతం నిధులు వస్తాయి కాబట్టి, అది ప్రభుత్వానికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. 1980కి పూర్వము ఇటువంటి పరిస్థితి ఉండేదని, 189 ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాలు దేశ వ్యాప్తంగా 72రోజుల పాటు నిరవధిక సమ్మె జరిపినందున అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ జీవో నెంబర్ 88 తీసుకువచ్చి, పెన్షన్ విధానం అమలుచేశారని గుర్తు చేశారు. 2003లో ఎన్డీఏ ప్రభుత్వం, 2014లో టీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేసి, సీపీఎస్ రద్దు చేయకపోవటంవల్ల ఉద్యోగులకు పెన్షన్ లేక ఎన్నో ఇబ్బందులకు గురవు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ముదెరేసి చెన్నయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.చంద్రశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి బానలల రత్నాకర్‌రావు, గౌరవాధ్య క్షులు జీ.ఉమాకర్‌రెడ్డి, ఎం. అనంతారెడ్డి, ఎస్.యుగంధర్‌రెడ్డి, కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో గుజ్జ సత్యం, నీల వెంకటేష్ తదితరులు

## పార్టీ పరంగా వద్దు, చట్టపరంగా బిసి రిజర్వేషన్లు కల్పించాలి

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 24 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు పార్టీపరంగా కాకుండా చట్టబద్ధంగా, రాజ్యాంగ బద్ధంగా కేటాయించాలని 18బిసి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. బిసిల రిజర్వేషన్‌ల విషయంలో ప్రభుత్వం ఊగిసలాడుతున్నదని, గత 8 నెలలుగా జాప్యం చేస్తూ వస్తున్నదని, బిహార్, జార్ఖండ్, తమిళనాడు ప్రభుత్వాలు అనుసరించిన విధానాన్ని ప్రభుత్వం ఎందుకు అవలంభించడం లేదని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్‌ల అమలుపై ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 18 బిసి సంఘాల సమావేశం జరిగింది. ఈసమావేశంలో ముఖ్యఅతిధిగా పా ల్గొన్న ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బిసిల రిజర్వేషన్‌ల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ఏఒక్క విధానం సక్రమంగా లేదని, అసెంబ్లీలో బిల్లు పాసైన తరువాత గవర్నర్ అమోదం పొంది, జివొ జారీచేసి ఎన్నికల నోటిఫి కేషన్ ఇస్తే సరిపోయేదని, అప్పుడు ఎవరైన కోర్టుకు వెళితే, కోర్టులో గెలిస్తే ఎన్నికలను నిర్వ హించవచ్చునని, గెలవకపోతే రాజ్యాంగ సవరణ కోసం పోరాటం చేయవచ్చునని చెప్పారు. అలా చేయకుండా ప్రభుత్వం రాష్ట్రపతి అని, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని, రకరకాల వాదనలతో ప్రజలను తప్పుత్రోవ పట్టించి కేంద్రంపై నెట్టి జాప్యం చేసి ప్రజలను మైకంలో ఉంచి చివరకి పార్టీ పరంగా రిజర్వేషన్‌లు కల్పిస్తామని మొదటికి వచ్చిందన్నారు. ఇది సరైన పద్ధతి కాదని, ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించమన్నారు.

**నేటి సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి**

బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు చట్టప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం 10గంటలకు ఇందిరాపార్క్ వద్ద 'సత్యాగ్రహ దీక్ష'ను చేపట్టాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఇందులో బిసిలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతంచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కృషి చేయాలి

### ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఎవిఎన్ రెడ్డి, మల్కకొమరయ్య

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 24:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఎవిఎన్ రెడ్డి, మల్కకొమరయ్య పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాదులోని కేశవ మెమోరియల్ పాఠశాలలో జరిగిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఎవిఎన్ రెడ్డి, మల్క కొమరయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో ఏబీఆర్ఎస్ఎం జాతీయ ప్రతినిధులు పాలేటి వెంకట్రావు, డాక్టర్ సూరం విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అలుగుపల్లి పాపిరెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శులు బండి రమేష్, తెలకలపల్లి పెంటయ్య వివిధ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఏబిఆర్ఎస్ఎం దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 1న జరగబోయే హమారా విద్యాలయ్ హమారా స్వాభిమాన్ పోస్టర్లను ఎమ్మెల్సీలు, తపస్ రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల విద్యారంగ సమస్యలపై ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తూ ప్రాతినిధ్యం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలపై చొరవ చూపించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హామి ఇచ్చిన విధంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్(సిపిఎస్) విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వివిధ రకాలైన బిల్లులన్నింటినీ వెంటనే మంజూరు చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశా లలను కాపాడుకోవడం మన ఉపాధ్యా యుల బాధ్యత అని తపస్ నేతలు గుర్తు చేశారు. సెప్టెంబర్ 1వ తేదీన జరిగే హమారా విద్యాలయ్ హమారా స్వాభిమాన్ కార్యక్రమం విజయవంతం చేసి అత్యధిక పాఠశాలల్లో కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.

## గురుకులాల్లో చేరే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

### ఈ యేడాది నుంచే అమలు..ప్రణాళిక సిద్ధం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 24:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు గురుకులాల్లో చేరాలనుకుంటే.. అటువంటి వారికి ప్రత్యేక శిక్షణను ఇవ్వాలని పాఠశాల విద్య శాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన శిక్షణను ఈ ఏడాది నుంచే అమలు చేయనుంది. వచ్చే ఏడాది 2026-27 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే టిజి సెట్-2026కి ఇప్పటి నుంచే ప్రత్యేకంగా శిక్షణను ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్‌లో చదువుతూ వచ్చే ఏడాది గురుకులాల్లో చేరాలనుకునే వారిని గుర్తించాలని జిల్లా విద్యాశాఖాధికారులకు పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. రాష్ట్రంలో 26,120 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఉన్నాయి. వాటిలో సుమారు 19.50 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న వారు వచ్చే ఏడాది 5వ తరగతిలో ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ, సాధారణ గురులాల్లో 5వ తరగతిలో చేరాలని భావించే వారికి ఈ శిక్షణను ఇవ్వాలని పాఠశాల విద్య శాఖ అధికారులు నిర్ణయించారు. అయితే వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడమంటే.. ప్రభుత్వం నిర్వహించనున్న తెలంగాణ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజి సెట్)-2026లో ఎలాంటి ప్రశ్నలు వస్తాయి.. వాటిని ఎలా సాల్వ్ చేయాలో విద్యార్థులకు ప్రత్యేకంగా వివరించనున్నారు. అయితే గురుకులాలకు వెళ్లాలని భావించిన వారికి మాత్రమే శిక్షణను ఇవ్వనున్నారు. 2015లో తెలంగాణ రాష్ట్రంలో వివిధ గురుకులాలను ఎక్కువ సంఖ్యలో ప్రారంభించారు. ప్రధానంగా బిసి సంక్షేమ శాఖలో అధ్వర్యంలో ఎక్కువగా సుమారు 268కి పైగా కొనసాగుతున్నాయి. అన్ని గురుకులాల్లో కలిపి సుమారు 1000కిపైగా గురుకుల స్కూల్స్ ఉన్నాయి. వాటిలో 5వ తరగతిలో నేరుగా అడ్మిషన్లను తీసుకోనుండగా.. 6 నుంచి 10వ తరగతి వరకు ప్రతి ఏడాది ఏర్పడే ఖాళీలకు కూడా ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా 5వ తరగతిలో చేరడం కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షలో అర్హత సాధించేలా శిక్షణను ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

### పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 24:** రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పంచాయతీరాజ్ శాఖా మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆబిడ్స్‌లో ఉన్నత స్టాన్లీ బాలికల ఉన్నత పాఠశాలలో స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియు టియస్) రాష్ట్ర అధ్యక్షుడు యం. పర్వత్ రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో మంత్రి సీతక్క ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ అధ్యక్షతన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, ఎస్‌టియు ఏపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథ రెడ్డి, తెలంగాణ పాఠశాల విద్య అడిషనల్ డైరెక్టర్ కె. లింగయ్య, ఆర్‌జెడి సత్యనారాయణ, సంఘ రాష్ట్ర నాయకులు ఆట సదయ్య, ఎల్. ఎం. ప్రసాద్, జుట్టు గజేందర్, ఎవి సుధాకర్, రవి, నర్సింహారెడ్డి, శంకర్ మాతంగి, పోల్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, కృష్ణారెడ్డితోపాటు 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ అభివృద్ధిలో ఎస్‌టియు కీలక పాత్ర పోషించిందని మంత్రి సీతక్క అన్నారు. పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను ప్రభుత్వం దశల వారీగా క్లియర్ చేయనుందని తెలిపారు. తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎస్‌టియు టిఎస్ పాత్రను గుర్తు చేశారు. ఉపాధ్యాయ సంక్షేమానికి పర్వత్ రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడవెంకట్ రెడ్డి మాటాడుతూ దేశానికి స్వాతంత్ర్యము రాక పూర్వమే ఏర్పడి,ప్రభుత్వంచే గుర్తింపు పొందిన తొలి ఉపాధ్యాయ సంఘం ఎస్‌టియు అని గుర్తుచేశారు. రాష్ట్రంలో తొలి పిఆర్‌సి ఏర్పాటు, పెన్షన్ రూల్స్ సాధన,అప్రెంటిస్ విధానం రద్దుకొరకు ఎస్‌టియు సంఘం చేసిన కృషిని కొనియాడారు.



ఆదివారం స్టాన్లీ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీత్క

# యేడాదిలో పనులు పూర్తి చేయాలి

### పాఠశాల ప్రాంగణం ఆకర్షణీయంగా ఉండాలి

### భవన నిర్మాణానికి 50 కోట్లు మంజూరు

### సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ప్రభాతవార్త, నడిగూడెం,(సూర్యాపేట):** కోదాడలో నాణ్యమైన విద్యా సదుపాయాలు కల్పించేందుకు పనులు వేగవంతం చేయాలని నీటి పారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కోదాడలో కొత్తగా మంజూరైన జవహర్ నవోదయ విద్యాలయ నిర్మాణంపై పురోగతిని సమీక్షి ంచారు. నవోదయ విద్యాలయ సమితి రెండు సంవత్సరాల గడువులో నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించినప్పటికీ, మంత్రి ఒకే సంవత్సరంలో పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మంత్రి క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన ఈ సమావేశంలో భవన డిజైన్లు, ఆర్కిటెక్చరల్ లేఅవుట్లు తుది నిర్ణయాలు, నిర్మాణ కాలపట్టికల వేగవంతంపై చర్చించారు. భవనాల ఎలివేషన్ నాణ్యమైన వాస్తు శిల్పం ప్రతిబింబించాలని, ప్రాంగణం విద్యార్థులకు ఆకర్షణీయంగా ఉండాలని మంత్రి తెలిపారు. 19.12 ఎకరాల స్థలాన్ని విద్యా భవనాలు, హాస్టళ్లు, సిబ్బంది నివాసాలు, వినోద వేదికల కోసం సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి భవన ప్రణాళికల్లో విద్యార్థులకు అనుకూలమైన మార్పులు చేయాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యం, భద్రత, శ్రేయస్సు దృష్ట్యా


ఆదివారం సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ప్రతి సౌకర్యం ఉండాలని అధికారులకు సూచించారు. ప్రతిష్ఠాత్మక జవహర్ నవోదయ విద్యాలయం, కోదాడలోని కెఆర్‌ఆర్ డిగ్రీ కాలేజీ సమీపంలో 19.12 ఎకరాల విస్తీర్ణంలో స్థాపించబడనుంది. కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్లను మంజూరు చేసింది. టెండర్లు కూడా ఫైనల్ అయ్యాయి. ఒక సంవత్సరం లోపల పాఠశాల ప్రారంభించేందుకు మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ లాజిస్టిక్ సపోర్ట్ అందిస్తున్నారని, అవసరమైన భూసమీకరణ, సామగ్రి ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయాలను 1986లో అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ గ్రామీణ ప్రతిభావంతుల విద్యార్థులకు ఉచిత, నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రారంభించారని విద్యా మంత్రిత్వశాఖ పరిధిలోని నవోదయ విద్యాలయ సమితి వీటిని నిర్వహిస్తుందని దేశవ్యాప్తంగా 650కి పైగా పాఠశాలలు నడుస్తున్నాయని జె ఎన్ వి ఎస్ టి పరీక్ష ద్వారా ఆరో తరగతి నుండి ప్రవేశాలు కల్పిస్తారు. జిల్లా కలెక్టర్ విద్యాలయ మేనేజ్ మెంట్ కమిటీ చైర్మన్‌గా ఉంటారని. కోదాడ జవహర్ నవోదయలో ఆరో తరగతి నుండి 12వ తరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్‌లో ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్య అందించబడుతుందని. ప్రతి సంవత్సరం 80 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారని వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, షూస్, స్కూల్ బ్యాగులు, స్టేషనరీ ఉచితంగా అందజేయబడతాయని విద్యార్థులు సిబ్బందికి పూర్తి స్థాయి నివాస సదుపాయం ఉంటుందని తెలిపారు. పాఠశాల రోజువారీ కార్యక్రమంలో ఉదయం ప్రార్థనా సభ, విద్యా తరగతులు, మధ్యాహ్నం రీమిడియల్ సెషన్లు, సాయంత్రం పర్యవేక్షిత అధ్యయన సమయాలు ఉంటాయని విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధి లక్ష్యంగా ఈ షెడ్యూల్ రూపొందించబ డిందని జిల్లా కలెక్టర్ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి పాఠశాల నిర్మాణం సమర్థవం తంగా సాగేం దుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎన్ వి ఎస్ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ అభిజిత్ బెరా, జే ఎన్ వి ఖమ్మం ప్రిన్సిపల్ కే. శ్రీనివాసులు, ఎన్ బీసీసీ (హైదరా బాద్) డీజీఎం అబ్దుల్ రహీమ్ ఇతర సీనియర్ అధికారులు

## నేటి నుంచి ఐ సెట్ కౌన్సెలింగ్‌లో వెబ్ ఆప్షన్లు

### ఇప్పటి వరకు 18వేల మందికిపైగా దరఖాస్తు

### 7500 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరు

### సెప్టెంబర్ 2న సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 24:** రాష్ట్రంలోని ఎంబిఏ, ఎంసిఏ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఐ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా నేటి(సోమవారం) నుంచి వెబ్ ఆప్షన్లు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 20 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇప్పటి వరకుకు సుమారు 18వేల మందికిపైగా ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఈ నెల 28 వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. శుక్రవారం నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభం కాగా ఇప్పటి వరకు 7500 మంది హాజరయ్యారు. ఈ నెల 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగనుంది. అయితే ఈ నెల 27న వినాయక చవితి కావడంతో ఆ రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉండదని అధికారులు ప్రకటించారు. నేటి(సోమవారం) నుంచి వెబ్ ఆప్షన్లకి అవకాశం కల్పించారు. ఈ నెల 30 వరకు ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశమిచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి సెప్టెంబర్ 2న సీట్ల కేటాయింపు చేయనున్నారు.

## 'జనహిత'లాజిస్టిక్ కమిటీ కన్వీర్‌గా బొంతు రాంమోహాన్

**హైదరాబాద్, ఆగస్టు 23,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మహేష్ కుమార్, తెలంగాణ ఎఐసిసి ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ చేపట్టిన జనహిత పాదయాత్ర, శ్రమదానంకు అరెంజ్‌మెంట్ అండ్ లాజిస్టిక్ కమిటీ కన్వీనర్‌గా బొంతు రాంమోహాన్‌ను టిపిసిసి కన్వనర్ కుమార్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. కో కన్వీనర్‌గా మొగుల్లా రాజిరెడ్డి, సభ్యులుగా అనిల్ కుమార్ గౌడ్, ఎండి అవిజోద్దిన్, ఎంఎ అన్సారీ, మిద్దెశ్రీనివాసులు నియమించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ చేపట్టిన జనహిత పాదయాత్ర శ్రమదానం రెండో విడత ఆదివారం సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం ఉప్పర్ మల్యాల నుంచి ప్రారంభమైంది. వరంగల్ జిల్లా వర్ధన్నపేట వద్ద ముగియనుంది. ఈ పాదయాత్రకు ముఖ్య అతిథిగా ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు. రెండో విడత జనహిత పాదయాత్ర తొలి రోజు ఉప్పర్ మల్యాల నుంచి కురిక్యాల మీదుగా గంగాధర - మధురనగర్ చౌరస్తా (ఎక్స్ రోడ్) వరకు కొనసాగింది.

## సాధారణ స్థితిలోనే మంజీరా గేట్లు

### బ్యారేజీని సందర్శించిన జలమండలి అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరానికి మంచినీరు సరఫరా చేస్తున్న మంజీరా బ్యారేజీ గేట్లు పనిచేయడం లేదని వివిధ మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న నేపథ్యంలో మంజీరా బ్యారేజ్‌ను జలమండలి అధికారులు సందర్శించారు. మంజీరా గేట్లు అన్నీ సక్రమంగా పనిచేస్తూ కార్యనిర్వహణ స్థితిలో ఉన్నాయని, ప్రస్తుతం మంజీరా నుండి 2 క్రస్ట్‌గేట్లు మరియు 1 స్కవర్ వెంట్ ద్వారా 15,130 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సింగూర్ నుండి ప్రవాహం 9,226 క్యూసెక్కులు ఉండగా, 13 నుంచి ఆదివారం రోజు ఉదయం 6:00 గంటల వరకు గేట్లలో ఎటువంటి అంతరాయం లేకుండా సగటున 46,000 క్యూసెక్కులతో మొత్తం 28.09 టిఎంసిని విడుదల చేశామని తెలిపారు. మంజీర బ్యారేజ్‌కి గాని, గేట్ల గాని ఎలాంటి ముప్పు కలగలేదని జలమండలి అధికారంగా ప్రకటించారు.

## 28 నుంచి గేట్ దరఖాస్తులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు24:** దేశంలోని ఐఐటీలు సహా పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఎం.టెక్, పిహెచ్‌డి కోర్సుల్లో వచ్చే ఏడాది ప్రవేశాలకు నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్ 2026) పరీక్షకు సంబం ధించినఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల తేదీల్లో మార్పు చోటుచేసుకుంది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం సోమవారం (ఆగస్టు25) దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా తాజా నిర్ణయం ప్రకారం ఈ నెల 28నుంచి సెప్టెంబర్ 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఐఐటీ గువాహటి ప్రకటనలో వెల్లడించింది. ఆలస్యరుసుంతో అక్టోబర్ 9వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

## ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లెక్చరర్లకు పదోన్నతులు కల్పించాలి

### ప్రభుత్వానికి గవర్నమెంట్ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 24:** రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న లెక్చరర్లకి అర్హతల మేరకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం డిమాండ్ చేసింది.

డిగ్రీ కళాశాలల్లో వెం టనే పదోన్నతులు కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోపి రాష్ట్రప్రధాన కార్య దర్శి డాక్టర్ సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రం లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో చాలా కాలంగా పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ నెల 31తో ప్యానల్ ఇయర్ ముగుస్తున్నందున వెంటనే పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేసే జూనియర్ లెక్చరర్స్ నుండి డిగ్రీ లెక్చరర్ పదోన్నతులు, డిగ్రీ లెక్చరర్ నుండి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పదోన్నతుల కొరకు 2024-25 ప్యానల్‌కి సంబంధించి గత సెప్టెంబర్, అక్టోబర్ లోనే కళాశాల విద్యాశాఖ కమిషనర్ సర్క్యులర్ జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు పదోన్నతుల ప్రక్రియ పూర్తికాలేదన్నారు. ప్రస్తుత ప్యానల్ ఈ నెల 31తో ముగుస్తున్నందున వెంటనే పదో న్నతుల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

రాష్ట్రం లోని ప్రభుత్వ డిగ్రీకాలేజీల్లో 2500 వరకు డిగ్రీ లెక్చరర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటితో పాటు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పోస్టులు సుమారు 50వరకు ఖాళీలున్నాయని వాటిని కూడా వెంటనే అర్హత కలిగిన వారితో పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## సంపాదించడం, పంచడమే మనసంస్కృతి

### సమాజానికి పనికి వచ్చే ఆలోచన విద్యార్థులు చేయాలి: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ఆదివారం విద్యార్థులకు డిగ్రీపట్టాలు అందజేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, దత్తాత్రేయ

**హైదరాబాద్ (బేగంపేట), ఆగస్టు 24,ప్రభాతవార్త:** భారతదేశ సంస్కృతి సంపాదించడం,పంచడం అన్నారు. దేవనార్ ద్వారా డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు సమాజానికి పనికి వచ్చే ఆలోచన చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపు నిచ్చారు. మరుగున పడిపోయిన భారతీయ అసలైన చరిత్రను తెలుసుకోవాలని, తద్వారా అప్పటి త్యాగమూర్తులైన వీరుల నుంచి స్పూర్తిని పొంది ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. బేగంపేట దేవనార్ అంధుల పాఠశాలలో ఆదివారం డాక్టర్ సాయిబాబాగౌడ్ ఇంగ్లీషులో రాసిన ఆయన ఆత్మకథ పుస్తకాన్ని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవనార్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు వెంకయ్యనాయుడు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాజీ విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్ వీ సుబ్రమణ్యం,సత్యవాణీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఇది ఎంతో మంచి కార్యక్రమమని, ఇందులో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సాయిబాబాగౌడ్ ఆటోబయోగ్రఫీ అందరికీ ఇన్స్పిరేషన్ కావాలన్నారు. సమాజానికి ఆయన అందించే సేవలు ఆదర్శం అన్నారు. సేవాభావం అనేది భారతీయుల స్వభావం అని అందరూ కూడా సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇతరులతో పంచుకోవా లన్నారు. ఆపరేషన్ సింధు దాడి కాదని ప్రతి చర్య మాత్రమేనన్నారు. దేవనార్ ఫౌండేషన్ ఛైర్మన్ డా.సాయిబాబాగౌడ్, జ్యోతిగౌడ్‌లు ఇష్టపడి అంధుల పాఠశాలను ప్రారంభించి సేవచేస్తున్నారని అన్నారు. భారత దేశంలో పుట్టిన వారు మాతృభాషను ప్రేమించాలని పేర్కొన్నారు. ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత మంచిదన్నారు. గుడ్ మార్నింగ్, గుడ్ ఆఫ్టర్‌నూన్, గుడ్‌ఈవెనింగ్, గుడ్‌నైట్ వద్దు. నమస్కారం అని పలుకరించడం భారతీయుల సంస్కారం అన్నారు. సేవ చేస్తే లభించే సంతృప్తి కంటే మరొకటి లేదన్నారు. ఆర్ఎస్ఎస్ ద్వారా తాను సేవాభావాన్ని నేర్చుకుని చేస్తున్నానన్నారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ దశబ్దాలుగా దేవనార్ వ్యవస్థాపకులు డా.సాయిబాబాగౌడ్, జ్యోతిగౌడ్‌లు తనకు పరిచయస్తులన్నారు. వారు చేస్తున్న సేవలను తాను ఎల్లప్పుడూ అభినందిస్తానన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు ప్రభుత్వ పనితీరుకు రిఫరెండమ్

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, ఆగస్టు 24,ప్రభాతవార్త:** స్థానిక సంస్థలు మా ప్రభుత్వ పనితీరుకు రెఫరెండం, కెటిఆర్ నీకు దమ్ము ఏమిటో స్థానిక సంస్థల ఎన్నికలలో గెలిచి చూపించు అని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ సవాల్ విసిరారు. సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ పార్టీ పిరాయింపులపైన కెటిఆర్ మాట్లాడటం అంటే వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్ళినట్లు ఉందని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు అత్యంత నిర్లజ్జగా పార్టీ ఫిరాయింపులు చేసిన కెటిఆర్ ఇప్పుడు దొంగ ఏడుపులు ఏడుస్తున్నాడనీ విమర్శించారు. పార్టీ మారిన ఎంఎల్ ఏలు రాజీనామా చేయాలని అడిగే నైతిక హక్కు కెటిఆర్‌కులేదఅన్నారు. పదేళ్ళలో 60మందికి ఎంఎల్‌ఏలు,ఎంఎల్సీ లను చేర్చుకున్నప్పుడు ఎందుకు రాజీనామా చేయించలేదు? అని నిలదీశారు. ఎందుకు పార్టీలకు పార్టీలను బిఆర్ఎస్ లో విలీనం చేసుకున్నావ్?ఆనాడు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా ఉప ఎన్నికలు వచ్చినా గెలిపించే దమ్ము మా సిఎం రేవంత్ రెడ్డికి ఉంది అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను రెఫరెండంగా మేము భావిస్తాం నీకు దమ్ము ధైర్యం ఉంటే ఛాలెంజ్ చేయి అని అన్నారు. భవిషత్‌లో నీకు,నీ అయ్యకు రాజకీయ సన్యాసం ఖాయం అని జోస్యం చెప్పారు.

పొలిమేర, రజాకార్ వంటి చిత్రాలతో జాతీయ స్థాయిలో కెమెరామెన్‌గా కుశేందర్ రమేష్ రెడ్డికి గుర్తింపు వచ్చింది. ఆయన సినిమాటోగ్రఫర్‌గా పని చేసిన 'త్రిబాణధారి బార్బరిక్' చిత్రం ఆగస్టు 29న రాబోతోంది. స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద విజయ్ పాల్ రెడ్డి అడిదెల నిర్మించిన 'త్రిబాణధారి బార్బరిక్' చిత్రానికి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. ఇప్పటికే టీజర్, ట్రైలర్‌లు మూవీపై అంచనాలు పెంచేశాయి. మరీ ముఖ్యంగా విజువల్స్ గురించి అందరూ మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో కుశేందర్ రమేష్ రెడ్డి ఈ మూవీకి సంబంధించిన విశేషాలను పంచుకున్నారు.

## 'త్రిబాణధారి బార్బరిక్' లాంటి కంటెంట్ బేస్డ్ చిత్రాలు చాలా అరుదుగా వస్తాయి

### ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కుశేందర్ రమేష్ రెడ్డి



**'త్రిబాణధారి బార్బరిక్'ప్రయాణం ఎలా మొదలైంది?** 'రజాకార్' చివరి షెడ్యూల్‌లో ఉన్నప్పుడు దర్శకుడు మోహన్ ఈ కథ గురించి చెప్పారు. కథ విన్న వెంటనే నాకు చాలా నచ్చింది. కథ విన్న తరువాత నా సలహాలు, సూచనలు చెప్పాను. ఎలాంటి కలర్ గ్రేడింగ్, ప్యాట్రన్ వాడితే బాగుంటుందనే రిఫరెన్సులు కూడా ఇచ్చాను. అవన్నీ కూడా మారుతికి చాలా నచ్చాయి. దీంతో దర్శకుడు మోహన్, నిర్మాత విజయ్, నేను కలిసి ఈ ప్రాజెక్ట్‌ని అలా మొదలు పెట్టాం. **'త్రిబాణధారి బార్బరిక్' చిత్రీకరణ సమయంలో ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి?** త్రిబాణధారి బార్బరిక్ మూవీ ఎక్కువగా రాత్రి పూట, రెయిన్ ఎఫెక్ట్స్‌లోనే షూటింగ్ చేశాం. వేసవి కాలంలో రెయిన్ సీజన్ ఎఫెక్ట్‌ను చూపించడం అంత సులభం కాదు. అదే మాకు పెద్ద ఛాలెంజింగ్. ఎండాకాలంలో వానాకాలాన్ని సృష్టించేందుకు చాలా కష్టపడాల్సి వచ్చింది. ఈ విషయంలో మాత్రం నిర్మాత విజయ్ డేరింగ్ స్టెప్ తీసుకున్నారు. కథ కోసం ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. మొదటి సినిమా అయినా కూడా కథ మీద నమ్మకంతో ఆయన భారీ బడ్జెట్‌ను పెట్టారు. **'త్రిబాణధారి బార్బరిక్'లో చిత్రంలోని ప్రత్యేకతలు ఏంటి?** త్రిబాణధారి బార్బరిక్ సినిమాలో ప్రతీ పాత్రకు ఓ ప్రత్యేకత ఉంటుంది. ఒక్కో పాత్రకు సపరేట్ కలర్ గ్రేడింగ్ వాడాము. ఒక్కో పాత్ర రూపాంతరం చెందుతున్న తీరుకి తగ్గట్టుగా కలర్ గ్రేడింగ్ మారుతుంది. ఇక రెయిన్ ఎఫెక్ట్ సీన్లను చూస్తే ఎంతో సహజంగా అనిపిస్తాయి. 'తుంబాడ్', 2018చిత్రాలకు ఏ మాత్రం తగ్గకుండా ఎంతో నేచురల్‌గా కనిపిస్తుంది. **త్రిబాణధారి బార్బరిక్'ప్రధాన బలం ఏంటి?** 'త్రిబాణధారి బార్బరిక్' మూవీకి ప్రధాన బలం కథ. స్క్రిప్ట్ విన్నప్పుడే ఈ మూవీని చేయాలని ఫిక్స్ అయ్యాను. 'పొలిమేర', 'రజాకార్' కథలు విన్నప్పుడు ఎలాంటి ఫీలింగ్ కలిగిందో ఈ మూవీ కథను విన్నప్పుడు కూడా అలాంటి ఫీలింగే కలిగింది. ప్రతీ పాత్రకు ఇంపార్టెన్స్ ఉంటుంది. క్లైమాక్స్‌ని ఎవ్వరూ ఊహించలేరు. **'త్రిబాణధారి బార్బరిక్' చిత్రంలోని ఆర్టిస్టులతో వర్కింగ్ ఎక్స్‌పీరియెన్స్ గురించి చెప్పండి?** త్రిబాణధారి బార్బరిక్‌చిత్రంలో ఉదయ భాను పాత్ర చాలా పవర్ ఫుల్‌గా ఉంటుంది. చాలా ఏళ్ల తరువాత మళ్లీ ఉదయ భాను ఓ అద్భుతమైన పాత్రలో ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. ఈ చిత్రంలో వశిష్టని సరికొత్తగా చూస్తారు. 'బాహుబలి'కి పని చేసినప్పటి నుంచి నాకు సత్య రాజ్‌తో పరిచయం ఉంది. ఆయన ఎప్పుడూ కూడా సెట్స్‌కి ఆన్ టైంలో వస్తుంటారు. నైట్ షూట్స్, రెయిన్ ఎఫెక్ట్ సీన్లంటూ మేం ఆయన్ను చాలా ఇబ్బంది పెట్టాం. **'త్రిబాణధారి బార్బరిక్' పట్ల సంతృప్తిగా ఉన్నారా?** 'త్రిబాణధారి బార్బరిక్' కథ విన్నప్పుడు నేను ఎలా ఊహించుకున్నానో అలానే తీయగలిగాను. అందులో నాకు ఫ్రీడం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. ఖర్చుకి వెనుకాడకుండా నిర్మించారు. ఆయన ప్రతీ రోజూ సెట్స్‌కు వస్తుండేవారు. కథను నమ్మాను.. సినిమా బాగా రావాలి అని నిత్యం అంటుండే వారు. అలాంటి ప్రొడ్యూసర్ ఉండటం వల్లే ఈ మూవీని అనుకున్నట్టుగా, విజువలైజ్ చేసుకున్నట్టుగా తీయగలిగాను.

# 30న దుబాయ్‌లో గామా అవార్డులు

### - గామా సిఇఒ సౌరబ్ కేసరి




**ప్రతిష్టాత్మమైన గామా** అవార్డ్స్‌కు టాలీవుడ్‌లో స్పెషల్ క్రేజ్ ఉంది. దుబాయ్‌లో ఇప్పటికే నాలుగు ఎడిషన్లు అంగరంగ వైభవంగా జరిగాయి. ఇప్పుడు 5వ ఎడిషన్ వేడుకలు ఆగస్టు 30న దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో గ్రాండ్‌గా జరగనుంది. ఈ అవార్డ్స్ కార్యక్రమానికి టైటిల్స్ స్పాన్సర్‌గా వైభవ్ జ్యువెలర్స్ సంస్థ వ్యవహరిస్తోంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గామా సిఇఒ సౌరబ్ కేసరి, వైభవ్ జ్యువెలర్స్ ఎండి రాఘవ్, జ్యూరీ సభ్యులు, ప్రముఖ దర్శకులు ఏ. కోదండరామి రెడ్డి, బి గోపాల్, హీరోయిన్స్ ఫరియా అబ్దుల్లా, మానస వారణాసి, దక్షా నాగర్కర్, నటుడు వైవా హర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా గామా సిఇఒ సౌరబ్ కేసరి మాట్లాడుతూ.. "ఇది కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న ఈవెంట్ కాదు. మా నాన్న (త్రిమూర్తులు) గారికి కళాకారులపై ఉన్న అభిమానంతో గామా అవార్డ్స్ నిర్వహిస్తున్నాం. వచ్చే ఏడాది మరింత గ్రాండ్‌గా అవార్డ్స్ ఇచ్చేలా ప్లాన్ చేస్తున్నాం. అలాగే ఇతర దేశాల్లోను గామా అవార్డ్స్ ఇచ్చేలా సన్నాహాలు చేస్తున్నాం. దుబాయ్‌లో ఉన్న తెలుగు వారితోపాటు ప్రపంచంలోని తెలుగు వారందరినీ అబ్బురపరిచేలా ఈవెంట్‌ను నిర్వహించబోతున్నాం. మా జ్యూరీ సభ్యుల సహకారంతో అవార్డు విజేతలను ఎంపిక చేశాం అని అన్నారు.

జ్యూరీ సభ్యులు, ప్రముఖ దర్శకులు ఏ కోదండ రామిరెడ్డి మాట్లాడుతూ, "నేను, బి గోపాల్, కోటి సహా పలువురు ప్రముఖులు కూడా జ్యూరీ సభ్యులుగా వ్యవహరిస్తున్నాం. ఆగస్టు 30న దుబాయ్‌లో జరగనున్న ఈ గామా అవార్డ్స్ విజయవంతం అవ్వాలని కోరుకుంటున్నా అని అన్నారు.

జ్యూరీ సభ్యులు, ప్రముఖ దర్శకులు బి గోపాల్ గారు మాట్లాడుతూ, 'గామా అవార్డ్స్ చైర్మన్ త్రిమూర్తులు ఈ అవార్డ్ ఫంక్షన్‌ను ప్రతి ఏడాది చాలా గ్రాండ్‌గా నిర్వహిస్తున్నారు. అతిరథ మహారథుల సమక్షంలో హీరోయిన్స్ అద్భుతమైన పర్ఫార్మెన్స్‌లతో ఈ ఈవెంట్ జరగనుంది" అని చెప్పారు. గామా అవార్డ్స్ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న వైభవ్ జ్యువెలర్స్ ఎండి రాఘవ్ మాట్లాడుతూ,'ఇలాంటి ప్రతిష్టాత్మక అవార్డ్స్‌లో భాగమవడం సంతోషంగా ఉంది అన్నారు. హీరోయిన్ ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ, గతేడాది జరిగిన ఫోర్త్ ఎడిషన్ గామా అవార్డ్స్‌లో స్పెషల్ పెర్ఫార్మెన్స్ చేశాను. ఈసారికూడా స్పెషల్ పెర్ఫార్మెన్స్‌తో అలరించబోతున్నా అని చెప్పారు. హీరోయిన్ మానస వారణాసి మొదటిసారి గామా అవార్డ్స్‌లో స్పెషల్ పెర్ఫార్మెన్స్ చేయబోతున్నానని చెప్పారు. ఈ వేడుకలో పాలుపంచుకోవడం చాలా ఆనందంగా ఉందని హీరోయిన్ దక్షా నాగర్కర్ అన్నారు.గామా అవార్డ్స్‌లో యాంకర్ సుమతో పాటు వ్యాఖ్యాతగా వ్యవహరించనున్న నటుడు వైవా హర్ష మాట్లాడుతూ, "సుమతో వ్యాఖ్యాతగా వ్యవహరించడం చాలా ఎక్సైటింగ్‌గా ఉంది.ఈ వేడుక చాలా ఎంటర్టైనింగ్ గా జరగబోతుంది" అని చెప్పారు. ఇప్పటికే దుబాయ్‌లో లాంచ్ చేసిన గామా 5వ ఎడిషన్‌కు సంబంధించి థీమ్ సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ ఈ పాటకు అద్భుతమైన ఆకట్టుకునే సాహిత్యం అందించారు. రఘు కుంచె సాంగ్ కంపోజ్ చేయడంతో పాటు తానే స్వయంగా పాడిన తీరు అందరినీ అలరించింది. ఆగస్టు 30న టాలీవుడ్ అవార్డ్స్‌తో పాటు ఆగస్టు 29న ఎక్సలెన్స్ అవార్డ్స్ వేడుకను నిర్వహించేలా భారీ సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి టాలీవుడ్ హీరోలు సిద్దు జొన్నలగడ్డ, తేజ సజ్జ, కిరణ్ అబ్బవరం, శ్రీవిష్ణు, రోషన్, హీరోయిన్స్ మీనాక్షి చౌదరి, దక్ష నాగర్కర్‌తో పాటు తెలుగు చలనచిత్ర పరిశ్రమ నుంచి అగ్ర కథానాయ కులు, టాప్ టెక్నీషియన్స్ పాల్గొనబోతున్నారు. ప్రత్యేక అతిథులుగా బ్రహ్మానందం, దర్శ కులు సుకు మార్, బుచ్చిబాబు, బాబీ, సాయి రాజేష్, సంగీత దర్శకులు దేవిశ్రీప్రసాద్, నిర్మాతలు అశ్విని దత్, డివివి దానయ్య, చంద్రబోస్,వెన్నెల కిషోర్ తదితర ప్రము ఖులు హాజరవనున్నారు. 2024లోవిడుదలైన చిత్రాల్లో నామినేట్ అయిన విభాగాలకు జ్యూరీ సభ్యుల ద్వారా అవార్డులను అందుకోనున్నారు.




## 'జటాధర' నుంచి దివ్య ఖోస్లా ఫస్ట్ లుక్ రిలీజ్



**నవ దళపతి సుధీర్ బాబు,** బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ అందించే ఈ పాన్‌ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. హైఆక్టేన్ విజువల్స్, పౌరాణిక ఇతివృత్తాలతో ఈ చిత్రం గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతుంది. ఇటీవల రిలీజ్ అయిన టీజర్ నేషనల్ వైడ్‌గా వైరల్ అయ్యింది. ఈ రోజు మేకర్స్ సితారగా దివ్య ఖోస్లాను పరిచయం చేశారు. బ్యూటీఫుల్ అండ్ క్లాసిక్‌గా కనిపించిన దివ్యఖోస్లా ఫస్ట్‌లుక్ అదిరిపోయింది. జీ స్టూడియోస్, ప్రేర్ణా అరోరా ప్రెజెంట్ చేస్తున్న ఈ సినిమాను ఉమేష్‌కుమార్ బన్సాల్, ప్రేర్ణా అరోరా ప్రొడ్యూస్ చేస్తున్నారు.విజనరీ టీమ్, జానర్ బౌండరీలు చెరిపేసే కాన్సెప్ట్‌తో, 'జటాధర' ఈ ఏడాది మోస్ట్ అవైటెడ్ థియేట్రికల్ రిలీజ్‌లలో ఒకటిగా వస్తోంది. దేశవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ ప్లాన్ చేస్తున్న 'జటాధర' ఇండియా సినిమాలో నెక్స్ట్ మైథాలజికల్ ఎపిక్‌గా మారబోతోంది.

## 'సుందరకాండ' బ్యూటీఫుల్ సాంగ్ విడుదల



**హీరో నారా రోహిత్** మైల్ స్టోన్ 20వ మూవీ 'సుందరకాండ'. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ (ఎస్‌పిపి) బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. ఇప్పటికే టీజర్, ట్రైలర్, పాటలు స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఈ రోజు మేకర్స్ ఈ సినిమా నుండి డియర్ ఐరా సాంగ్ ని రిలీజ్ చేశారు. లియాన్ జేమ్స్ డియర్ ఐరా ని బ్యూటీ ఫుల్ లవ్ సాంగ్ గా కంపోజ్ చేశారు. శ్రీ హర్ష ఈమని రాసిన లిరిక్స్ లీడ్ పెయిర్ ఎమోషన్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేశాయి. లియోన్ జేమ్స్, కీర్తన వైద్యనాథన్ వోకల్స్ సాంగ్‌ని మరింత లవ్లీగా మార్చాయి. ఈ సాంగ్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా వుంది. ఆగస్ట్ 27న ఈ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. తారాగణం: నారా రోహిత్, వృతి వాఘాని, శ్రీదేవి విజయ్ కుమార్, నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్, సత్య, అజయ్, వీటీవీ గణేష్, అభినవ్ గోమటం, విశ్వంత్, రూప లక్ష్మి, సునైనా, రఘు బాబు.

## 'నేను రెడీ'నుంచి హీరోయిన్ కావ్య థాపర్ బర్త్ డే పోస్టర్



**నువ్విలా,** జీనియస్, రామ్ లీలా, సెవెన్ వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ టాలెంటెడ్ హీరో హవీష్, సినిమా చూపిస్తా మావ, నేను లోకల్, ధమాకా, మజాక వంటి సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు నక్కిన త్రినాథరావు కాంబోలో రూపొందుతున్న క్రేజీ మూవీ 'నేను రెడీ'. ఈ చిత్రాన్ని హార్నిక్స్ ఇండియా ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. కావ్యథాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. బ్రిలియంట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కుతున్న 'నేను రెడీ' మూవీ నుంచి ఇటీవల రిలీజ్ చేసిన హీరోయిన్ కావ్య థాపర్ బర్త్ డే పోస్టర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రంలో ఆమె క్యారెక్టర్ ప్రేక్షకుల్ని ఆకట్టుకోనుంది. 'నేను రెడీ' మూవీ తన కెరీర్‌లో ది బెస్ట్‌గా నిలుస్తుందని ఆశిస్తోంది కావ్య థాపర్. ప్రస్తుతం 'నేను రెడీ' సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ మూవీకి మంచి ఔట్ పుట్ వస్తోంది. ఇటీవల రిలీజ్ చేసిన 'నేను రెడీ' టైటిల్ గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో మరింత కాన్ఫిడెంట్‌గా చిత్రీకరణ జరుపుతున్నారు.

## 26న 'ది గర్ల్ ఫ్రెండ్' నుంచి లిరికల్ సాంగ్ రిలీజ్




**నేషనల్ క్రష్** రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా "ది గర్ల్ ఫ్రెండ్". ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. ఈ రోజు 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా నుంచి సెకండ్ సింగిల్ అనౌన్స్ చేశారు. 'ఏం జరుగుతోంది...' లిరికల్ సాంగ్ ను ఈ నెల 26న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ పాటకు రాకేందు మౌళి సాహిత్యాన్ని అందించగా, చిన్మయి పాడారు. ఫీల్ గుడ్ లవ్ సాంగ్‌గా 'ఏం జరుగుతోంది...' రూపొందించారు. "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్ త్వరలోనే అనౌన్స్ చేయబోతున్నారు.



## భారీ పాన్‌ఇండియా ఎంటర్‌టైనర్ 'కట్టలన్' గ్రాండ్ లాంచ్

**క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్** మాస్ యాక్షన్ థ్రిల్లర్ మార్కో పాన్ ఇండియా హిట్ అయ్యింది. ఇప్పుడు అదే బ్యానర్‌పై ప్రొడ్యూసర్ షరీఫ్ మహమ్మద్ మరో భారీ ప్రాజెక్ట్ కట్టలన్‌ను లాంచ్ చేశారు. మలయాళం, తెలుగు భాషల్లో పాన్ ఇండియా ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ మూవీ పూజా కార్యక్రమం కొచ్చిలో అద్భుతంగా జరిగింది.

బాహుబలిలో కనిపించి ఫేమస్ అయిన చిరక్కల్ కలీదాసన్ ఏనుగు పూజా కార్యక్రమంలో కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లగ్జరీ కార్లు, బైక్‌లు కూడా ఈవెంట్‌ను మరింత స్పెషల్ చేశాయి. సినిమాలోని కథలైన్‌ను దృష్టిలో పెట్టుకుని పూజా ప్రెజెంటేషన్ కూడా డిజైన్ చేశారు. ఈవెంట్‌లో యాంటోని వర్గీస్, కబీర్ దూహన్ సింగ్, రాజిషా విజయన్, హనన్ షా, జగదీష్, సిద్దిక్, పార్థ్ తివారీ లాంటి స్టార్‌లు హాజరై గ్లామర్‌ని మరింత పెంచారు. సుమారు 45 కోట్లు బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ పాన్‌ఇండియన్ యాక్షన్ థ్రిల్లర్ టైటిల్ పోస్టర్ ఇప్పటికే వైరల్ అయ్యింది. డెబ్యూ డైరెక్టర్ పాల్ జార్జ్ దర్శకత్వం వహిస్తుండగా, కాంతార, మహారాజా సినిమాలతో సౌత్‌లో సంచలనం సృష్టించిన కన్నడ మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. 'మార్కో'కోసం కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్‌ని తీసుకొచ్చిన క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఇప్పుడు మరో బిగ్ కంపోజర్‌ని పరిచయం చేస్తోంది.

టైటిల్ డిజైన్ కోసం జలర్, లియో, జవాన్, కూలీ సినిమాలకు పనిచేసిన ఐడెంట్ లాబ్స్‌ని తీసుకున్నారు. హీరోయిన్‌గా రాజిషా విజయన్ నటించనున్నారు. నటీనటుల్లో తెలుగు నటుడు సునీల్, 'మార్కో'తో మలయాళంలో పాపులర్ అయిన కబీర్ దూహన్ సింగ్, వ్లాగర్‌సింగర్ హనన్ షా, ర్యాపర్ బేబీ జీన్, తెలుగు నటుడు రాజ్ తిరందాసు, అలాగే సీనియర్ నటులు జగదీష్, సిద్దిక్‌లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పొన్నియన్ సెల్వన్ 1,బాహుబలి2, జవాన్, బాఘీ2 వంటి సినిమాల్లో యాక్షన్ సీక్వెన్స్‌లు డిజైన్ చేసిన వరల్డ్ ఫేమస్ ఫైట్ మాస్టర్ కేచా ఖాంఫక్డీ ఈ సినిమాలో కూడా స్టంట్స్ కంపోజ్ చేస్తున్నారు. డైలాగ్స్ ఉన్నీ ఆర్. ఎడిటర్ షమీర్ మహమ్మద్, ప్రొడక్షన్ కంట్రోలర్ దీపక్ పరమేశ్వరన్. త్వరలో సినిమా కాస్ట్ క్రూ మరిన్ని అప్‌డేట్స్ రివిల్ చేయనున్నారు.

## 'సుందరకాండ' ఫ్యామిలీతో కలసి ఎంజాయ్ చేసే క్లీన్ ఎంటర్‌టైనర్

### డైరెక్టర్ వెంకటేష్ నిమ్మలపూడి



**హీరో నారా రోహిత్** మైల్ స్టోన్ 20వ మూవీ 'సుందరకాండ'. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ (ఎస్‌పిపి) బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. వృతి వాఘాని, శ్రీదేవి విజయ్‌కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. టీజర్, పాటలు, ట్రైలర్ స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఈ సినిమా ఆగస్టు 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**సుందరకాండ ఐడియా ఎలా జనరేట్ అయింది?** నాకు ఫ్యామిలీ కథలు ఇష్టం. కలిసుందాం రా నా ఫేవరెట్ సినిమా. అలాంటి ఒక క్యూట్ ఫ్యామిలీ స్టోరీ చేయాలని ఉండేది. రోహిత్‌తో నాకు ఎనిమిదేళ్ల జర్నీ వుంది. నా ఫస్ట్ సినిమాని క్యూట్ ఫ్యామిలీ లవ్ స్టోరీగా చేద్దాం అనుకున్నాను. అప్పుడు ఈ ఆలోచన వచ్చింది. రోహిత్‌కి చెప్పాను. కథ రాసి పంపించాను. ఆయన చదివి ఇంప్రెస్ అయ్యారు. అలా ప్రాజెక్టు మొదలైంది. **హీరో క్యారెక్టర్ రాయడానికి ఏదైనా ఇన్స్పిరేషన్ ఉందా?** అందరి ఇన్స్పిరేషన్ ఉంది. 30 దాటాక పెళ్లి కాకపోవడమే పెద్ద పంచాయతీ అనుకుంటే, ప్రత్యేకమైన క్వాలిటీలు వెతుక్కోనే పర్సన్ ఉంటే ఎలా ఉంటుంది, వాళ్ళ ఇంట్లో పరిస్థితి ఎలా ఉంటుందనేదనే ఆలోచన నుంచి వచ్చింది. **మీరు ఇండస్ట్రీలో ఎవరి దగ్గరైనా వర్క్ చేశారా?** పవన్ సాధినేని దగ్గర ఒక వెబ్ సిరీస్ చేశాను. సాగర్‌కే చంద్ర, పల్నాటి సూర్య ప్రతాప్. దగ్గర రైటింగ్‌లో చేశాను. వీర భోగ వసంతరాయులు సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్‌గాపని చేశాను. అలాగే నేల టికెట్ సినిమాకి అప్రెంటిస్‌గా చేశాను. **సుందరకాండ టైటిల్ గురించి చెప్పండి? దీనికి రామాయణంతో లింక్ ఉందా?** రామాయణంలో హనుమంతుడు సీతమ్మ వారి దగ్గరికి వెళ్లి రాముల వారిచ్చిన ఉంగరాన్ని చూపించే ఘట్టం సుందరకాండ. అదొక సెలబ్రేషన్. అయితే సెలబ్రేషన్‌కి ముందు ఎన్నో సవాళ్లు వున్నాయి. హనుమంతులవారు ఎన్నో ఎఫర్ట్స్ పెట్టారు. అలా మా హీరో కూడా ఒక విషయాన్ని ఎచీవ్ చేయాలనుకుంటారు. దానికి ఆయన పెట్టే ఎఫెర్ట్స్ ఎమిటనేది కథ. అలా సుందరకాండ అనే టైటిల్ పెట్టడం జరిగింది. ఇది పాజిటివ్ టైటిల్. రామాయణం నాకు చాలా ఇష్టం. ఆ టైటిల్ కూడా అలా కలిసి రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. రోహిత్‌తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?నేను రోహిత్‌తోనే ఎనిమిదేళ్లుగా ట్రావెల్ చేస్తున్నాను. ఈ స్క్రిప్ట్ బిగినింగ్ నుంచి చివరి వరకు ఆయన సపోర్ట్ వుంది. మేము ఒక ఫ్యామిలీలానే వుంటాం. **ఈ సినిమా కోసం శ్రీదేవి విజయ్‌కుమార్‌ని ఎంపిక చేయడానికి కారణం?** రెండు డిఫరెంట్ ఏజ్ గ్రూపున్న లవ్ స్టోరీ ఇది. రోహిత్ కంటే ఏజ్‌గా కనిపించాలి అదే సమయంలో బ్యూటిఫుల్‌గా ఉండాలి. అలాంటి అమ్మాయి కోసం వెతుకుతున్నప్పుడు శ్రీదేవి విజయ్‌కుమార్‌ని అనుకున్నాను. శ్రీదేవి రోహిత్‌కి తెలుసు. అయితే ఆమెని ఈ క్యారెక్టర్‌లో ఒప్పించే బాధ్యత మాత్రం రోహిత్ నా మీద పెట్టారు. నేను వెళ్లి కథ చెప్పాను. కథ నచ్చి వెంటనే ఓకే చేశారు. ఈ సినిమా కోసం ఆవిడ చాలా ఎఫర్ట్ పెట్టారు. స్కూల్ అమ్మాయిగా కనిపించడానికి డైట్ కూడా చేశారు. వృతి వాఘాని క్యారెక్టర్‌కి కూడా చాలా మంచి పేరు వస్తుంది. ఆమె స్క్రీన్ ప్రజెన్స్ చాలా బ్యూటిఫుల్‌గా ఉంటుంది. ఈ సినిమాలో నరేష్ చాలా అద్భుతంగా నటించారు. అలాగే సునైనా, వాసుకిపాత్రలు కూడా చాలా బాగుంటాయి. అందరూ చాలా కాంట్రిబ్యూట్ చేశారు. ఒక న్యూ ఫిలిం మేకర్‌కి చాలా సపోర్ట్ చేశారు. ఈరోజుల్లో కామెడీ పండించడం చాలా కష్టం.. **మ్యూజిక్ గురించి?** లియోన్ జేమ్స్ చాలా అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. మ్యూజిక్ పట్ల నేను చాలా హ్యాపీగా ఉన్నాను.

ఒర్పు సహనం ,నేర్పు ప్రజ్ఞ పర్యాయ పదాలు. .ఏ పని చేయాలన్న ఒర్పు చాలా అవసరం.సహనంతో ఏదైనా సాధించ వచ్చు. ఈ రెండు ఉన్నవారే కాలక్రమంలో నేర్పరులు కాగలరు.



జీవితంలో నేర్పు సంపాదించడానికి ఒర్పు ఎంత అవసరమో, వ్యాపార వాణిజ్య రంగంలో విజేతలుగా ఎదగడానికి ఒర్పు అంతే అవసరం.వీటితో పాటుగా లౌకిక జ్ఞానం పెంచుకోవడం కొరకు సమయనుకూలగంగా వ్యవహరించే సమయస్ఫూర్తి కూడా అవసరం. పురుషులతో సమానంగా స్త్రీలు చదువు ,ఉద్యోగాలు సంపాదనలోనూ సమాన హోదాపొందుతున్నారు. అలాగే వ్యాపార రంగంలో కూడా ఈ నాడు స్త్రీలు పోటీపడి అనేక వ్యాపారాలను నిర్వహిస్తున్నారు శభాష్ అనిపించుకుటున్నారు. ఉద్యోగినులైన, వ్యాపార రంగంలో ఉన్న తమ తాహతకు విజ్ఞతకు తగిన విధంగా ఏదైనా వ్యాపారం ప్రారంభించినా మహిళలు... కొంత కష్టాలలో పాలుపంచుకునే మనస్తత్వాన్ని అలవర్చుకుంటే ,మీ ఉద్యోగులు తమ వంతుగా నిస్వార్థంగా వ్యాపార నిర్వహణకు

# ఓర్పు..సహనం..నేర్పు..ప్రజ్ఞ

నేర్పు ఒర్పు కూడా అలవర్చుకోవాలి. వ్యాపారం నిర్వహించే వారికి ముఖ్యంగా కావలసినవి..పనిలో కొత్తదనం చూపుతూ ముందుకు సాగిపోవాలి. అంటే ఇతరులకంటే భిన్నంగా అందరికి అందుబాటులో ఉండేలా మీ వ్యాపారము ఉండాలి.అలాగే కస్టమర్ తో మాట్లాడేటప్పుడు మీ శారీరక భాష దానినే బాడీ లాంగ్వేజ్ అంటారు ,హావభావాలు ఎదుటివారికి మంచి అభిప్రాయాన్ని కలుగ చేయాలి.మీ కదలికల్లో హుందాతనం ఉండాలి.కస్టమర్ ఆగ్రహించిన చిరునవ్వుతో సమాధానం చెప్పగలగాలి.ఏ అవకాశాన్ని జార విడుచుకున్న ఎదుటి వారికి అది అవకాశంగా మారుతుంది. కనుక ఎప్పటికప్పుడు పనులు చేసుకుంటూ వెళ్ళాలి తప్ప వాయిదా వేసే మనస్తత్వం అస్సలు ఉంచకూడదు.ఓటమి ఎదురైన , నిరాశతో కుంగి పోకుండ కసితో పట్టుదలతో పనులు చేయాలి. అపజయాలను పాఠాలుగా నేర్చుకుని జాగ్రత్తగా భవిష్యత్తు నిర్దేశించుకోవాలి. గిరాకీ పెంచుకోవాలంటే మార్కెట్లో ప్రతి క్షణం సర్వే చేస్తూ ఉండాలి.అవసరమైతే శిక్షణ తీసుకోవడంలో వెనుకాడవద్దు. మీ దగ్గర పని చేస్తున్న సిబ్బందికి సౌకర్యాలు కలుగ చేసి, వారి తోడ్పడతారు, అది వారి బాధ్యతగా భావిస్తారు.వ్యాపారంలో పొగడ్తలు సహజం. ఎదుటివారు పొగిడారుకదా అని పొంగి పోకూడదు.మరింత జగ్రత్తగా ఉండాలి.ఇతరులు ప్రతికూల విమర్శలు చేస్తుంటారు. ఆ విమర్శలకు నిరుత్సాహపడకూడదు. మొక్కవోని ధైర్యంతో మీ పనులు చేసుకోవాలి ఎన్ని అవాంతరాలు వచ్చినా వ్యాపారం మీద పట్టు కోల్పోకూడదు. కొందరు గుర్తింపు కోసం తాపత్రయ పడుతుంటారు. ఆ తాపత్రయాన్ని పక్కన పెట్టేసి,మీ వంతు పనిని సమర్థతగా చేసుకుంటూ వెళితే, ఆదరణ గుర్తింపు వాటంతట అవే వస్తాయి. నాణ్యత, నమ్మకాలే పెట్టుబడిగా ఉంటూ, పోటీని తట్టుకోవచ్చు. మార్కెటింగ్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అదే సమయంలో తప్పొప్పులను బేరీజు వేసుకుంటూ ప్రతి అంశాన్ని సానుకూల దృక్పథంతో చూడటం అలవర్చుకుంటేవ్యాపార రంగంలో విజేతగా నిలబడతారు.వీటి అన్నింటితో పాటుగా మంచి మాట, చాకచక్యంగా ఉండటం ఎంతో అవసరం.మరి ఈ అంశాలను పాటిస్తూ వ్యాపారరంగం లో తమకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకోవాలని ఆకాంక్షి స్తూ....

- పాలపర్తి సంధ్యారాణి

# ఫోరెన్సిక్ నిపుణురాలిగా ఆర్మీలో సేవలు


**ఎక్కడైనా ఓ ప్రమాదం జరిగిందా...? హత్యో, ఆత్మహత్యో చోటుచేసుకుందా?... ఎన్నెన్నో ఊహాగానాలు, మరెన్నో అనుమానాలు... అక్కడ ఫోరెన్సిక్ నిపుణుల రంగంలోకి అసలు నిజాలు బయటకు వస్తాయి. అప్పుడు హత్య... ఆత్మహత్యగా, ప్రమాదం కాస్తా హత్యగానూ మారొచ్చు. ఇంతటి కీలకమైన రాణిస్తున్నారు డాక్టర్ మేజర్ కారుణ్య**

చిన్నప్పటి నుంచీ చేసే పనిలో వైవిధ్యం ఉండాలని కోరుకునేదాన్ని. అందుకు తగ్గట్లుగానే కెరియర్ని ఎంచుకోవచ్చు. మాది హైదరాబాద్. నాన్న జాన్ శామ్యూల్ ప్రిన్సిపల్గా పనిచేసేవారు. అమ్మ మీరా ఓ ప్రైవేట్ పాఠశాలను నిర్వహించేవారు. ఇద్దరికీ సేవాభావం ఎక్కువ. పేద విద్యార్థులందరికో ఉచితంగా చదువు చెప్పించారు. వాళ్ల స్ఫూర్తితోనే సైన్యంలోకి వెళ్లాలనుకున్నా. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్లలోని ఎంబీ మెడికల్ సెంటర్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేశాక ఆర్మీలో వైద్యురాలుగా చేరారు.



అనుభవాలన్నీ ప్రత్యేకమే..

నాకు సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలనేది. దాంతో ఆ ప్రవేశ పరీక్షలన్నీ రాసేదాన్ని. 2017 జూన్‌లో సైన్యంలో కెప్టెన్‌గా చేరా. మొదట పుణెలో నేషనల్ డిఫెన్స్ అకాడమీలో ఉద్యోగం తర్వాత అసోం, అరుణాల ప్రదేశ్ రాష్ట్రాల్లో చైనా సరిహద్దుల్లో విధులు నిర్వర్తించా. ఈ అనుభవాలన్నీ ప్రత్యేకమే. వైద్య సాయం అందించడానికి ప్రయాణం మొదలు పెడితే... ఒక్కోసారి నాలుగైదు దూరంలో చేరుకోవడానికీ రెండు మూడు రోజులు పట్టొచ్చు. గడ్డకట్టే చలిలో ఎత్తైన కొండలు ఎక్కాలి. క్రిటికల్ కేసులయితే అంత మంచులోనూ వారిని ఆసుపత్రికి తరలించాలి. ఇలా చాలా విధులు సాధారణంగా ఉంటాయి. కాకపోతే అవన్నీ ప్రత్యేకమే. హిమాలయాలతోపాటు అనేక క్లిష్టమైన పర్వతాలు ఎక్కా నాలుగేళ్లపాటు సేవలందించాక మేజర్గా పదోన్నతి అందుకున్నారు. తర్వాత ఫోరెన్సిక్ మెడిసిన్లో పీజీ చేయాలనే ఆలోచనతో మళ్లీ పుస్తకాలతో కుస్తీ పట్టా. స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసి... ఆదిలాబాద్ రిమ్స్ వైద్య కళాశాలలో నేర నిర్ధరణలో కీలకమైన ఫోరెన్సిక్ విభాగంలో చేరారు. ప్రస్తుతం జూడా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గానూ కొనసాగుతోంది. ఎన్నెన్నో అనుభవాలు.. సాధారణంగా ఎవరికైనా చావు అన్నా, మృతదేహం అంటే తెలియని భయం ఉంటుంది. నాకూ ఒకప్పుడు అలానే ఉండేది. అయితే, ఎంబీబీఎస్ కడావర్ (మృతదేహం)కి పరీక్షలు నిర్వహించడంతో శవాలంటే భయం పోయింది. నిజానికి చాలా సందర్భాలలో మృతదేహాలను గుర్తించలేము వారి కుటుంబాలకు చివరి చూపు కూడా దక్కని పరిస్థితి. మరణించింది. ఎవరు? ఆడా? మగా... వయసెం?



కారుణ్య

హత్యా, ప్రమాదమా... వంటి అనేక సందేహాలకు ఫోరెన్సిక్ పరీక్ష ద్వారా సమాధానం లభిస్తుంది. ఆ కుటుంబాలకు ఊరట దక్కుతుంది. ఆ మధ్య ఓ వ్యక్తిని ఖననం చేశాక.. అది హత్యే అన్న ఆరోపణలు వచ్చాయి. దాంతో తిరిగ ఆ ఆడీ వెలికితీశారు. అప్పుడు దాన్ని పరిశోధించి.. అది ఆత్మహత్య అనే ఆధారాలను అందించా. గొంతు కోయడం వల్ల రక్తస్రావమై మరనం ఎలా సంభవిస్తుంది? ఎంతవరకు గొంతు కొసుకుంటే మృతి చెందుతారు అనే కోణంలో చేసిన పరిశోధన పత్రాలను గతేడాది జాతీయ స్థాయిలో జరిగిన సదస్సులో ప్రదర్శించి, రెండో స్థానం సాధించా. తాజాగా వరంగల్ కాకతీయ వైద్య కళాశాలలో జరిగిన తెలంగాణ ఫోరెన్సిక్ మెడిసిన్ అకాడమీ రాష్ట్రస్థాయి సదస్సులో మూడో బహుమతి అందుకున్నా.

# అది మర్చిపోవడం కాదు ..




'ఫ్రెండ్ బర్త్‌డే' ఈ నెలే కానీ.. తేదీ ఎప్పుడు? అని ఫేస్‌బుక్‌లో వెతికేయడం! చిన్న లెక్కకీ మెదడు తికమకపడిపోయి కాల్క్యులేటర్‌పై ఆధారపడటం. బాగా ఇష్టమైన సినిమా.. ఆస్వాదించే వంటకం.. మెచ్చిన పాట, నటుడు.. పేర్లు గుర్తుకు తెచ్చుకోవడానికి నానా తిప్పలు పడటం! చివరకు గూగుల్‌లో వెతికి.. అబ్బా.. ఎంత ఆలోచించినా తట్టలేదు అనుకోవడం. ఎప్పుడోకప్పుడు అందరికీ ఎదురయ్యేవే! కానీ తరచుగా జరుగుతోంటేనే డిజిటల్ డిమెన్షియా అయ్యుండొచ్చు అంటున్నారు నిపుణులు. పిల్లలు స్కూలుకి వెళ్లారు. కాస్త సేదతీరుదామనో.. ఆఫీసు పని కోసమనో అస్తమానం 'తెర'కే అతుక్కుపోతోంటే దీని బారిన పడటం ఖాయం. కొన్నిసార్లు ఆలోచించడానికి బద్ధకించి ప్రతిదానికీ ఫోన్ తీయడం వల్ల కూడా మెదడు వేగంగా స్పందించడం, చకచకా జ్ఞాపకాలను వెతికేయడం వంటివి ఆపేస్తుంది. ఫలితమే ఈ మర్చిపోవడమనే సమస్య. చిన్నదే అని పక్కన పెట్టేస్తే.. దీర్ఘకాలంలో మానసిక సమస్యలకు గురికావాల్సి వస్తుంది. కాబట్టి, స్క్రీన్ వాడకాన్ని తగ్గించుకోండి. ఆఫీసులో అయినా సరే.. అస్తమానం కుర్చీకే పరిమితంకాక గంటకోసారి అయినా లేచి అలా నాలుగు అడుగులు వేయండి. వ్యాయామం సంగతేంటి? ఇంట్లో పని ఎక్సర్‌సైజ్‌కి ప్రత్యామ్నాయం కాదు. వారానికి 5 గంటలు వ్యాయామానికి కేటాయించాలినసందే. ఇది శరీరానికే కాదు మెదడునీ దృఢంగా, ఉత్సాహంగా మారుస్తుంది. ధ్యానానికీ అందులో చోటివ్వాలి. ఇక నిద్రకి ఉండే మ్యాజిక్కే వేరు. మెదడుకీ, శరీరానికీ విశ్రాంతినివ్వడమే కాదు జ్ఞాపకాలను జాగ్రత్తగా పొందుపరుస్తుంది. కాబట్టి, దానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిందే. అమ్మాయిలు.. మీకేం మల్టీ టాస్కింగ్ సులువుగా చేసెయ్యగలరు. అంటే పొగడ్తలా తీసుకుని పనులన్నీ నెత్తిన వేసుకునేరు! ఒక సమయంలో ఒక పనినే చేయండి. మెదడుకు కాస్త భారం తగ్గుతుంది. ఏకాగ్రతా కుదురుతుంది. చివరగా ఫోన్ అయినా.. కంప్యూటర్ తెర అయినా బ్లూ లైట్ ఫిల్టర్ తప్పక వేయండి. నీలికాంతి ప్రభావం మెదడుపై పడకుండా ఉంటుంది.

ఈ రోజుల్లో మానసిక సమస్యలు లేని వారు లేరంటే అతిశయోక్తి కాదు. ఒత్తిడి, యాంగ్జైటీ, కుంగుబాటు.. ఇలా ప్రతి ఒక్కరూ ఏదో ఒక మానసిక సమస్యతో బాధపడుతున్నారు. కారణమేదైనా.. వీరిలో తను బాధను బయటికి చెప్పే వారి కంటే మోనంగా భరిస్తూ లోలోపల కుమిలిపోతున్న వారే ఎక్కువమంది! అయితే ఇలాంటి మానసిక వేదన నుంచి ఎంత త్వరగా బయటపడితే అంత మేలంటున్నారు నిపుణులు. ఈ సైకో థెరపీ ఔషధంలా పనిచేస్తుందని చెబుతున్నారు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి.. తమ బాధను బయట పెడితే చుట్టూ ఉన్న వాళ్ళు ఏమనుకుంటారోనన్న భయం కొందరిని కుంగదీస్తుంటే. ఎవరికి చెప్పుకోవాలో తెలియకపోవడం, ఆయా మానసిక సమస్యల పరిష్కారాల గురించి అవగాహన లేకపోవడం.. స్థిర మరికొందరిని ప్రశాంతతకు దూరం చేస్తున్నారు. ఇలాంటి సమస్యలన్నింటికి ఖిసైకో థెరపీఖి పరిష్కారం చూపుతుందంటున్నారు నిపుణులు. ఎవరికి మేలు? సైకో థెరపీ అనేది మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు చేసే చికిత్స,

# 'సైకోథెరపీ' ప్రయోజనాలెన్నో !

దీన్ని టాక్ థెరపీగానూ పిలుస్తారు. ఇందులో భాగంగా సంబంధిత నిపుణులను సంప్రదించి.. మానసికంగా మిమ్మల్ని ఇబ్బంది పెడుతోన్న ఆలోచనల గురించి వారితో పంచుకోవడం, ఈ కోరిక వాళ్లిచ్చే సలహాలు పాటించడం.. అందుబాటులో ఉండాలి. అయితే ఇది కౌన్సెలింగ్ మాదిరిగానే అనిపించవచ్చు. కానీ ఈ రెండింటికీ మధ్య స్వల్ప వ్యత్యాసం ఉన్నట్లు నిపుణులు. ఒక నిర్దిష్ట సమస్యను పరిష్కరించేందుకు కౌన్సెలింగ్ ఇస్తారని, అది కూడా స్వల్ప కాలంలో పూర్తయ్యే ప్రక్రియ అని చెబుతున్నారు. అదే సైకో చికిత్సలో భాగంగా వివిధ సమస్యలపై దృష్టి సారిస్తారని.. అందుకే కొన్ని సెషన్ల వారిగా ఈ చికిత్సను అందిస్తారని అంటున్నారు. ఇక మీరు సతమతమవుతోన్న మానసిక సమస్యను.. వ్యక్తిగతంగా/బృందంగా /దంపతులకు /కుటుంబ సభ్యులకు.. ఈ నాలుగు రకాల్లో ఏదో ఒక విధంగా వైద్యులు థెరపీ చేస్తారని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు.. ఈ చికిత్స వల్ల ఆయా మానసిక సమస్యల నుంచి విముక్తి పొందడంతో పాటు ఇతర ప్రయోజనాలూ చేకూరుతాయని చెబుతున్నారు. ఈ థెరపీ వల్ల మన ఆలోచనలు, భావాలు, ప్రవర్తనను మరింతగా అర్థం చేసుకోగలుగుతాము.. ఫలితంగా మన గురించి మనం ఎక్కువగా తెలుసుకునే వీలు కలుగుతుందని, మనలోని భావోద్వేగాలను అదుపులో ఉంచుకునే శక్తి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. జీవితమన్నాక ఏదో ఒక సమస్య మనల్ని వెంటాడుతూనే ఉంటుంది. సైకో థెరపీతో ఇలాంటి సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొనే నేర్పు అలవడుతుందంటున్నారు నిపుణులు. . ఈ టాక్ థెరపీలో భాగంగా మన సమస్యలేంటో వైద్యులతో, ఇతరులతో పంచుకుంటాం. దీనివల్ల కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయని.. భవిష్యత్తులో ఏ సమస్య ఎదురైనా ఇతరులతో పంచుకొని.. స్వయంగా పరిష్కార మార్గం వెతుక్కోగలుగుతున్నారని నిపుణులు చెబుతున్నారు.
4. అనుబంధాల్లోని సమస్యలను పరిష్కరించడంలోనూ ఈ సైకో థెరపీ సమర్థంగా పనిచేస్తుంది.





# ఇవన్నీ బిస్కెట్లే !

జంతికలూ, బూందీ అందరికీ నచ్చకపోవచ్చు. కొబ్బరిబూరెలూ, అరిసెలూ తినకూడని వాళ్లుండొచ్చు. కానీ బిస్కెట్లు అలా కాదు. ఎవరికైనా నచ్చేస్తాయి. ఏ పిండివంటలు ఉన్నా లేకున్నా మనందరి ఇళ్లల్లో బిస్కెట్ ప్యాకెట్లు తప్పనిసరిగా ఉంటాయి. భోజనం ఆలస్యమయ్యేట్లుంటే అవే మనకు తక్షణ ఆహారం. చాయ్ లో ముంచుకుని తింటాం. ఉత్తివే కాలక్షేపానికీ ఆరగిస్తాం. ఒక్కోసారి ఇవే మన స్నాక్స్ వాటిల్లో అసంఖ్యాక రుచులూ ఆకృతులూ ఉన్నాయి. బిస్కెట్లు ఇష్టంగా తింటూనే వాటితో కుర్చీలూ బల్లలూ చేసి ఆనంద చిచ్చరపిడుగులు చేస్తున్నారు. ఎంత కళాహృదయం కదూ! మీ చిన్నారులను ఒకసారి ప్రయత్నించి చూడమనండి!

















# ఆది దైవం


మానవ లోకంలో, మనుషులకుసాధారణంగా ఎదురయ్యే ఆటంకాలను అడ్డుకుంటూ, నిర్విఘ్నంగా జీవితం సాగాలంటే, గణాధిపతి అయిన గణపతే శరణ్యం ఏ పుణ్యకార్యాలు జరిగినా పూజలు ఉన్నా మొదటగా, అర్చించబడే దేవుడు వినాయకుడు. ఏటేటా వినాయక చతుర్థి జరగని చోటు ఉండదు. ఉత్సవాలతో, ఊరేగింపులతో, తొమ్మిదిరోజులు గణపతి నవరాత్రులను నిర్వహణలతో, ఆటపాటలతో మారుమ్రోగుతూ, కళాకారుల సందళ్ళతో వినాయక చవితి పందిళ్ళు కలకలాడుతూ, భక్తులందరికీ కనువిందు చేస్తాయి. వ్రతాలు, వివాహాలు మొదలుగా ప్రతి ఇంటిపండుగల్లో, ప్రాతినిధ్యం వహిస్తూ వారి వారికోరికలను తీర్చే ఆది దైవం వినాయకుడు ఆయనే లంబోదరుడు. తల్లియైన పార్వతి చేసిన పసుపు ముద్దతో రూపుదిద్దుకున్న బాలుడు, తండ్రిని అడ్డుకున్న ఆగ్రహానికి గురై తదుపరి ఏనుగు తలతో గుజ్జు రూపంతో, ఎలుక వాహనంగా, అవతరించి అందరినీ ఆదుకునే గజముఖుడిగా, నవగ్రహాధిపతిగా నిలిచి, నీరాజనాలు అందుకునే, ప్రథముడే గణేశుడు. పార్వతీ పరమేశ్వరులు కుమారులైన కుమారస్వామిని, వినాయకుడిని, త్రిలోక ప్రదక్షిణచేసే పరీక్షలో, తెలివిగా సోదరుడితో ఎదురైన పోటీలో, తల్లిదండ్రుల చుట్టూ మూడుసార్లు తిరిగి గెలిచి సకల గణాధిపతిగా, ఆధిక్యం పొందిన విజయుడు వినాయకుడు. ప్రపంచంలో మాతాపితరులను సేవిస్తే దొరికే ఫలితాలు, ఎలా ఉంటాయో, వినాయకుడి ఈ చరిత్ర వింటే అర్థం అవుతుంది. తనను చూసి వికటంగా హేళనగా నవ్విన చంద్రుడికి, కోపంతో శపించిన తల్లి కారణంగా చవితినాడు చంద్రుడిని చూసిన వారు నీలాపనిందలకు గురికాగలరని, గణపతి పూజచేసి ఆయనను చూస్తే ఆ ఆపద ఉండదని వినాయక వ్రతకథలో విశదంగా వివరంగా అందరికీ తెలుస్తుంది. పాలలో చంద్రుడిని చూసిన దోషానికి శ్రీకృష్ణుడు, శమంతకమణిని అపహరించిన వాడిగా, నీలాపనిందపాలనడం, తదుపరి మణిని తెచ్చినిందను బాపుకున్న వైనంవిని, కృష్ణుడికి సాధ్యమయిన విషయం సామాన్యులకు ఎలా అని వేడుకొనగా పార్వతీదేవి వినాయక చవితపూజానంతరం , ఆయన కథ చదివి అక్షింతలు వేసుకుని చంద్రుడిని చూస్తే నీలాపనిందలు తొలగిపోతాయని అభయంతో అనుగ్రహిస్తుంది.



ఆధ్యాత్మికం

# శిరోజాలకు వంట సోడా

ఆయా సీజన్లకు తగ్గట్లు శరీరమెలా స్పందిస్తుందో, జుట్టు ఆరోగ్యం కూడా మారుతూ ఉంటుంది. చాలమందికి చుండ్రు సమస్య వేధిస్తుంది. దీన్ని దూరంగా ఉంచాలంటే కొన్ని చిట్కాలను నిపుణులు సూచిస్తున్నారు.



★ ఈ కాలంలో మాడుపై చర్మం పొడారి, చుండ్రు ఎక్కువగా పెరగడానికి కారణమవుతుంది. దీనివల్ల దురద, ఇన్ఫెక్షన్లూ వస్తాయి. నిర్లక్ష్యం చేస్తే శిరోజాలు రాలే ప్రమాదాన్ని ఆపలేం. అందుకే, ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి. అలాగని గాఢత ఎక్కువగా ఉన్న షాంపూల వినియోగం సమస్యను రెట్టింపు చేస్తుంది.

★ వంటసోడాలో తగినన్ని నీళ్ల కలిపి మాడుకి రాసి అయిదు నిమిషాలుంచాలి. ఆ తర్వాత మృదువుగా చేతులతో రుద్దుతూ గోరువెచ్చని నీటితో శుభ్రపరిస్తే మృతకణాలు దూరమవుతాయి. చుండ్రు సమస్య వదిలిపోవడంతో దురద, శిరోజాలు రాలడం వంటివాటికీ చెక్ పెట్టొచ్చు.

★ తలస్నానానికి ముందు తాజా కలబంద గుజ్జును మాడు నుంచి చివర్ల వరకే రాసి అరగంట ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండు సార్లైనా చేస్తే.. చుండ్రు దూరమవుతుంది. రక్తప్రసరణ బాగా జరిగి జుట్టు రాలడాన్ని అరికడుతుంది. కలబంద గుజ్జులోని యాంటీ ఫంగల్ గుణాలు పొడారడం, దురద వంటివన్నీ దూరం చేస్తాయి.

★ తలస్నానానికి పది నిమిషాల ముందు నిమ్మరసాన్ని రాసి తర్వాత శుభ్రపరిస్తే చాలు. ఇందులోని ఎసిడిటీ మాడుపై పిహెచ్ స్థాయిలను సమన్వయం చేస్తుంది. చుండ్రు పోవడానికి దోహదపడుతుంది.

★. పెరుగును తలకు పట్టించి అరగంట ఆరనివ్వాలి. ఆ తర్వాత గాఢత తక్కువగా ఉన్న షాంపుతో తలస్నానం చేస్తే చాలు. పెరుగులోని లాక్టిక్ యాసిడ్ చుండ్రును తరిమికొడుతుంది. జుట్టుకు మాయిశ్చరైజర్‌లా పనిచేసి మృదుత్వాన్నిస్తుంది.

# తప్పు చేస్తే సారీ చెప్పండి !



అది మర్చిపోవడం కాదు ..
'ఫ్రెండ్ బర్త్‌డే' ఈ నెలే కానీ.. తేదీ ఎప్పుడు? అని ఫేస్‌బుక్‌లో వెతికేయడం! చిన్న లెక్కకీ మెదడు తికమకపడిపోయి కాల్క్యులేటర్‌పై ఆధారపడటం. బాగా ఇష్టమైన సినిమా.. ఆస్వాదించే వంటకం.. మెచ్చిన పాట, నటుడు.. పేర్లు గుర్తుకు తెచ్చుకోవడానికి నానా తిప్పలు పడటం! చివరకు గూగుల్‌లో వెతికి.. అబ్బా.. ఎంత ఆలోచించినా తట్టలేదు అనుకోవడం. ఎప్పుడోకప్పుడు అందరికీ ఎదురయ్యేవే! కానీ తరచుగా జరుగుతోంటేనే డిజిటల్ డిమెన్షియా అయ్యుండొచ్చు అంటున్నారు నిపుణులు. పిల్లలు స్కూలుకి వెళ్లారు. కాస్త సేదతీరుదామనో.. ఆఫీసు పని కోసమనో అస్తమానం 'తెర'కే అతుక్కుపోతోంటే దీని బారిన పడటం ఖాయం. కొన్నిసార్లు ఆలోచించడానికి బద్ధకించి ప్రతిదానికీ ఫోన్ తీయడం వల్ల కూడా మెదడు వేగంగా స్పందించడం, చకచకా జ్ఞాపకాలను వెతికేయడం వంటివి ఆపేస్తుంది. ఫలితమే ఈ మర్చిపోవడమనే సమస్య. చిన్నదే అని పక్కన పెట్టేస్తే.. దీర్ఘకాలంలో మానసిక సమస్యలకు గురికావాల్సి వస్తుంది. కాబట్టి, స్క్రీన్ వాడకాన్ని తగ్గించుకోండి. ఆఫీసులో అయినా సరే.. అస్తమానం కుర్చీకే పరిమితంకాక గంటకోసారి అయినా లేచి అలా నాలుగు అడుగులు వేయండి. వ్యాయామం సంగతేంటి? ఇంట్లో పని ఎక్సర్‌సైజ్‌కి ప్రత్యామ్నాయం కాదు. వారానికి 5 గంటలు వ్యాయామానికి కేటాయించాలినసందే. ఇది శరీరానికే కాదు మెదడునీ దృఢంగా, ఉత్సాహంగా మారుస్తుంది. ధ్యానానికీ అందులో చోటివ్వాలి. ఇక నిద్రకి ఉండే మ్యాజిక్కే వేరు. మెదడుకీ, శరీరానికీ విశ్రాంతినివ్వడమే కాదు జ్ఞాపకాలను జాగ్రత్తగా పొందుపరుస్తుంది. కాబట్టి, దానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిందే. అమ్మాయిలు.. మీకేం మల్టీ టాస్కింగ్ సులువుగా చేసెయ్యగలరు. అంటే పొగడ్తలా తీసుకుని పనులన్నీ నెత్తిన వేసుకునేరు! ఒక సమయంలో ఒక పనినే చేయండి. మెదడుకు కాస్త భారం తగ్గుతుంది. ఏకాగ్రతా కుదురుతుంది. చివరగా ఫోన్ అయినా.. కంప్యూటర్ తెర అయినా బ్లూ లైట్ ఫిల్టర్ తప్పక వేయండి. నీలికాంతి ప్రభావం మెదడుపై పడకుండా ఉంటుంది.




# హాకీ జాతీయ ఛాంపియన్‌గా హార్యానా

**న్యూఢిల్లీ:** హాకీ ఇండియా జూనియర్ పురుషుల జాతీయ ఛాంపియన్‌షిప్-2025లో హార్యానా 3-2 తేడాతో ఒడిశాను ఓడించి ఛాంపియన్‌గా అవతరించింది. పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగిన ఈ టోర్నమెంట్ నాలుగు క్వార్టర్లలో 3-3తో డ్రా అయిన తర్వాత పంజాబ్ షూటౌట్‌లో 4-3తో ఉత్తరప్రదేశ్‌తో జరిగిన 3వ/4వ స్థానం మ్యాచ్‌ను గెలుచుకుని కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. రెండవ క్వార్టర్‌లో ఒడిశా దీపక్ ప్రధాన్ (17వ నిముషం) మరియు ప్రతాప్ టోప్పో (19వ నిముషం) వరుసగా రెండు పెనాల్టీ కార్నర్‌లను గోల్‌గా మార్చడం ద్వారా అద్భుత నైపుణ్యాన్ని ప్రదర్శించింది. మూడవ క్వార్టర్‌లో స్కోర్లు అలాగే ఉన్నా, మ్యాచ్ చివరి క్వార్టర్‌లో హార్యానా ఆటను మలుపు తిప్పింది. చిరాగ్ (50వ నిముషం) పెనాల్టీ కార్నర్ ద్వారా తన జట్టుకు మొదటి గోల్ చేశాడు. మరుసటి నిమిషంలోనే, నితిన్ (51వ, 60వ నిముషం) ఫీల్డ్ గోల్ చేసి ఆటను సమం చేశాడు. చివరి నిమిషంలో నితిన్ ఇద్దరు డిఫెండర్లను దాటుకుని షాట్ కొట్టి హార్యానా తరఫున గోల్ చేసి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాడు. 3వ/4వ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో, ఉత్తరప్రదేశ్ తొలి క్వార్టర్ ప్రారంభంలోనే గోల్ చేయడంతో సత్యం పాండే (8వ నిముషం) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి గోల్‌ను ప్రారంభించాడు. రెండో క్వార్టర్‌లో లవ్‌నూర్ సింగ్ (21వ నిముషం), జప్నీత్ సింగ్ (28వ, 59వ నిముషం) రెండు గోల్స్‌తో పంజాబ్ దూసుకెళ్లింది. మూడవ క్వార్టర్‌లో ఉజ్వల్ పాల్ (48వ నిముషం), ఫహద్ ఖాన్ (57వ నిముషం) గోల్స్ చేసి మళ్లీ ఆధిక్యంలోకి వెళ్లడంతో ఉత్తరప్రదేశ్ జట్టు మలుపు తిరిగింది. ఆట ముగియడానికి కొన్ని సెకన్లు మిగిలి ఉండగానే. పంజాబ్ ఆటగాడు జప్నీత్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్ కొట్టి షూటౌట్‌కు నడిపించాడు. షూటౌట్‌లో చరణ్‌జీత్‌సింగ్, లవ్‌నూర్‌సింగ్, ఓం రజనేష్ సైనీ మరియు సన్నీ పంజాబ్ తరఫున గోల్స్ సాధించారు.

# వరల్డ్ చాంపియన్‌గా చికిత




**న్యూఢిల్లీ:** ప్రపంచ యూత్ ఛాంపియన్‌షిప్ 2025లో అద్భుతమైన ప్రదర్శనతో చికిత్సా తనిపర్తి భారతదేశపు మొట్టమొదటి మహిళా వ్యక్తిగత కాంపౌండ్ జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. కెనడాలోని విన్నిపెగ్‌లో ఆదివారం జరిగిన ప్రపంచ యూత్ ఛాంపియన్‌షిప్‌లో 20 ఏళ్ల ఆమె ఫైనల్‌లో కొరియాకు చెందిన యెరిన్ పార్క్‌ను ఓడించి (142-136) అండర్ 21 మహిళల వ్యక్తిగత బంగారు పతకాన్ని గెలుచుకుంది. ప్రస్తుత ఛాంపియన్‌షిప్‌లలో అన్ని వ్యక్తిగత ఈవెంట్లలో భారతదేశం తరఫున మొదటి బంగారు పతకం సాధించింది. అంతకుముందు, ఆమె తన తోటి దేశస్థురాలు, టాప్ సీడ్ పర్నీత్ కౌర్‌ను ఓడించి సెమీస్‌కు చేరుకుంది, ఆపై స్పెయిన్‌కు చెందిన పౌలా డియాజ్‌పై 142-133 తేడాతో ఆధిపత్య విజయంతో ఆమె ఫైనల్స్‌లో తన స్థానాన్ని నిర్ధారించుకుంది. అండర్ 18 మహిళల వ్యక్తిగత ఈవెంట్‌లో ప్రితికా ప్రదీప్ రజతం గెలుచుకోవడంతో భారతదేశం కాంపౌండ్ డబుల్‌ను తృటిలో కోల్పోయింది, ఫైనల్‌లో యుఎస్ఎకి చెందిన సవన్నా ఓడొన్నోహ్యూ చేతిలో 140-143 తేడాతో ఓడిపోయింది. ఇక కాంపౌండ్ పురుషుల వ్యక్తిగత ఈవెంట్లలో భారత్‌కు పతకాలు రాలేదు. ఆర్చర్లలో ఎవరూ అండర్ 21 సెమీఫైనల్స్‌కు చేరుకోలేదు. యోగేష్ జోషి అండర్ 18 విభాగంలో నాల్గవ స్థానంలో నిలిచాడు. ప్రీతికాతో కలిసి యోగేష్, మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్ అండర్ 18 రజత పతకాన్ని గెలుచుకున్నాడు, అత్యధిక స్కోరింగ్ ఫైనల్‌లో 149-150తో అమెరికన్ జంటపై కేవలం 1 పాయింట్ తేడాతో ఓడిపోయాడు. దీంతో భారత్ అండర్ 18, అండర్ 21 విభాగాలలో ఐదు పతకాలతో కాంపౌండ్ పోటీని ముగించింది. వీటిలో 3 స్వర్ణాలు మరియు 2 కాంస్య పతకాలు ఉన్నాయి.

# షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఐశ్వర్యకు బంగారు పతకం



**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్ రైఫిల్ 50 మీటర్ల 3 పి విభాగంలో ఐశ్వర్య తోమర్ బంగారు పతకం సాధించింది. కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో ఆదివారం జరిగిన 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో స్వర్ణ పతకాన్ని గెలు పొందాడు. ఫైనల్లో ఐశ్వర్య మొత్తం 462.5 పాయింట్లు సాధించి, క్వాలిఫికేషన్ రౌండ్‌లో అగ్రగామిగా ఉన్న చైనాకు చెందిన వెన్యు జావోను 0.5 స్వల్ప తేడాతో ఓడించి తన రెండవ ఆసియా వ్యక్తిగత బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. అంతకుముందు ఐశ్వర్య చైన్ సింగ్, అఖిల్ షెయోరాన్‌లతో కలిసి, పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3పి టీమ్ స్వర్ణాన్ని కోల్పోయి రజత పతకంతో సంతృప్తి చెందింది. ఇందులో ముగ్గురు షూటర్లు వ్యక్తిగత ఫైనల్‌కు చేరారు. చైన్ సింగ్, అఖిల్ కూడా ఫైనల్స్‌లో మంచి ఆరంభాన్ని పొందినా ట్రాక్ కోల్పోయి వరుసగా 4, 5 వ స్థానాలను పూర్తి చేయలేకపోయాడు. దీంతో భారత్ సీనియర్ విభాగంలో ఇప్పట వరకూ 13 పతకాలను కైవసం చేసుకోగా, వీటిలో 5 బంగారు, 2 రజత, 6 కాంస్య పతకాలు సాధించింది.




# లక్కీ ప్లేయర్స్

## ఆసియా కప్ బరిలో తొలిసారి

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ టోర్నమెంట్‌కు మరో పదిహేను రోజుల్లో ప్రారంభమవుతోంది. ఈ ఆసియా కప్ కోసం 15 మంది సభ్యుల భారత జట్టును ఇటీవల ప్రకటించారు. శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా, సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. అయితే తొలిసారి ఆసియా కప్ ఆడుతున్న లక్కీ ఆటగాళ్లు ఉన్నారు. మొత్తంగా ఐదుగురు భారత ఆటగాళ్లు తొలిసారి ఆసియా కప్ బరిలోకి దిగుతున్నారు. వీరిలో ఓపెనర్ అభిషేక్ శర్మ 2024లో అంతర్జాతీయ అరంగేట్రం చేయగా, చివరి ఆసియా కప్ 2023లో జరిగింది. అభిషేక్ టీ20 క్రికెట్‌లో 194 స్ట్రైక్ రేట్ కలిగి ఉన్నాడు. ఇప్పటివరకు తన 17 మ్యాచ్‌ల టీ20 కెరీర్‌లో రెండు సెంచరీలు చేశాడు. అలాగే వరుణ్ చక్రవర్తి 2021 టీ20 ప్రపంచ కప్ ఆడాడు.

కానీ, ఆ తర్వాత జట్టు నుంచి తొలగించబడ్డాడు. 2024లో తిరిగి వచ్చిన తర్వాత, అతను 12 మ్యాచ్‌ల్లో 31 వికెట్లు పడగొట్టాడు. ఆసియా కప్‌లో టీమిండియాకు ప్రధాన, అత్యంత ప్రాణాంతకమైన స్పిన్ బౌలర్‌గా నిరూపించుకోగలడు. ఇక సంజు శాంసన్ 2015లో అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. కానీ, తరచుగా జట్టులోకి రావడం, జట్టులో చోటు కోల్పోవడం వల్ల ఆసియా కప్‌లో ఆడే అవకాశం రాలేదు. అతను ఇంగ్లాండ్‌పై బాగా రాణించలేకపోయాడు. కానీ, అంతకు ముందు 5 ఇన్నింగ్స్‌లలో 3 సెంచరీలు సాధించడం ద్వారా సెలెక్టర్ల నమ్మకాన్ని సంపాదించాడు. భారత జట్టులో ఫినిషర్ పాత్ర పోషిస్తున్న రింకు సింగ్, ఆసియా కప్ జట్టులో చోటు దక్కించుకుంటారనే ఆశ పెద్దగా లేదు. అయినప్పటికీ, అతను జట్టులోకి ఎంపికయ్యాడు. ఎంపికైన కొద్ది రోజులకే, అతను యుపి టీ20 లీగ్‌లో 48 బంతుల్లో 108 పరుగులు చేసి, ఆసియా కప్‌నకు ముందు తన సన్నాహాలు సజావుగా ఉన్నాయని పేర్కొన్నాడు.

చివరిగా వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ అభిషేక్ శర్మ ఐపీఎల్ 2025లో ఆర్‌సీబీ తరపున అనేక తుఫాను ఇన్నింగ్స్‌లు ఆడటం ద్వారా ఆసియా కప్ జట్టులోకి చేరుకున్నాడు. అయితే, అతను వికెట్ కీపర్‌గా ప్లేయింగ్ ఎలెవెన్‌లో చోటు దక్కించుకుంటాడో లేదో స్పష్టంగా లేదు. ముఖ్యంగా శుభ్‌మాన్ గిల్ జట్టులోకి వచ్చిన తర్వాత, ప్లేయింగ్ ఎలెవెన్ కాంబినేషన్‌లో మార్పు ఖచ్చితంగా ఉంటుందని భావిస్తున్నారు.

# మహిళల ఛాంపియన్‌షిప్‌లో భారత్ విజయం

## ఆతిథ్య భూటాన్ 8-0 తేడాతో ఓటమి




**న్యూఢిల్లీ:** మహిళల ఛాంపియన్‌షిప్-2025లో ఆతిథ్య భూటాన్‌ను భారత్ మహిళల ఫుట్‌బాల్ జట్టు ఓడించింది. ఆదివారం థింపులోని చాంగ్లిమితాంగ్ స్టేడియంలో జరిగిన శాఫ్ అండర్ 17 మహిళల ఛాంపియన్‌షిప్‌లో భారత్‌ఆతిథ్య భూటాన్‌ను 8-0 తేడాతో చిత్తు చేసింది. ఈ టోర్నమెంట్‌లో యంగ్ టైగ్రెస్స్‌కు ఇది వరుసగా మూడోవిజయం. అనుష్క (53,61,73) అద్భుతమైన ప్రదర్శనతో పాటు, అభిస్తా బాస్నెట్ (23,89) రెండుగోల్స్ చేయగా, పెర్ల్ ఫెర్నాండెజ్ (71), దివ్యానిలిండా (77), వలైన ఫెర్నాండెజ్ (90+2) లక్ష్యాన్ని చేరుకున్నారు. హాఫ్ టైం ముగిసే సమయానికి భారత్ 1-0తో ఆధిక్యంలో ఉంది. 23వ నిమిషంలో భూటాన్ ప్రతిఘటన దెబ్బతింది. 40వ నిమిషంలో భూటాన్ ఒక ఆశాజనకమైన క్షణాన్ని సృష్టించింది. షెరింగ్ లామో బంతిని కొట్టగా భారత కీపర్ మున్నీ దానిని అందుకున్నాడు. విరామం తర్వాత 53వ నిమిషంలో భారత్ తన ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకుంది. అనుష్క కుమారి 20 గజాల దూరం నుండి ఫ్రీకిక్ కోసం ముందుకు వచ్చి టాప్ కార్నర్‌లోకి విసిరింది, 61వ నిమిషంలో, అనుష్క తన రెండవ గోల్ చేసింది. దివ్యాని ప్రమాదకరమైన క్రాస్ వాంగ్మోను దూరపు పోస్ట్ వద్ద దాటవేయడంతో, మైదానంలో కేవలం మూడు నిమిషాల పాటు ఉన్న ప్రత్యామ్నాయ ఆటగాడు పెర్ల్ ఫెర్నాండెజ్ 71వ నిమిషంలో నాల్గవ గోల్ చేశాడు. అనుష్క తన హ్యాట్రిక్‌తో స్ట్రైక్‌ను విడుదల చేసింది. 25 నిమిషాల్లో ఇది ఆమెకు మూడవ గోల్. చివరిగా వలైన ఫెర్నాండెజ్ 20 గజాల దూరం నుండి గోల్ చేయడంతో భారత్ 8 గోల్స్ చేరి విజయం సాధించింది.

# 56 శాతం ఉండగా 41శాతమే యువత




# 'ఏఐ నైపుణ్యంపై 'మిడిలేజ్' పోటీ!

**హైదరాబాద్,ఆగస్టు24, ప్రభాతవార్త:** ప్రొఫెషనల్స్ రంగంలో ఉన్న మిడిల్‌ఏజ్ వారే ఏఐ స్కిల్స్‌కు పోటీపడుతున్నారు. నాయకత్వం వహించేందుకు ఆసక్తి చూపుతున్నారని గ్లోబల్ జాబ్‌సైట్ ఇండీడ్ రూపొందించిన 'వర్క్ ఆ హెడ్ రిపోర్టు'లో పేర్కొంది. తమ రంగాల్లో అందరి కంటే ముందు ఉండేందుకు అదనపు శిక్షణ కోరుకుంటున్నారు. పోటీగా ఉన్న యువత కంటే మిడిల్‌ఏజ్ ఉద్యోగులు ఉత్సాహం చూపుతున్నారని వివరించింది. అయితే మిడిల్‌ఏజ్‌లో 56శాతం ఉండగా..యువతలో 41శాతమే అదనపు శిక్షణ కావాలని భావిస్తున్నారు. 35 నుంచి 54 వయస్సు ఉన్న వృత్తి నిపుణుల్లో అధిక విశ్వాసం ఉందని, దాదాపు సగం మంది 49శాతం ఏఐ ఇంటిగ్రేటెడ్ వర్క్ ప్లేస్‌లలో పని చేయడానికి సిద్దంగా ఉన్నారని నివేదికలో వెల్లడించింది. ఇక 18-24 వయస్సు యువత అధిగమిస్తున్నారని అభిప్రాయపడింది. ఇక టెక్నాలజీ, రిటైల్, తయారీ, ప్రయాణ, న్యాయ, ఆరోగ్య, సంరక్షణ, మానవవనరులు వంటి 12రంగాల్లోని 3001 మంది బ్లూకాలర్, వైట్‌కాలర్ ఉద్యోగులను సర్వే చేసి నివేదిక సిద్ధం చేసింది. అదేవిధంగా భవిష్యత్తులో ఏఐని వినియోగించాలనుకుంటున్నామని 34శాతం మంది తెలిపారు. 70శాతం మంది బ్లూకాలర్ ఉద్యోగులు తమ పనుల కోసం సాంకేతికతను ఉపయోగిస్తున్నారని, ప్రతి మందిలో ఇద్దరు ఇప్పటికే జెన్‌రేటివ్ ఏఐను వారి పనుల్లో భాగమయిందని వెల్లడించింది.

airtel

# ఎయిర్‌టెల్.. నో సిగ్నల్

## సోషల్‌మీడియాలో నెటిజన్ల ఆగ్రహం

**హైదరాబాద్,ఆగస్టు24, ప్రభాతవార్త:** భారతీ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ మరోసారి సిగ్నల్ల సమస్య ఎదురైంది. దీంతో యూజర్లు సోషల్‌మీడియాలో సంస్థపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 8న ఢిల్లీలో ఎన్‌సీఆర్ పరిధిలో ఎయిర్‌టెల్, జియో నెట్‌వర్క్ నిలిచిపోయిన విషయం తెలిసిందే. మళ్లీ ఆదివారం బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ సహా పలు కీలక నగరాల్లో ప్రభావం కనిపించింది.

దాంతో కాల్స్, ఎస్ఎంఎస్, ఇంటర్‌నెట్ సేవలు స్తంభించాయి. డౌన్‌డెటెక్టర్ నుంచి వచ్చిన డేటా ప్రకారం మధ్యాహ్నం సమయంలో ఫిర్యాదులు వెలువెత్తగా 7,100 మందికి పైగా వినియోగదారులు ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ పనిచేయడం లేదని పేర్కొన్నారు. గంటన్నరల్లో సేవలు పురుద్ధరణయ్యాయని ఎయిర్‌టెల్ కస్టమర్ సపోర్ట్ హ్యాండిల్ ఎయిర్‌టెల్ కేర్స్ ఎక్స్‌వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. తాత్కాలిక కనెక్టివిటీ సమస్యగా పేర్కొంది. సమస్యను గంటలోగా పరిష్కారమవుతుందని పేర్కొంది. యూజర్లు తమ మొబైల్స్‌ను రీస్టార్ట్ చేయాలని సూచించింది. ఎయిర్‌టెల్ ట్వీట్‌లో 'ఈ అసౌకర్యానికి మమ్మల్ని క్షమించండ్డి.. ఈ సమస్య తాత్కాలిక కనెక్టివిటీ అంతరాయం కారణంగా జరుగుతుంది. సుమారు ఒక గంటలో పరిష్కారమవుతుంది. మీ మొబైల్‌ను ఒకసారి రీస్టార్ట్ చేయండి అని పేర్కొంది.

నెట్‌వర్క్‌లో అంతరాయంపై సోషల్ మీడియా వేదికగా యూజర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ వినియోగదారులకు ముందుగా సమాచారం ఇవ్వకూడదా? అంటూ ఓ యూజర్ ప్రశ్నించాడు. మరొకరు గత 6 గంటలుగా ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ సేవలు నిలిచిపోయాయి. కాల్స్ రావడం లేదు.

ఇంటర్నెట్ కూడా స్తంభించింది. కస్టమర్ కేర్ నుంచి కూడా స్పందన లేదని రీట్వీట్ చేశాడు.

# తొలి రుణగ్రహీతలకు

## వర్తించని 'సిబిల్ స్కోర్'




**హైదరాబాద్,ఆగస్టు24, ప్రభాతవార్త:** సిబిల్ స్కోరు లేదనే కారణంతో బ్యాంకులు లోన్ రెక్వెస్ట్ రిజెక్ట్ చేయకూడదని ఆర్థిక శాఖ పేర్కొంది. తొలిసారి లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి సిబిల్ అవసరం లేదని చెప్పింది. అయితే గతంలో లోన్లు తీసుకున్నవారికి సిబిల్ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. పార్లమెంటులో ఇందుకు సంబంధించి అధికారిక ప్రకటన చేసింది. బ్యాంకులకు తమ నిబంధనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకునే అధికారం ఉంటుంది. అయితే తొలిసారి లోన్ దరఖాస్తు చేసుకునేవారికి సిబిల్ వర్తించదని చెప్పింది. మొదటి సారి లోన్ కోసం అప్లై చేసివారికి సిబిల్ స్కోరు లేకపోగా.. సున్నా ఉన్నా బ్యాంకులు లోన్ రిజెక్ట్ చేయకూడదని వివరించింది. అయితే ఇప్పటికే రుణాలు తీసుకున్నవారికి మాత్రం సిబిల్ స్కోరు నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది. గతంలో ఎక్కడైనా లోన్లు తీసుకున్నాడా, సెటిల్మెంట్లు ఏమైన ఉన్నాయా, రీపేమెంట్ హిస్టరీ వంటి వివరాల గురుంచి బ్యాంకులు ఎంక్వైరీ చేసుకోవచ్చని చెప్పారు. పాత కస్టమర్లకు మాత్రం బ్యాంకులు సిబిల్ స్కోరును ప్రామాణికంగా తీసుకునే అధికారం ఉంటుంది. స్కోరు తక్కువ ఉంటే లోన్ దరఖాస్తును రిజెక్ట్ కూడా చేయవచ్చు. ఇది బ్యాంకు అంతర్గత పాలసీలపై ఆధారపడి ఉంటుంది. రూ.100 వరకు ఫీజుకాగా, సిబిల్ రిపోర్టులను కస్టమర్లకు ఇచ్చేందుకు క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలు గరిష్టంగా రూ.100 వరకు మాత్రమే ఛార్జీలు వసూలు చేయాలని, అంతకుమించి అనుమతి లేదని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. అయితే ఏడాదికి ఒకసారి మాత్రం క్రెడిట్ రిపోర్టును ఉచితంగా అందించాలనే నిబంధన ఉందని చెప్పింది. సిబిల్ స్కోరు సాధారణంగా 600 నుంచి 900 మధ్య ఉంటుంది. ఈ స్కోరు 750 కంటే ఎక్కువగా ఉంటే మంచి కస్టమర్ అని బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు భావిస్తాయి. వడ్డీ రేటు కూడా తక్కువగా ఉంటుంది. అదే స్కోరు తక్కువగా ఉంటే లోన్ వచ్చే అవకాశాలు తగ్గిపోతాయి. ఒకవేళ లోన్ ఇచ్చినా అధిక వడ్డీ రేట్లు ఉంటాయి. అయితే తొలిసారి లోన్ తీసుకునేవారి సిబిల్ స్కోరు సున్నాగా ఉంటుంది లేదా. కన్పించదు. వీరు లోన్ తీసుకున్న తర్వాత స్కోరు జనరేట్ అవుతుంది. రీపేమెంట్లు టైమ్‌కి చేస్తుంటే స్కోరు పెరుగుతుంది. ఒకవేళ ఆలస్యమైతే స్కోరు తగ్గుతుంది. ఎప్పుడూ సిబిల్ స్కోరును పెంచుకునేందుకే ప్రయత్నించాలి.

# ఓవర్‌టైం డ్యూటీపై ఆరోగ్య ప్రభావం!



**హైదరాబాద్,ఆగస్టు24, ప్రభాతవార్త:** ఉద్యోగంలో కనీసం కాకుండా అధికంగా పని చేస్తే ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని అధికస్థాయిలో చెప్పగా...పరిహారం ఇస్తే అంగీకరిస్తామని ఓ సంస్థ సర్వేలో వెల్లడైంది. పనిగంటల పొడిగింపుపై జరుగుతున్న చర్చనేపథ్యంలో సర్వేనిర్వహించింది. చాలా మంది వ్యతిరేకిస్తున్నారు. అయితే అధిక పనిగంటలు వ్యక్తిగత సమయం, ఆరోగ్యంతోపాటు పని, జీవన సమతుల్యత ప్రతికూల ప్రభావం చూపుతున్నట్లు 44శాతం అభిప్రాయపడినట్లు నివేదిక అందించింది. జీనియస్ డిజిపోల్ అనే మానవ వనరుల కన్సల్టెన్సీ 'పనిగంటల పొడిగింపు' అంశంపైఇటీవల ఆన్ లైన్ సర్వే జరిపింది. జూలై1 నుంచి 31 మధ్య కాలంలో చేసిన ఈ సర్వేలో దాదాపు 2076మంది ఉద్యోగులు పాల్గొన్నారని వివరించింది. ఇందులో మెజారీ ఉద్యోగులు వ్యక్తిగత ఆరోగ్యంపై చెప్పారు. మరో 16శాతం మంది విధానానికి కట్టుడిఉన్నామని, ఉత్పాదకత పెంచేందుకు దోహదం చేస్తుందనిభావిస్తున్నట్లు తెలిపినట్లు వెల్లడించింది. పనిగంటలకు సంబంధించిన విదానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం , పారదర్శకతపై ఉద్యోగులు స్పష్టమైన వైఖరితో ఉన్నట్లు తెలిపింది. ఈ సంప్రదింపుల్లో తమకు కూడా బాగస్వామ్యం ఉండాలని ఇంకో 79శాతం మంది కోరుకుంటున్నారు. అంతేకాదు ఇటువంటి చర్చలు బహిరంగంగా ఉండడంతో పాటు విధాన రూపకల్పన పారదర్శకంగా జరగాలని ఆశిస్తున్నారు. నేటి శ్రామికశక్తి మార్పునకు వ్యతిరేకంగా లేదు. నిష్పక్షపాత, ఆలోచనలను పంచుకోవడం కోరుతుంది. ఆలోచనపరమైన ప్రణాళిక లేకుండా ఎక్కువ పని చేయించడం ఉద్యోగులు, యజమాన్యాల మధ్య దూరాన్ని పెంచుతుంది. ఉత్పాదకత అనేది కేవలం ఉద్యోగులు వెచ్చించే సమయంపైనే కాకుండా వాళ్ల శక్తి యుక్తులపై ఆధారపడి ఉంటుందని సంస్థలు గుర్తించాలని జీనియస్ హెచ్‌ఆర్‌టెక్ వివరించింది.

వాణిజ్యం




# ఎస్ బ్యాంకులో 'జపాన్' భాగస్వామ్యం

**హైదరాబాద్, ఆగస్టు24, ప్రభాతవార్త:** ఎస్ బ్యాంకులో జపాన్ దేశం భాగస్వామ్యమైంది. 24.99 శాతం వాటా కొనుగోలుకు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) అనుమతిచ్చింది. ఈ మేరకు సుమిటోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబిఎస్)తో ఒప్పందం కుదుర్చుకోనుంది. 2025 మే 9న స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) నుంచి 13.19శాతం వాట, ఏడుగురు వాటాదార్ల నుంచి 6.81శాతం వాటాను కొనుగోలు చేయడంతో ఎస్ బ్యాంకులో 20శాతం వాటాను కొనుగోలు చేస్తానని కార్పొరేషన్ ప్రతిపాదించింది.

ఇతర వాటాదారులలో యాక్సిస్, బంధన్ బ్యాంకులు, ఫెడరల్, హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ, ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంక్, కోటక్‌మహేంద్ర బ్యాంకులు ఉన్నాయి. బ్యాంక్ పెయిడప్ షేర్ క్యాపిటల్, ఓటింగ్ హక్కుల్లో 24.99వరకు కొనుగోలుకు ఆమోదం లభించిందని ఎస్ బ్యాంక్ నియంత్రణ సంస్థలకు వెల్లడించింది. ఆమోదం లేఖ ఏడాదిపాటు చెల్లుబాటులో ఉంటుందని వివరించింది. కొనుగోలు ప్రకారం ఎస్ఎంబిసిని బ్యాంక్ ప్రమోటర్‌గా పరిగణిం, బోమని ఆర్‌బిఐ స్పష్టం చేసిందని పేర్కొంది.

# త్వరలో ఆకట్టుకునే కొత్త 'వాట్సాప్ ఫీచర్లు'




**హైదరాబాద్,ఆగస్టు24, ప్రభాత వార్త:** ప్రముఖ సోషల్ మెస్సెజ్ వాట్సాప్ యువతను ఆకర్షించే మరికొన్ని ఫీచర్లు త్వరలో అందు బాటులోకి వస్తుంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ వినియోగదారుల కోసం అప్డేట్స్ ఉంటాయని కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో కమ్యూనికేషన్ మరింత సులభ తరం అవుతుందని భావిస్తున్నారు. ఇది యువతకు ఎంతో నచ్చుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. వాట్సాప్‌లో వాయిస్ మెయిల్, ఎమోజీ రియాక్షన్ ప్యానల్, వాయిస్ మెసేజ్‌లతో మిస్డ్‌కాల్స్‌లాంటి ఆప్షన్స్ ఉంటాయి. ఐఓఎస్ యూజర్ల కోసం వాట్సాప్‌లో సరికొత్త ఫీచర్ ఏర్పాటుకానుంది. ఇక వాయిస్ మెయిల్స్‌కు స్పందించకపోతే స్క్రీన్‌పై ఒక ప్రాంప్ట్ కనిపిస్తుంది, మీరు పంపాలనుకున్న మెసెజ్‌ను వెంటనే రికార్డ్ చేసి పంపిచవచ్చు. ఇది మెసేజ్ చాటింగ్‌లో కనిపిస్తుంది. దీంతో కమ్యూనికేషన్ వేగం పెరుగుతుందని ప్రతినిధులు భావిస్తున్నాయి. యూజర్లు ఏదైన సమాచారాన్ని కాపీ చేసేటప్పుడు భారీ సందేశం కాకుండా తక్కువ ఉన్న వ్యాఖ్యలను కాపీ చేసుకోవచ్చని, ఒకే పదాన్ని, పేరా గ్రాఫ్‌ను కాపీ చేయవచ్చన్నారు. అదేవిధంగా వాట్సాప్ అక్కౌంట్ సెంటర్ ద్వారా ఇన్‌స్టాగ్రామ్‌కు లింక్ చేసుకునే ఫీచరును కూడా మెటా అభివృద్ధి చేస్తుంది. ఒకసారి ఇన్‌స్టాలో అక్కౌంట్‌ను వాట్సాప్‌కు లింక్ చేస్తే వాట్సాప్ ప్రొఫైల్‌లో సోషల్ ఐకాన్ కనిపిస్తుంది. దీంతో అఫీషియల్ ఇన్‌స్టా అక్కౌంట్‌ను వాట్సాప్ వినియోగదారులు సైతం కొనసాగించవచ్చని వివరించాయి. అలాగే ఎమోజీ రియాక్షన్ ప్యానల్ సరికొత్తగా లేఅవుట్‌ను మరింత స్పష్టంగా ఉండేలా అభివద్ధి చేస్తున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.